ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి




# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY


అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్త వారికి కూడా అవకాశం
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

బుధవారం 09 సెప్టెంబర్ 2026 | Wednesday 09 Septembar 2026 | హైదరాబాద్ | ⇨ పేజీలు: 12+12 | ⇨ వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 28 సంచిక: 148 | Vol.No 28 Issue No .148 | Hyderabad | www.visionandhra.in

## బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్-2026

- పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్,సెప్టెంబర్8 : తెలంగాణ విశిష్ట సంస్కృతి, సంప్రదాయాలకు సజీవ ప్రతీక అయిన బతుకమ్మ పండుగ ప్రాశస్త్యాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడంతో పాటు యువతలోని సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న 'బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ 2026'ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ, రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ శంకర్

మిగతా2లో..

## నగరంలో మరో భారీ ఫ్లైఓవర్..

- బంజారాహిల్స్ నుంచి గచ్చిబౌలి మధ్య నిర్మాణం!
- బిడ్లు స్వీకరిస్తున్నట్టు తెలిపిన అధికారులు



హైదరాబాద్,సెప్టెంబర్8 : హైదరాబాద్ నగరంలో కీలక ప్రాంతమైన ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు హెచ్‌ఎండీఏ ఒక కొత్త ఎలివేటెడ్ కారిడార్ నిర్మించబోతోంది.

మిగతా2లో..

## కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాల సాగుకు పెద్దపీట

- రైతుల ఆదాయం పెంపే లక్ష్యం.. సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి
- ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి పొదుపు సాగు పద్ధతులకు ప్రోత్సాహం



హైదరాబాద్, సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర): రాష్ట్రంలో కూరగాయలు, పండ్ల తోటలు, చిరుధాన్యాలు, ఇతర ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. రైతుల ఆదాయాలను పెంచే దిశగా లాభదాయకమైన కూరగాయలు, ఉద్యాన పంటల సాగును విస్తృతంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో కూరగాయలు, పండ్ల తోటలు, చిరుధాన్యాలు, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు చేపడుతున్న

మిగతా2లో..

## శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా

- నాకు మంత్రి పదవి ఇవ్వడం అధిష్ఠానం నిర్ణయం
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి



హైదరాబాద్,సెప్టెంబర్8 : తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో కేబినెట్ విస్తరణ, మంత్రుల శాఖల మార్పుపై ఊహాగానాలు షికారు చేస్తున్న వేళ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. గాంధీ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం కేబినెట్‌లో ఉన్న మంత్రుల శాఖలన్నింటినీ సమూలంగా పునర్వ్యవస్థీకరించి, కొత్త శాఖలను కేటాయించాలని తాను కాంగ్రెస్ హైకమాండ్‌కు

మిగతా2లో..

## ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ బియ్యం.. ఎగుమతుల విస్తరణకు ఉత్తమ్ చర్చలు

- భారీగా బియ్యం సరఫరాకు రాష్ట్రం సిద్ధం
- మాంసం, విత్తనాల ఎగుమతులపైనా ఫిలిప్పీన్స్ ఆసక్తి



హైదరాబాద్, సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర):న్యూఢిల్లీ: ఫిలిప్పీన్స్‌తో బియ్యం ఎగుమతులతో పాటు వ్యవసాయ, ఆహార ఉత్పత్తుల వాణిజ్యాన్ని మరింత విస్తరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణ నీటిపారుదల, ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం న్యూఢిల్లీలో ఫిలిప్పీన్స్ వ్యవసాయ కార్యదర్శి, క్యాబినెట్ సభ్యుడు ఫ్రాన్సిస్కో పి. టు లారెల్ జూనియర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్‌కు భారీగా బియ్యం ఎగుమతి చేసే అవకాశాలతో పాటు ఇరు ప్రాంతాల మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే అంశాలపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ దేశంలోనే ప్రముఖ వరి ఉత్పత్తి రాష్ట్రంగా ఎదిగిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అధిక పరిమాణంలో నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయగల ఉత్పత్తి సామర్థ్యం, ఆధునిక రైస్ మిల్లింగ్ మౌలిక వసతులు, అనుభవం రాష్ట్రానికి ఉన్నాయని వివరించారు. తెలంగాణ నుంచి భారీగా బియ్యం సేకరించే అవకాశాన్ని

మిగతా2లో..

## తెలంగాణ మండలిలో హైటెన్షన్.. తాతా మధును లాక్కెళ్లిన మార్షల్స్

- మీడియా పాయింట్ వద్ద ఉద్రిక్తత.. వెళ్లేందుకు నిరాకరించడంతో బలవంతంగా తరలింపు
- స్పీకర్‌పై వ్యాఖ్యల నేపథ్యంలో ఇప్పటికే సస్పెన్షన్ వేటు



హైదరాబాద్, సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర): తెలంగాణ శాసనమండలి ప్రాంగణంలో మంగళవారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును మార్షల్స్ బలవంతంగా మండలి ప్రాంగణం వెలుపలికి తరలించారు. ఈ ఘటనతో మండలి ఆవరణలో కొద్దిసేపు గందరగోళ

మిగతా2లో..

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలపై సస్పెన్షన్ వేటు

- తీర్మానాన్ని ప్రవేశపెట్టిన మంత్రి దామోదర రాజనర్సింహ
- కేసీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని తీర్మానంలో డిమాండ్



బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ సమావేశాల కాలం మొత్తం వారిని సస్పెండ్

మిగతా2లో..

## అసెంబ్లీ ఆవరణలో కుప్పకూలిన అధికారి..

- సీపీఆర్ చేసిన మంత్రి శ్రీహరి,
- వైద్య సిబ్బందిని వెంటనే పిలిపించిన వైనం
- ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి



హైదరాబాద్, సెప్టెంబర్ 8 : తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో మంత్రి వాకిటి శ్రీహరి మానవత్వం చాటుకున్నారు. నవీన్ మిట్టల్ పీఎస్ రాజు అకస్మాత్తుగా అక్కడే కుప్పకూలడంతో మంత్రి వెంటనే స్పందించారు. ఆయనకు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించారు. అనంతరం వైద్య సిబ్బందిని పిలిపించిన మంత్రి.. రాజుకు వెంటనే వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. అంబులెన్స్ రప్పించి బాధితుడిని ఆసుపత్రికి తరలించేలా ఏర్పాట్లు చేశారు. అయినప్పటికీ లాభం లేకపోయింది. మార్గమధ్యంలో అంబులెన్సులోనే పీవీ రాజు తుది శ్వాస విడిచారు. అసెంబ్లీ ఆవరణలో రాజు కుప్పకూలిన వెంటనే మంత్రి శ్రీహరి స్పందించిన తీరుపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. అత్యవసర పరిస్థితిలో వెంటనే స్పందించి సీపీఆర్ చేయడాన్ని అభినందిస్తున్నారు.

## 'కేసీఆర్‌ను చంపే కుట్ర జరుగుతోంది'..

### - కేటీఆర్ సంచలన ఆరోపణలు

- కాంగ్రెస్ చేపట్టిన ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి కార్యక్రమంపై కేటీఆర్ ధ్వజం
- కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని విమర్శ
- ప్రభుత్వంపై డైవర్షన్ రాజకీయాల ఆరోపణ
- అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్
- దళిత, గిరిజన హామీలు అమలు చేయాలని డిమాండ్



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ శ్రేణులు కుట్రపూరితంగా హత్యాయత్నం చేశాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి పేరుతో కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని మండిపడ్డారు. ఫాంహౌస్‌కు వెళుతున్న తమను అరెస్ట్ చేసి బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన

మిగతా2లో..

## చావు రాజకీయాలు చేయిస్తారా?

- కేసీఆర్‌ను అంతమొందించేందుకు కుట్ర
- కేసీఆర్ నివాసం ముట్టడి రేవంత్ ఆలోచనే
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి




హైదరాబాద్,సెప్టెంబర్8 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను భౌతికంగా అంతమొందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని... స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన చావును కోరుకుంటున్నారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈరోజు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ... షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మీడియా ముఖంగా చేసిన అనుచిత వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ

మిగతా2లో..

## యూట్యూబర్ 'నందు'కు నోటీసులు..

- శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో అడ్డుకున్న అధికారులు



హైదరాబాద్,సెప్టెంబర్8 : చీటింగ్ కేసుకు సంబంధించి యూట్యూబర్, 'నందూస్ వరల్డ్' యూట్యూబ్ చానల్ నిర్వాహకురాలు నందనకు సోమవారం నోటీసులు జారీ చేసినట్లు ఇబ్రహీంపట్నం సీఐ

మిగతా2లో..

## సీపీఎంలో కలకలం

- జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య సస్పెన్షన్
- నూతన జిల్లా కార్యదర్శిగా బోడ సామిల్ ఎన్నిక
- జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కవిత పునరుద్ధరణ
- యాదయ్య వ్యవహారం వల్ల జాన్ వెస్లీకి కలంకం

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర ): సీపీఎం పార్టీలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. పార్టీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారనే ఆరోపణలతో సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్యపై పార్టీ వేటు వేసింది. ఆయనను ఆరు నెలల పాటు పార్టీ నుంచి బహిష్కరిస్తూ జిల్లా కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుంది. సస్పెన్షన్ కాల వ్యవధిలో గ్రామస్థాయి శాఖ సమావేశాల్లో పాల్గొనేందుకు కూడా వీలు లేకుండా చేసింది. దాంతో ప్రజాసంఘాల పేరుతో ఆయన కార్యక్రమంలో పాల్గొనవచ్చని సూచించినట్లు సమాచారం.





పార్టీలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కవిత అనే మహిళా కామ్రేడ్‌పై తీసుకున్న క్రమశిక్షణా చర్యలు, సస్పెన్షన్ వ్యవహారమే ఈ పరిణామాలకు ప్రధాన కారణమైనట్లు తెలిసింది. కవితను పార్టీ నుంచి బహిష్కరించడంలో జిల్లా నాయకత్వం నిబంధనలను పాటించలేదనే కేంద్ర నాయకత్వం భావించినట్లు తెలిసింది. పార్టీలో కామ్రేడ్స్ తప్పు చేస్తే సరిదిద్దాల్సిన బాధ్యత రాష్ట్ర, జిల్లా కమిటీలపై ఉందని, అంతేగానీ ఏకపక్షంగా సస్పెన్షన్ వేటు వేయడం సరికాదని అభిప్రాయ పడినట్లు వినికిడి. కవిత సస్పెండ్స్ విషయంలో జిల్లా పార్టీ రెండు గ్రూపులుగా విడిపోయిందనే ప్రచారం జోరందుకుంది. కవితకు మద్దతుగా కొందరు, వ్యతిరేకంగా మరికొందరు వర్గాలుగా చీలిపోవడంతో పార్టీలో అంతర్గత కుమ్ములాటలు బయటపడ్డాయి.

**కేంద్ర కమిటీ సీరియస్.. రాష్ట్ర కార్యదర్శికి మందలింపు**

సీపీఎం జిల్లా కమిటీలో జరిగిన ఈ పరిణామాలపై కవిత నేరుగా సీపీఎం కేంద్ర కమిటీకి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఆమె ఫిర్యాదును స్వీకరించిన కేంద్ర కమిటీ సమగ్ర విచారణ చేపట్టింది. రంగారెడ్డి జిల్లా సీపీఎం పార్టీలో జరుగుతున్న పరిణామాలను నిష్పంగా పరిశీలించింది. విచారణలో భాగంగా కవితను సస్పెండ్ చేసిన తీరు

మిగతా2లో..

## అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- సోషల్ మీడియాను యాక్టివ్ గా వాడాలి,
- టీడీపీ నేతలకు నారా లోకేశ్ దిశానిర్దేశం



అమరావతి,సెప్టెంబర్8 : తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో రెండో రోజు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నేతలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. 'పొలిటికల్ కమ్యూనికేషన్ అండ్ పబ్లిక్ ఓరియంటేషన్' అనే అంశంపై మాట్లాడుతూ, ఆయన నేరుగా సభికులను "మీలో ఎంతమంది సోషల్ మీడియాను చురుకుగా వినియోగిస్తున్నారు?" అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నతోనే సాంకేతికతను రాజకీయ ప్రచారానికి వాడుకోవాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు. "సోషల్ మీడియానే కదా అని తేలిగ్గా తీసుకోవద్దు. దీనిపై చాలా సీరియస్‌గా ఉండాలి" అని లోకేశ్ నేతలకు స్పష్టం చేశారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు

మిగతా2లో..

## అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

చేరవేయాలని ఆయన సూచించారు. చిన్న స్థాయి నాయకులైన ఏఎంసీ, కార్పొరేషన్ ఛైర్మన్లు కూడా తాము చేస్తున్న పనులను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వివరిస్తున్నారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీని ఆయన ఉదాహరణగా చూపారు. ప్రధాని మోదీ సైతం తన సందేశాలను సెల్ఫీ వీడియోల ద్వారా ప్రజలకు చేరవేస్తున్నారని లోకేశ్ పేర్కొన్నారు. తాను కూడా సుజ్లాన్ విండ్ ప్రాజెక్టు శంకుస్థాపన, డీఎస్సీపై జరుగుతున్న దుష్ప్రచారం వంటి అంశాలపై సెల్ఫీ వీడియోలు తీసి వాస్తవాలను ప్రజల ముందు ఉంచానని తెలిపారు. విషయం చిన్నదైనా, పెద్దదైనా ప్రజలకు నిజాలు తెలియజేయాల్సిన బాధ్యత నేతలపై ఉందని అన్నారు. ప్రతిపక్షాల తీరుపై లోకేశ్ తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్షం పని కేవలం ప్రభుత్వంపై బురదజల్లడమేనని, వారి దుష్ప్రచారాన్ని సోషల్ మీడియా వేదికగా ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వైసీపీ నేతలు, కార్యకర్తలు తమ నాయకుడు 'జగన్ మావిగన్' అంటే గుడ్డిగా సమర్థిస్తున్నారని, కానీ టీడీపీ అలా కాకుండా వాస్తవాలతో ప్రజల్లోకి వెళ్లాలని చెప్పారు. అమరావతిని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని, ఈ విషయాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

## 'కేసీఆర్‌ను చంపే కుట్ర జరుగుతోంది'..

సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ నివాస ప్రాంగణం వరకు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు ఎలా అనుమతించారని కేటీఆర్ ప్రశ్నించారు. తమ సొంత ఇంటికి తాము వెళుతుంటే పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారో డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ శ్రేణుల దాడులను పట్టించుకోకుండా బీఆర్ఎస్ నేతలను మాత్రమే పోలీసులు లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. ప్రజల దృష్టిని ప్రభుత్వ వైఫల్యాల నుంచి మళ్లించేందుకే డైవర్షన్ రాజకీయాలకు తెరలేపారని అన్నారు. "డైవర్షన్, డిస్ట్రక్షన్, డిస్ట్రాక్షన్ తప్ప రేవంత్‌రెడ్డికి మరో విద్య తెలియదు" అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ సమావేశాల సమయాన్ని ప్రజా సమస్యలపై ఉపయోగించాలని కేటీఆర్ సూచించారు. కేసీఆర్, బీఆర్ఎస్ నేతలను విమర్శించేందుకు సభను ఉపయోగించుకోవడం సరికాదన్నారు. ఇందుకోసం ఒక రోజు కేటాయించి.. మిగిలిన రోజుల్లో ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు. దళితులపై ప్రభుత్వానికి నిజమైన ప్రేమ ఉంటే దళిత, గిరిజన డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలని కేటీఆర్ కోరారు. దళితబంధు కింద ఒక్కొక్కరికి రూ.12 లక్షలు ఇస్తామని చెప్పి.. కనీసం రూ.12 పైసలు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని.. సరైన సమయం వచ్చినప్పుడు ఈ ప్రభుత్వానికి ప్రజలే సమాధానం చెబుతారని కేటీఆర్ అన్నారు.

## చావు రాజకీయాలు చేయిస్తారా?

నిప్పులు చెరిగారు. కేసీఆర్ నివాసమైన ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌పై దాడులు చేస్తామని, 'చావు డప్పు' కొడతామని ఎమ్మెల్యే శంకర్ బహిరంగంగా వ్యాఖ్యానించడం రాజ్యాంగ ఉల్లంఘన అని మండిపడ్డారు. "వెయ్యి డప్పులతో కేసీఆర్ ఇల్లు ముట్టడిస్తామన్నది శంకర్ వ్యక్తిగత మాట కాదు. అది వెనుకుండి నడిపిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనే" అని ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల వేళ సభ్యులను సభకు రానివ్వకుండా కేసీఆర్ ఫాంహౌస్ కు కాంగ్రెస్ శ్రేణులను పంపి దాడులు చేయించడాన్ని తీవ్రంగా ఖండించారు. కేసీఆర్ చావు గురించి మాట్లాడినందుకు గాను రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌ను నేరుగా రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేకనే కాంగ్రెస్ ఈ రకమైన దిగజారుడు వ్యాఖ్యలు చేస్తోందని ఎద్దేవా చేశారు. హత్యారాజకీయాలను ప్రోత్సహిస్తూ, మాజీ ముఖ్యమంత్రి ప్రాణాలకు హాని తలపెట్టేలా తీవ్ర వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, వేముల వీరేశంలపై రాష్ట్ర డీజీపీ తక్షణమే సుమోటోగా కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్-2026

నాయక్, ఎఫ్‌డీసీ ఎండీ జి. ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, సెట్విన్ మాజీ చైర్మన్ గిరిధర్ రెడ్డిలతో కలిసి సచివాలయంలో ఈ ఛాలెంజ్ అధికారిక పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ... షార్ట్ ఫిలింలు, బతుకమ్మ పాటలు, సృజనాత్మక వీడియోల ద్వారా తమ ప్రతిభను చాటుకోవాలనుకునే యువ ఫిలిం మేకర్లకు ఈ ఛాలెంజ్ ఒక అద్భుత వేదికగా ఉపయోగపడుతుందన్నారు. బతుకమ్మ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, జానపద కళలు, సంప్రదాయాలతో పాటు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కూడా ప్రతిబింబించేలా షార్ట్ ఫిలింలను రూపొందించవచ్చని తెలిపారు. ఈ పోటీల్లో యువ దర్శకులు, విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటాలని ఆకాంక్షించారు.

## కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాల సాగుకు పెద్దపీట

చర్యలపై ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆల్తాస్ జనయ్య, పి.వి. నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం. జ్ఞాన్ ప్రకాష్, ఉద్యానవన విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలు, ప్రత్యామ్నాయ పంటల సాగుకు అనుకూలమైన ప్రాంతాలను గుర్తించి, అందుకు అనుగుణంగా పంటలను ఎంపిక చేయాలని సీఎస్ సూచించారు. రైతులకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక సహాయంతో పాటు ఇతర మద్దతు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పంటలకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించడంతో పాటు విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, మార్కెట్ అనుసంధానాలను బలోపేతం చేయాలని సూచించారు. రైతులకు అవసరమైన మద్దతు కల్పించేందుకు నాబార్డ్ (చీూదీూ=ణ)తో పాటు సంబంధిత ప్రభుత్వ, ఇతర సంస్థల సహకారాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సంజయ్ జాజు తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన ధరలు లభించేలా విలువ గొలుసును బలోపేతం చేయడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచే చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. ముఖ్యంగా ఉద్యాన, ప్రత్యామ్నాయ పంటల్లో లిలిబిందు సేద్యం, ఇతర నీటి పొదుపు సాగు పద్ధతులనులిలి విస్తృతంగా ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ సాగు విధానాలపై సమగ్ర మార్గదర్శకత్వం అందించేందుకు వ్యవసాయ, ఉద్యానవన శాఖలు, వ్యవసాయ మరియు పశు వైద్య విశ్వవిద్యాలయాలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సీఎస్ పిలుపునిచ్చారు. వాతావరణ మార్పులను తట్టుకునే లిలిసుస్థిర వ్యవసాయ విధానాలనులిలి ప్రోత్సహిస్తూ రైతుల ఆదాయాలను పెంచేలా కార్యాచరణ రూపొందించాలని ఆయన సూచించారు.

## డీఎస్సీపై వైసీపీ దుష్ప్రచారం చేస్తున్నది

### - పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్

అమరావతి,సెప్టెంబర్8 : టీడీపీ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్నది 100 శాతం దుష్ప్రచారమేనని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తీవ్రంగా విమర్శించారు. కూటమి ప్రభుత్వం సాధిస్తున్న విజయాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే వైసీపీ ఈ తరహా డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపిందని ఆయన ఆరోపించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెలిగొండ ప్రాజెక్టు, పోలవరం ఎడమ కాలువ నుంచి నీటిని విడుదల చేయడంతో రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో తమ ఓటు బ్యాంకుకు నష్టం జరుగుతుందనే భయం వైసీపీని వెంటాడుతోందని బోడే ప్రసాద్ అన్నారు. అందుకే ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ భుజానికెత్తుకున్నారని విమర్శించారు. డీఎస్సీలో మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులపై కూడా అక్రమాలు జరిగాయంటూ ఒక పత్రికను అడ్డుపెట్టుకుని విష ప్రచారం చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తన నియోజకవర్గంలోని ఇద్దరు అక్కాచెల్లెళ్ల ఉదంతాన్ని ఆయన ఉదహరించారు. సొంత ఇల్లు కూడా లేక అద్దె ఇంట్లో ఉంటున్న ఆ యువతులు కష్టపడి చదివి డీఎస్సీలో ఉద్యోగాలు సాధించారని, వారిలో ఒకరు 2019లో కేవలం ఒక్క మార్కు తేడాతో ఉద్యోగం కోల్పోయారని తెలిపారు. ఐదేళ్ల తర్వాత వారి కల నెరవేరితే, వారి మెరిట్‌ను కూడా ప్రశ్నిస్తూ వైసీపీ నేతలు అవమానించడం బాధాకరమన్నారు. ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని వారు గతంలో యువత జీవితాలతో ఆడుకున్నారని ఆరోపించారు. గతంలో వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో చేసిన తరహాలోనే ఇప్పుడు డీఎస్సీ అభ్యర్థులపై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన వేలాది మంది యువత సహనాన్ని పరీక్షించవద్దని హెచ్చరించారు. యువత తిరగబడితే దాని ప్రభావం ఎలా ఉంటుందో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి తెలుస్తుందని అన్నారు. డీఎస్సీపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజల్లోకి వెళ్లి తిప్పికొడతామని బోడే ప్రసాద్ స్పష్టం చేశారు.

## సీపీఎంలో కలకలం

సరిలేదని రాష్ట్ర, రంగారెడ్డి జిల్లా నాయకత్వంపై కేంద్ర పెద్దలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీని ఈ సందర్భంగా మందలించినట్లు సమాచారం.

కిందిస్థాయిలో తప్పుడు నిర్ణయాలు జరుగుతుంటే చూసీచూడనట్లు ఎందుకు ఉంటున్నారని కేంద్ర కమిటీ నిలదీసింది. పార్టీ నిబంధనల ప్రకారం మహిళా కామ్రేడ్‌ను రక్షించుకోవాల్సిన తరుణంలో ఇలాంటి చర్యలకు పాల్పడటం ఏమిటని ప్రశ్నించింది. పార్టీ నుండి సస్పెండ్ చేసే అధికారం రాష్ట్ర కార్యదర్శివర్గాలకైనా, జిల్లా కార్యదర్శి వర్గాలకైనా లేదని, కేవలం నిర్ణయం మాత్రమే చేస్తాయని, నిబంధనల ప్రకారం జిల్లా కమిటీ ఆమోదం పొందిన తర్వాతే మెజార్టీ అభిప్రాయం ప్రకారం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని, కానీ ఇక్కడ ఆ ప్రక్రియ పాటించలేదని కేంద్ర కమిటీ స్పష్టం చేసింది. పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాల్సింది పోయి, ఇలా గ్రూపు రాజకీయాలను ప్రోత్సహించడం ఏమిటని తీవ్రస్థాయిలో మండిపడింది.

కొత్త కార్యదర్శిగా బోడ సామెల్ ఎన్నిక

- కవితకు యథాస్థానం

పార్టీ నిర్ణయాలను సక్రమంగా అమలు చేయడంలో, నాయకత్వ బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమయ్యారనే కారణంతో పగడాల యాదయ్యను ఆరు నెలల పాటు పార్టీ కార్యకలాపాల నుంచి సస్పెండ్ చేశారు. ఈ సస్పెన్షన్ కాలంలో ఆయన గ్రామస్థాయి శాఖ సమావేశాల్లో పాల్గొనకూడదని, కేవలం ప్రజాసంఘాల పేరుతో జరిగే కార్యక్రమాల్లో మాత్రమే పాల్గొనాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఖాళీ అయిన జిల్లా కార్యదర్శి స్థానానికి సీనియర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడైన బోడ సామెల్‌ను జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. కాగా, మరో ఇద్దరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులపై కూడా చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయని వినికిడి. కాగా, గత జిల్లా మహాసభలో యాదయ్యపై జిల్లా కార్యదర్శిగా సామెల్ పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఈ విధంగా జిల్లా కార్యదర్శి కావడం కొసమెరుపు. అయితే ఆరు నెలల పాటు మాత్రమే యాదయ్యపై సస్పెన్షన్ కొనసాగనున్నదా లేక వచ్చే జిల్లా మహాసభ వరకు సామెల్ కొనసాగుతాడా? అనే ప్రశ్న ఆ పార్టీ శ్రేణుల్లో రేకెత్తిస్తోంది. మరోవైపు కేంద్ర కమిటీ ఆదేశాల మేరకు కవితను తిరిగి యథాస్థానంలోకి తీసుకువచ్చారు. ఈ మొత్తం ఉదంతం సీపీఎం పార్టీలో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది.

# నగరంలో మరో భారీ ఫ్లైఓవర్..

ఈ కొత్త కారిడార్‌ను బంజారాహిల్స్ నుంచి గచ్చిబౌలిలోని శిల్పా లేఅవుట్ వరకు నిర్మించనున్నారు. తాజాగా ఈ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం హెచ్‌ఎండీఏ టెండర్లను ఆహ్వానించింది. అర్హులైన కాంట్రాక్టర్లు ఈ నెల 22 లోపు బిడ్లు దాఖలు చేయాలని పేర్కొంది. టెండర్లు ఖరారయ్యాక నిర్మాణ పనులను ప్రారంభించనున్నారు. ఈ కొత్త కారిడార్‌ను బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి గచ్చిబౌలిలోని శిల్పా లేఅవుట్ వరకు దాదాపు 9 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి హెచ్‌ఎండీఏ దాదాపు రూ.1,656 కోట్లు ఖర్చు చేయనుంది. ఈ కారిడార్ నిర్మాణాన్ని మొత్తం రెండు దశల్లో పూర్తి చేసేలా అధికారులు డీపీఆర్ సిద్ధం చేశారు. మొదటి దశలో ఫిలింనగర్ నుంచి శిల్పా లేఅవుట్ వరకు 5 కి.మీ మేర నిర్మాణం చేపట్టనున్నారు. ఇక రెండో దశలో కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి హకీంపేట్ కుంట వరకు 4 కి.మీ కారిడార్‌ను నిర్మించనున్నారు. ఈ కారిడార్ నిర్మాణం పూర్తయ్యాక రాకపోకల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దీనిపై దాదాపు ఆరు ర్యాంప్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఫిలింనగర్ రోడ్డు నం. 82 వద్ద, నార్నే రోడ్, జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 52, ఐటీసీ కోహినూర్ రోడ్, టీ-హబ్ జంక్షన్, మైండ్‌స్పేస్ వద్ద ఈ ర్యాంప్‌లను నిర్మించనున్నారు. అంతేకాదు, రాబోయే రోజుల్లో ఈ రూట్‌లో మెట్రో రైలు విస్తరణ జరిగినా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ కారిడార్‌ను డిజైన్ చేశారు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తై అందుబాటులోకి వస్తే ముఖ్యంగా బంజారాహిల్స్, జూబ్లీ చెక్‌పోస్టు, ఫిలింనగర్ మీదుగా వెళ్లే వారికి భారీ ఊరట లభించనుంది. దీనివల్ల ట్రాఫిక్ సమస్య గణనీయంగా తగ్గడంతో పాటు ప్రయాణ సమయం కూడా ఆదా అవుతుంది. అలాగే నగర నడిబొడ్డు నుంచి ఔటర్ రింగ్ రోడ్డు జంక్షన్‌కు చేరుకోవడం మరింత సులభతరం కానుంది.

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలపై సస్పెన్షన్ వేటు

చేస్తున్నట్లు మండలి ఛైర్మన్ ప్రకటించారు. అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ తాతా మధు, నవీన్ కుమార్‌లపై కాంగ్రెస్ పక్షం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

తీర్మానం ప్రవేశపెట్టిన దామోదర

స్పీకర్‌పై అగౌరవంగా మాట్లాడటంతో పాటు, అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ నేతల ప్రవర్తనపై ప్రభుత్వం సీరియస్ అయింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంత్రి దామోదర రాజనర్సింహ శాసనసభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత కేసీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ, ఎస్సీల చరిత్ర జాతీయ ఆత్మగౌరవంతో ముడిపడి ఉందని, దానిని కేవలం ఒక సామాజిక వర్గానికే పరిమితం చేయకూడదని అన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, కానీ రాజ్యాంగబద్ధమైన పదవులను, వ్యవస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంటుందని స్పష్టం చేశారు. "స్పీకర్ పదవి ఏ ఒక్క కులానికో, మతానికో సంబంధించినది కాదు. ఆ అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తిని అవమానించడం క్షమించరాని నేరం" అని ఆయన వ్యాఖ్యానించారు. అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ నేతల అహంకారం తగ్గలేదని, ప్రజాజీవితంలో ఉన్నవారు బాధ్యతాయుతంగా మెలగాలని సూచించారు. మంత్రి దామోదర ప్రవేశపెట్టిన తీర్మానానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పూర్తి మద్దతు తెలిపారు. రాజ్యాంగ వ్యవస్థల గౌరవాన్ని కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీలో ఈ తీర్మానం ఆమోదం పొందిన అనంతరం, అధికారిక కాపీని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి పంపించారు. దీంతో నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరు ఎమ్మెల్సీలపై మండలిలో చర్యలు తీసుకున్నారు.

# మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల దాడిపై చర్యలేవి?

- **వారికి జరిగింది చూస్తే గుండె తరుక్కుపోతుంది**
- **దాడిపై అసెంబ్లీలో ప్రశ్నించిన హరీష్ రావు**
- **నీ తల్లికి కాదు మా అమ్మకు అవమానం జరిగింది**
- **ఘాటుగా బదులిచ్చిన స్పీకర్ గడ్డం ప్రసాద్**

హైదరాబాద్,సెప్టెంబర్8 : బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై అసెంబ్లీ వద్ద జరిగిన అమానుష ఘటనపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని, అక్కాచెల్లెమ్మలకు జరిగింది చూస్తే గుండె తరుక్కుపోతుందని హరీష్ రావు అన్నారు. అయితే అవమానం జరిగింది నీ తల్లికి కాదు, మా అమ్మకు అని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మాజీ హోం మంత్రి సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై జరిగిన దాడిలో పోలీసులపై చర్యలను మంత్రి శ్రీధర్ బాబు పరిశీలిస్తామని అన్నారు. సబితక్క గొంతునొక్కారు, మగ పోలీసులు ఈ పని చేసినట్లు వీడియోలో స్పష్టంగా కనిపిస్తుంటే.. దీనిపై ఇప్పటికీ చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సునీతా లక్ష్మారెడ్డిని చీర లాగి అవమానిస్తే.. ఆ పోలీసులపై చర్యలు తీసుకోవడానికి బదులుగా వీరిపైనే కేసులు నమోదు చేసి వేధించడం ఏంటని ప్రశ్నించారు. బాధితులకు న్యాయం చేయాల్సిందిపోయి, వారిపై కేసులు నమోదు చేసి వేధించడంపై హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మంచి పద్ధతి కాదని, ఇది గౌరవసభ కాదని, కౌరవ సభగా మారిందంటూ మండిపడ్డారు. ఆనాడు కౌరవులకు పట్టిన గతే మీకు పడుతుందని, ఈ విషయాలు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గురించి మాట్లాడుతూ.. మీరంటే నాకు చాలా గౌరవం, చాలా ఇష్టం. చాలా ఏళ్ల నుంచి సభలో మీతో కలిసి పనిచేశాం. ఎమ్మెల్సీ తాతా మధు తాను స్పీకర్‌ను ఉద్దేశించి ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని చెప్పారు. ఒకవేళ మీరు మిమ్మల్ని అన్నారని భావిస్తే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నానంటూ విచారం వ్యక్తం చేశారు. మీ ప్రభుత్వానికి నిజంగానే ఎస్సీ, ఎస్టీలపై చిత్తశుద్ధి ఉంటే డిక్లరేషన్ ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేయకుండా తాళం ఎందుకు వేశారో ప్రజలకు చెప్పాలని నిలదీశారు. మహిళా ప్రజాప్రతినిధులను ప్రభుత్వం గౌరవిస్తుంది. సభాధ్యక్షుడిగా నాకు కూడా గౌరవం ఉందని



స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. అయితే మహిళా ఎమ్మెల్యేలపై కేసులు పెట్టారని హరీష్ రావు ప్రస్తావించగా.. మీరు చెప్పింది మేం విన్నాం. మేం చెప్పింది కూడా వినండి. హరీష్ రావు మీకు కాదు, నాకు ఉండాలి ఆవేశం. వాళ్లు అన్నది నీ తల్లిని కాదు, నా తల్లిని అవమానించారు. సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మీలు నాకు సోదరిమణుల్లాంటి వారు. వారిపట్ల నాకు గౌరవం ఉంది. నా తల్లిని మాటలు అన్నారు, అనుచిత వ్యాఖ్యలు చేశారు దీనికి ఏం సమాధానం చెబుతావు హరీష్ రావు అని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సభలో గట్టిగానే ప్రశ్నించారు. అసెంబ్లీ వద్ద సోమవారం నాడు సభ్యుల తీరుపై మంత్రి సీతక్క అసెంబ్లీలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా పోలీసుల ముందు బట్టలు విప్పాల్సిన అవసరమేంటని, స్పీకర్‌ను, ఆయన తల్లిని దూషించడం కరెక్టేనా అని నిలదీశారు. పోలీసులపై దాడి చేసిన, స్పీకర్‌ను దూషించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సభలో రూల్స్ తెచ్చిన నేతలే వాటిని ఉల్లంఘిస్తూ అసభ్యకర భాషతో మాట్లాడటం సిగ్గుచేటన్నారు. అయితే, తమ చీరలు లాగి కొట్టారని బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు చేస్తున్న ఆరోపణలపై స్పందిస్తూ.. నిజంగా దాడి జరిగితే విచారించి బాధ్యులైన పోలీసులపై కేసులు పెట్టి చర్యలు తీసుకుంటామని సీతక్క స్పష్టం చేశారు.

# యూట్యూబర్ 'నందు'కు నోటీసులు..

సుబ్రహ్మణ్యం 'బీబీసీ'తో చెప్పారు. యూకేలో ఉద్యోగాలు ఇప్పిస్తామని, వీసాలు రెన్యువల్ చేస్తామని పలువురిని మోసగించారంటూ నందన, ఆమె భర్త మధుకర్, ఆయన తండ్రి మోహన్ రావుపై గత ఏడాది నవంబర్‌లో ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసులు నమోదయ్యాయి. ఈ కేసుకు సంబంధించి అప్పట్లో లుక్ అవుట్ నోటీసులు కూడా జారీ చేశారు. ఈ క్రమంలో సోమవారం లండన్ నుంచి హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వచ్చిన నందనని ఎయిర్‌పోర్ట్ ఇమిగ్రేషన్ పోలీసులు అడ్డుకుని ఇబ్రహీంపట్నం పోలీసులకు సమాచారం పంపించారు. వెస్ట్ జోన్ ఏసీపీ దుర్గారావు ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకొని ఆమెకు 35 బీఎన్ఎస్ నోటీసులు అందించినట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. రెండు రోజుల్లో ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఆమెపై నమోదైన కేసులకు సంబంధించి వివరణ ఇవ్వాలని ఆ నోటీసులు జారీ చేసినట్లు ఆయన చెప్పారు. నోటీసులు తీసుకుని ఆమె అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు ఆయన బీబీసీతో చెప్పారు. యూకేలో నివాసముంటూ యూట్యూబ్‌లో వీడియోలు చేసే గుంటూరుకి చెందిన రమానందన అలియాస్ నందు కుటుంబసభ్యులపై విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. వాస్తవానికి గతేడాది నవంబర్‌లోనే కేసులు నమోదైప్పటికీ అనంతరం కూడా నందు కుటుంబసభ్యులపై పలు చోట్ల నుంచి మోసపూరిత ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో తమ పీఎస్‌లో నమోదైన కేసు వివరాలను, వాటి పురోగతిని ఇబ్రహీంపట్నం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం, సబ్ ఇన్‌స్పెక్టర్ రాజు 2026 జూన్ నెలలో బీబీసీకి తెలిపారు. విలక్షణమైన వాయిస్‌తో యూట్యూబర్‌గా సోషల్ మీడియాలో పాపులర్ అయిన నందు 'మన శంకర వరప్రసాద్' అనే సినిమాలోనూ నటించారు.

## శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా

స్పష్టమైన సూచన చేసినట్లు వెల్లడించారు. పీసీసీ అధ్యక్షుడిగా తన పరిధి మేరకు పార్టీ ప్రయోజనాల కోసం ఈ సలహా ఇచ్చానని... దానిపై తుది నిర్ణయం తీసుకోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధిష్ఠానం చేతిలోనే ఉందన్నారు. ఇక తనను మంత్రివర్గంలోకి తీసుకునే అంశంపై స్పందిస్తూ... ఆ విషయాలన్నీ అధిష్ఠానం నిర్ణయానికే వదిలేశానని తెలిపారు. ప్రస్తుతం పార్టీని బలోపేతం చేసే బాధ్యత కలిగిన పీసీసీ అధ్యక్షుడిగా నిరంతరం పనిచేస్తున్నానని పేర్కొన్నారు.

## తెలంగాణ మండలిలో హైటెన్షన్.. తాతా మధును లాక్కెళ్లిన మార్షల్స్

పరిస్థితి నెలకొంది. మండలి ప్రాంగణంలోని మీడియా పాయింట్ వద్ద తాతా మధు మాట్లాడేందుకు ప్రయత్నించగా, అధికారులు ఆయనను అడ్డుకున్నారు. ఇప్పటికే ఆయనపై సస్పెన్షన్ వేటు పడినందున మండలి ఆవరణలో మీడియాతో మాట్లాడేందుకు అనుమతి లేదని అధికారులు స్పష్టం చేశారు. వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించారు. అయితే అధికారుల సూచనలను తాతా మధు పట్టించుకోకుండా అక్కడే ఉండేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో మార్షల్స్ రంగంలోకి దిగి ఆయనను అక్కడి నుంచి తరలించే ప్రయత్నం చేశారు. తాతా మధు వెళ్లేందుకు నిరాకరించడంతో మార్షల్స్ ఆయనను చేతులపై ఎత్తుకుని మండలి ప్రాంగణం వెలుపలికి తీసుకెళ్లారు. అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణల నేపథ్యంలో తాతా మధుపై ఇప్పటికే సస్పెన్షన్ చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలోనే ఆయనను మండలి ప్రాంగణంలో మీడియాతో మాట్లాడకుండా అధికారులు అడ్డుకున్నట్లు తెలుస్తోంది. మార్షల్స్ ఆయనను బలవంతంగా తరలించిన ఘటనతో మండలి పరిసరాల్లో రాజకీయంగా వేడెక్కిన వాతావరణం నెలకొంది.

# ప్రత్యేక ప్రాంతాలుగా అరుణాచల్, అక్సాయ్‌చిన్

- **అక్సాయ్‌చిన్‌కు పశ్చిమాన భారత్, తూర్పున చైనా**
- **ఐక్యరాజ్యసమితి కొత్త మ్యాప్‌లో ప్రత్యక్షం..!?**

న్యూఢిల్లీ,సెప్టెంబర్8 : ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన కొత్త ప్రపంచ పటం మరోసారి చర్చనీయాంశంగా మారింది. 'కరెక్ట్ ది మ్యాప్' తీర్మానానికి భారత్ మద్దతు తెలిపిన నేపథ్యంలో వెలువడిన ఈ మ్యాప్‌లో అరుణాచల్‌ప్రదేశ్, అక్సాయ్‌చిన్‌లను భారత్, చైనా వాదిస్తున్న సరిహద్దుల మధ్య ప్రత్యేక ప్రాంతాలుగా చూపించారు. అక్సాయ్‌చిన్‌ను లడఖ్‌లో భాగంగా భారత్ పేర్కొంటున్న విషయం తెలిసిందే. ఐరాస సర్వసభ్య సమావేశం తీర్మానంపై చర్చలు జరుగుతున్న సమయంలో జులై 1న ఈ మ్యాప్‌ను తొలిసారి విడుదల చేశారు. ఇందులో అరుణాచల్‌ప్రదేశ్‌కు నాగాలాండ్‌తో ఉన్న సరిహద్దును తొలగించారు. అరుణాచల్‌ప్రదేశ్‌ను ప్రత్యేక రాష్ట్రంగా చూపిస్తూ.. పశ్చిమాన అసోం, ఉత్తరాన చైనా సరిహద్దుగా ఉన్నట్లు మ్యాప్‌లో పేర్కొన్నారు. అదే విధంగా అక్సాయ్‌చిన్‌ను కూడా ప్రత్యేక ప్రాంతంగా చూపించారు. దాని పశ్చిమ వైపు భారత్, తూర్పు వైపు చైనా సరిహద్దులు ఉన్నట్లు మ్యాప్‌లో పేర్కొన్నారు. ఈ మార్పులు ఎందుకు చేశారన్న దానిపై ఐరాస ఎలాంటి వివరణ ఇవ్వలేదు. జమ్మూ కశ్మీర్ విషయంలో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉన్న నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ)ని కూడా మ్యాప్‌లో చుక్కల రేఖతో చూపించారు. దీనిపై మ్యాప్ కింది భాగంలో ఐరాస వివరణ ఇచ్చింది. భారత్, పాకిస్థాన్ అంగీకరించిన జమ్మూ కశ్మీర్ ఎల్‌ఓసీని ఈ చుక్కల రేఖ సుమారుగా సూచిస్తుందని పేర్కొంది. జమ్మూ కశ్మీర్ తుది స్థితిపై సంబంధిత పక్షాల మధ్య ఇంకా అంగీకారం కుదరలేదని తెలిపింది. ప్రపంచంలోని ప్రాంతాలను పటాల్లో మరింత కచ్చితంగా, సమానత్వంతో చూపించాలంటూ ఆఫ్రికన్ యూనియన్ మద్దతుతో తీసుకొచ్చిన 'కరెక్ట్ ది మ్యాప్' తీర్మానాన్ని ఐరాస సర్వసభ్య సమావేశం గత వారం ఆమోదించింది. ముఖ్యంగా ఆఫ్రికా ప్రాంతాల భౌగోళిక చిత్రణను మరింత సమానంగా చూపించడమే దీని లక్ష్యం. ఈ తీర్మానం చట్టబద్ధంగా అమలు చేయాల్సినది కాదు. అయితే ప్రపంచవ్యాప్తంగా బహుళపక్ష సంస్థలు ఉపయోగించే ప్రామాణిక ప్రపంచ పటాల్లో దీనికి అనుగుణంగా మార్పులు చేసే అవకాశం ఉంది. ఆఫ్రికన్ గ్రూప్ తరఫున టోగో ఈ తీర్మానాన్ని ముందుకు తీసుకెళ్లింది. భారత్ దీనికి మద్దతు తెలిపింది. సమాన విస్తీర్ణాన్ని ప్రతిబింబించే పటాల రూపకల్పన అనే మౌలిక సూత్రానికి మద్దతుగా తాము ఓటు వేసినట్లు భారత విదేశాంగ శాఖ తెలిపింది. ఏదైనా నిర్దిష్ట పటం, మ్యాప్ ప్రొజెక్షన్ లేదా దేశాల సరిహద్దుల చిత్రణకు ఈ తీర్మానం ఆమోదం కాదని స్పష్టం చేసింది. జమ్మూ కశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలు సహా భారత సార్వభౌమ భూభాగాన్ని అధికారిక భారత పటం ప్రకారమే చూపించాలని పేర్కొంది. తప్పుడు లేదా తప్పుదోవ పట్టించే చిత్రణను అంగీకరించబోమని తెలిపింది.

## వైసీపీకి రాజీనామా చేసిన బొత్స మేనల్లుడు

అమరావతి,సెప్టెంబర్8 : వైసీపీలో కీలక పరిణామం చోటుచేసుకుంది. పార్టీ సీనియర్ నేత, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మేనల్లుడు, విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా లేఖను వైసీపీ అధినేత జగన్ కు పంపించారు. ఈ పరిణామం ఉత్తరాంధ్ర వైసీపీ శ్రేణులకు పెద్ద ఎదురుదెబ్బగా మారింది. మజ్జి శ్రీనివాసరావు తన రాజీనామా లేఖలో పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు, తాను నిర్వహిస్తున్న విజయనగరం జిల్లా అధ్యక్ష పదవి, భీమిలి నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుంచి కూడా వైదొలగుతున్నట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆయన విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. బొత్స కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా, జిల్లాలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా వ్యవహరించే చిన్న శ్రీను అకస్మాత్తుగా ఈ నిర్ణయం తీసుకోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బొత్స సత్యనారాయణ కుటుంబానికి ఉత్తరాంధ్రలో గట్టి పట్టుంది. అలాంటి కీలక నేత మేనల్లుడే పార్టీని వీడటం వైసీపీకి తీవ్ర నష్టంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. జిల్లాలో కీలకమైన జడ్పీ ఛైర్మన్ పదవిలో ఉంటూ, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్న నేత రాజీనామా చేయడం వెనుక కారణాలపై పార్టీ వర్గాల్లో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. అయితే, తన రాజీనామాకు గల కారణాలను చిన్న శ్రీను ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. ఆయన భవిష్యత్ కార్యాచరణ ఏమిటనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# పెరుగుతున్న సైబర్ మోసాలు

నేటి కాలంలో సైబర్ మోసాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఎదో ఒకచోట ఎదో ఒక రకంగా వినియోగదారులు, ప్రజలు సైబర్ దాడులకు గురై మోసపోతూనే ఉన్నారు. తాజాగా.. మెటా సంస్థకు చెందిన ఇన్‌స్టాగ్రామ్‌లో కొందరు మోసగాళ్లు ఇతరుల పోస్టులపై కావాలనే తప్పుడు కాపీరైట్ ఫిర్యాదులు చేస్తున్నారు. ఆ తర్వాత వాటిని వెనక్కి తీసుకోవాలంటే డబ్బులు ఇవ్వాలంటూ బెదిరిస్తున్నారు. పదేపదే ఇలాంటి ఫిర్యాదులు వస్తే తమ ఖాతాలు శాశ్వతంగా బ్లాక్ అవుతాయనే భయంతో యూజర్లు వాళ్లు అడిగినంత ఇచ్చుకుంటున్నారు. 15 లక్షల మంది ఫాలోవర్లు ఉన్న ఒక ఇన్‌స్టాగ్రామ్ యూజర్, తన ఖాతాను కాపాడుకోవడానికి ఒక మోసగాడికి 50 డాలర్లు (రూ. 4700) చెల్లించినట్లు బీబీసీకి తెలిపారు. మెటా అప్పీల్ ప్రక్రియకు వారాల సమయం పడుతుందని, ఆ ప్రాసెస్‌లో వెళ్తే తనకు గతంలో వేల రూపాయల ఆదాయం పోయిందని ఆయన అన్నారు. "ఈ పరిస్థితి బాధితులకు ఎంత ఇబ్బందిగా ఉంటుందో మాకు అర్థమవుతోంది, ఇలాంటివి జరగకుండా నిరోధించేలానే మా వ్యవస్థలను తీర్చిదిద్దాం" అని మెటా ప్రతినిధి వివరించారు. "మా విచారణ తర్వాత, సదరు కంటెంట్‌ను మళ్లీ యథాస్థితికి తెచ్చాం. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా ఖాతాలకు అదనపు భద్రతను కూడా కల్పించాం" అని తెలిపారు. కానీ, ఏది నిజమైన ఫిర్యాదో, ఏది నకిలీదో గుర్తించడంలో మెటా పనితీరు పేలవంగా ఉందని క్రియేటర్లు అంటున్నారు. నెలవారీ ఫీజు చెల్లించే క్రియేటర్ల అప్పీళ్లకు తప్ప, సాధారణ యూజర్ల ఫిర్యాదులకు సంస్థ త్వరగా స్పందించడం లేదని వారు బీబీసీతో చెప్పారు. 'లాస్ట్ ఇన్ టైమ్ హిస్టరీ' అనే ఇన్‌స్టాగ్రామ్ పేజీ పాత చారిత్రక చిత్రాలను పోస్ట్ చేస్తూ ఉంటుంది. దీనికి 15 లక్షలకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. దీనిని నడిపే ఓలి ( పూర్తి పేరు చెప్పడానికి ఇష్టపడలేదు), తాను పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉన్న చిత్రాలను లేదా హక్కుదారుల అనుమతి ఉన్నవాటినే పోస్ట్ చేస్తున్నట్లు బీబీసీకి చెప్పారు. అయినా సరే, ఈ ఏడాదిలో అతనికి ఇప్పటివరకు డజన్ల కొద్దీ "స్పష్టంగా నకిలీ" కాపీరైట్ ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులు వచ్చిన వెంటనే మెటా వాటి వాస్తవాన్ని చెక్ చేయదు. కాబట్టి ఎవరి ఖాతాపైనైనా ఇలా వరుసగా ఫిర్యాదులు వస్తే వాళ్ల అకౌంట్ తాత్కాలికంగా ఆగిపోతుంది. ఒకే ఈమెయిల్ ఐడీ నుంచి ఒకేసారి తన పలు పోస్టులపై కాపీరైట్ స్ట్రైక్స్ వస్తున్నాయని ఓలి చెప్పారు. ఆ తర్వాత ఆ ఫిర్యాదు చేసిన వ్యక్తి, టెలిగ్రామ్ లాంటి ప్రైవేట్ మెసేజింగ్ యాప్‌లోకి రమ్మని మెసేజ్ చేస్తాడు. "వాళ్లు కొంత డబ్బు డిమాండ్ చేస్తారు" అని ఓలి తెలిపారు. ఆ ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలంటే సాధారణంగా కొన్ని వందల డాలర్లు అడుగుతారని చెప్పారు. డబ్బు అడగడం లేదా భవిష్యత్తులో మరిన్ని కాపీరైట్ ఫిర్యాదులు చేస్తామని బెదిరించడం లాంటి మెసేజ్‌లను బీబీసీ కూడా పరిశీలించింది. ఇన్‌స్టాగ్రామ్ తాత్కాలికంగా ఆపేసిన తన అకౌంట్‌ను తిరిగి తెచ్చుకోవడానికి ఓలి చివరికి ఒక మోసగాడికి క్రిప్టోకరెన్సీ రూపంలో 50 డాలర్లు ఇవ్వడానికి ఒప్పుకున్నారు. ఇలా డబ్బులు ఇస్తే నేరగాళ్లను ప్రోత్సహించినట్లే అవుతుందని, కాబట్టి డబ్బులు ఇవ్వొద్దని పోలీసులు బాధితులకు సూచిస్తున్నారు. మెటాను సంప్రదించి ఖాతాను వెనక్కి తెచ్చుకోవాలంటే వారాల కొద్దీ సమయం పడుతుంది కాబట్టి, వేగంగా పనైపోతుందనే ఉద్దేశంతోనే తాను "చివరి ప్రయత్నంగా" డబ్బు కట్టానని ఓలి అన్నారు. కానీ డబ్బు ఇచ్చిన వెంటనే మళ్లీ అతనికి కాపీరైట్ స్ట్రైక్స్ పడ్డాయి. "అదే అత్యంత బాధాకరమైన విషయం" అన్నారు ఓలి. "మనల్ని అంతలా టార్చర్ చేసినవాళ్లకే డబ్బులు సమర్పించుకోవడం, ఆ వెంటనే మళ్లీ వాళ్లు అదే పని చేయడం మనకు ఎంతో నరకంగా అనిపిస్తుంది" అన్నారు. కాపీరైట్ దావాలు ఎక్కువగా రావడంతో ఓలి ఖాతాకు మానిటైజేషన్ ఆగిపోయింది. అంటే, అతని పోస్టులు ఎంత వైరల్ అయినా ఇన్‌స్టాగ్రామ్ నుంచి అతనికి నయాపైసా రాదు. "ఇది వేధింపులా కాదా అని తెలుసుకోవడానికి లేదా అసలు ఏం జరుగుతుందో కనిపెట్టడానికి (మెటా నుంచి) వ్యవస్థలో కనీస విచారణ కూడా జరగడం లేదు" అని ఓలి అన్నారు. చాలా మంది ఇన్‌స్టాగ్రామ్ యూజర్లు కూడా ఇలాంటి అనుభవాలనే పంచుకున్నారు. "క్రియేటర్ల కోసమే తాము ఉన్నామని మెటా పైకి చెబుతున్నప్పటికీ, ఈ ప్రాసెస్‌లో వాళ్లు కనీస సాయం కూడా చేయలేదు. పైగా కస్టమర్ సపోర్ట్ కోసం డబ్బులు కట్టమంటారు" అని 'మోర్బిడ్ క్యూరియాసిటీ' పేజీని రన్ చేస్తున్న అభిన్ టామ్ సెబాస్టియన్ అన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో 'బ్లూ టిక్' (వెరిఫైడ్) కావడానికి మెటా నెలవారీ ఫీజు వసూలు చేస్తుంది, దీనివల్ల లైవ్ చాట్ ద్వారా 24 గంటలూ కస్టమర్ సపోర్ట్ దొరుకుతుంది. "నాకు రావాల్సిన అత్యంత కీలకమైన బ్రాండ్ కాంట్రాక్ట్‌లు వేరే క్రియేటర్ చేతికి వెళ్లిపోవడంతో నేను కోలుకోలేని దెబ్బ తిన్నాను. ఇలాంటివి మళ్లీ జరగవని చెప్పి మెటా నుంచి నాకు ఎలాంటి భరోసా గానీ సపోర్ట్ గానీ దొరకలేదు" అని సెబాస్టియన్ అన్నారు. కాగా, అసలైన కాపీరైట్ హక్కుదారులు లేదా వాళ్లు నియమించుకున్న ప్రతినిధులు మాత్రమే కాపీరైట్ ఉల్లంఘనపై ఫిర్యాదు చేయగలరని ఇన్‌స్టాగ్రామ్ చెబుతోంది. బాధితులు నేరుగా ఆ హక్కుదారులనే సంప్రదించాలని సూచిస్తోంది. ఎదైనమైనా ఇలాంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే పోలీసుల సహాయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# అక్షరాస్యతతోనే సమాజ అభివృద్ధి

**- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**

**- వనపర్తిలో ఘనంగా అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ ర్యాలీ**



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 8 (విజన్ ఆంధ్ర) : అక్షరాస్యతతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా విద్యను అభ్యసించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం వనపర్తి పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల నుంచి పాలిటెక్నిక్ కళాశాల వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్య ద్వారానే వ్యక్తుల్లో అవగాహన, ఆత్మవిశ్వాసం పెరిగి తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకునే అవకాశం కలుగుతుందని అదనపు కలెక్టర్ తెలిపారు. అక్షరాస్యత ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపడంతో పాటు కుటుంబ, సామాజిక, ఆర్థిక వికాసానికి దోహదపడుతుందన్నారు. సమాజంలో అక్షరాస్యత శాతాన్ని మరింత పెంచేందుకు ప్రభుత్వంతో పాటు ప్రజలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. చదువుకు దూరంగా ఉన్న వారిని గుర్తించి, వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. ర్యాలీలో విద్యార్థులు అక్షరాస్యత ప్రాముఖ్యతను తెలియజేసే ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) యాదయ్య, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భూ రీసర్వే పారదర్శకంగా జరగాలి

**- అదనపు కలెక్టర్ వినోద్ కుమార్**

**- జమ్మాపూర్, కొర్లకుంట గ్రామాల్లో పనుల పరిశీలన**

**- రైతుల సందేహాలను నివృత్తి చేయాలని అధికారులకు ఆదేశం**



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 8 (విజన్ ఆంధ్ర) : జిల్లాలో భూ రీసర్వే ప్రక్రియను ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. పానగల్, వీపనగండ్ల మండలాల పరిధిలోని జమ్మాపూర్, కొర్లకుంట గ్రామాల్లో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరుగుతున్న భూముల కొలతలు, సరిహద్దుల నిర్ధారణ, భూ రికార్డుల పరిశీలన అంశాల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వారి సందేహాలను నివృత్తి చేస్తూ, రీసర్వే ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఈ రీసర్వే ద్వారా భూ రికార్డులు మరింత ఖచ్చితత్వంతో రూపొందడమే కాకుండా, దీర్ఘకాలిక భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వే ఏడీ శ్రీనివాసులు, రెవెన్యూ అధికారులు, స్థానిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబానికీ రూ. 5 లక్షల బీమా ధీమా

**- కలెక్టర్లతో ప్రణాళికా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్ వీసీ**

**- నవంబర్ 19 లోగా ఆన్‌లైన్ నమోదు పూర్తి చేయాలని ఆదేశం**




వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 8 (విజన్ ఆంధ్ర ) : రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత, భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకం విధివిధానాలపై రాష్ట్ర ప్రణాళికా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన ఈ సమావేశంలో దరఖాస్తుల సేకరణ, ఆన్‌లైన్ ప్రక్రియపై కలెక్టర్ల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన ప్రతి కుటుంబ పెద్దకు రూ. 5 లక్షల జీవిత బీమాను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుంది. రేషన్ కార్డు లబ్ధిదారులతో పాటు రాష్ట్రంలోని మిగిలిన అన్ని వర్గాల కుటుంబ పెద్దలకు కూడా ఈ పథకం వర్తిస్తుంది. కుటుంబ యజమాని (మహిళ లేదా పురుషుడు) మరణించినట్లయితే, వారి నామినీకి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందుతుంది. నవంబర్ 19 నాటికి దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి పథకాన్ని ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లు దరఖాస్తుల సేకరణ, సాంకేతిక అంశాలపై పలు సూచనలు చేశారు. వనపర్తి ఐడీవోసీ నుంచి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్. ఖీమ్యా నాయక్, సీపీఓ హరికృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.

# అక్రమంగాఇసుకతరలిస్తున్న రెండు టిప్పర్ల పట్టివేత.

ఊట్కూర్, సెప్టెంబర్ 8 ( విజన్ ఆంధ్ర) ఊట్కూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లను టాస్క్ ఫోర్స్, ఊట్కూర్ పోలీసులు సంయుక్తంగా పట్టుకొని మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ తెలిపారు. ఎస్సై రమేష్ కరణం ప్రకారం... ఊట్కూర్ మండలంలోని నారాయణపేట రోడ్డుపై ఒక ఇసుక టిప్పర్‌ను, అలాగే ఊట్కూర్ చెక్‌పోస్ట్ వద్ద మరో ఇసుక టిప్పర్‌ను పోలీసుల తనిఖీలలో పట్టుకున్నట్లు ఎస్ఐ వివరించారు. నారాయణపేట మండల పరిధిలోని షేర్లపల్లి గ్రామానికి చెందిన టిప్పర్ డ్రైవర్ పి. నరేందర్, టీజీ 38 టి 24 30, అదే గ్రామానికి చెందిన అజయ్, డి. రాజు ప్రభుత్వం నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. అక్రమంగా ఇసుక తరలిస్తే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

# గణేష్ ఉత్సవాలకు పటిష్ఠ భద్రతా చర్యలు!

**- మండపాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి**

**- రాత్రివేళ ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది నిర్వాహకులు ఉండాలి**

**- నిమజ్జన ఏర్పాట్లపై ఉత్సవ కమిటీలతో పోలీసుల చర్చ**




పేట్ బషీరాబాద్, సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర): గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పేట్ బషీరాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో ముందస్తు భద్రతా చర్యలకు శ్రీకారం చుట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండప నిర్వాహకులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కే. విజయవర్ధన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఉత్సవాల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతా ఏర్పాట్లపై నిర్వాహకులకు అవగాహన కల్పించారు. గణేష్ విగ్రహ ప్రతిష్ఠాపనకు ముందు చేపట్టాల్సిన భద్రతా చర్యలు, ప్రతిష్ఠాపన అనంతరం పాటించాల్సిన నిబంధనలు, నిమజ్జన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోలీసులు వివరించారు. ప్రతి గణేష్ మండపంలో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, పరిసర ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద రాత్రి సమయంలో కనీసం ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది నిర్వాహకులు ఉండేలా చూసుకోవాలని పోలీసులు సూచించారు. అదేవిధంగా రాత్రివేళ అధిక శబ్దంతో సంగీతాన్ని వినిపించకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిబంధనలను పాటించాలని స్పష్టం చేశారు.

**ఆన్‌లైన్‌లో నిర్వాహకుల వివరాలు నమోదు**

గణేష్ మండపాల నిర్వాహకులందరూ తమ పూర్తి వివరాలను పోలీస్ స్టేషన్‌కు అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ లింక్ ద్వారా నమోదు చేయాలని అధికారులు సూచించారు. ఉత్సవ కమిటీలు, మండప నిర్వాహకులతో నిరంతర సమన్వయం కోసం ప్రత్యేక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. ఈ గ్రూప్ ద్వారా పోలీసులకు, నిర్వాహకులకు మధ్య సమాచార మార్పిడి వేగంగా జరిగేలా చర్యలు చేపట్టారు.

**నిమజ్జన ఏర్పాట్లపై చర్చ**

గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని సురక్షితంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై నిర్వాహకులతో పోలీసులు చర్చించారు. ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, ఊరేగింపు మార్గాలు, నిమజ్జన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్వాహకుల సలహాలు, సూచనలను కూడా స్వీకరించారు. ప్రజలు, ఉత్సవ కమిటీలు, పోలీసుల సమన్వయంతో గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీసులు కోరారు. సమావేశంలో పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

# మట్టి వినాయకులనే ప్రతిష్ఠించాలి

**- పర్యావరణ పరిరక్షణకు సహకరించండి**

**- కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**- బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి**

**- అవగాహన పోస్టర్ల ఆవిష్కరణ**





వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర) : పర్యావరణ పరిరక్షణలో భాగంగా రానున్న వినాయక చవితి పర్వదినాన ప్రజలందరూ మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన మట్టి విగ్రహాలు, పర్యావరణ పరిరక్షణ అవగాహన గోడ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు తీవ్రంగా కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. అదే మట్టి విగ్రహాలైతే నీటిలో త్వరగా కరిగిపోవడం వల్ల జల కాలుష్యాన్ని సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. పర్యావరణ హిత వేడుకలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ద్వారా జిల్లాలో 2,000 మట్టి వినాయక విగ్రహాలను త్వరలోనే పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పర్యావరణహితంగా పండుగను జరుపుకోవాలని సూచించారు.

**బాల్య వివాహాలను సమూలంగా అరికట్టాలి**

బలవంతపు, బాల్య వివాహాల నిర్మూలనపై రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (ఎన్‌జీఓ), జిల్లా సంక్షేమ శాఖ సంయుక్తంగా రూపొందించిన వాల్ పోస్టర్‌ను కూడా కలెక్టర్ ఈ సందర్భంగా ఆవిష్కరించారు. అధికారులతో పాటు స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేసి బాల్య వివాహాలను అరికట్టాలని ఆదేశించారు. బాల్య వివాహాల వల్ల కలిగే సామాజిక, ఆరోగ్యపరమైన సమస్యలపై గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. బాలల హక్కులను కాపాడుతూ, బాలికలకు విద్య, భద్రత, సమాన అవకాశాలు కల్పించేందుకు సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి శాస్త్రవేత్త, నోడల్ అధికారి అనిల్ కుమార్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి సుధారాణి, రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షురాలు చిన్నమ్మ తామస్, కార్మిక శాఖ అధికారి రవి తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**- సెప్టెంబర్ 15లోగా కొనుగోలు కేంద్రాల సిబ్బందికి శిక్షణ పూర్తి కావాలి**

**- అక్టోబర్ 1 నాటికి జిల్లాలో 450 కొనుగోలు కేంద్రాల ప్రారంభం**

**- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ ఆదేశం**



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 8 (విజన్ ఆంధ్ర) : 2026 ఖరీఫ్ సీజన్‌లో వరి ధాన్యం కొనుగోళ్లను ఎలాంటి లోపాలు, అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అధికారులతో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల కార్యాచరణ ప్రణాళికపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా సుమారు 3.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించామని, ఇందుకోసం 450 ధాన్యం కొనుగోలు కేంద్రాలను (పీపీసీ) ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఏఈఓలు, పీపీసీ ఇన్‌చార్జీలు, సిబ్బందికి ధాన్యం నాణ్యతా ప్రమాణాలు, తేమ శాతం, తూకం, రికార్డుల నిర్వహణ, చెల్లింపులపై సెప్టెంబర్ 15వ తేదీలోగా పూర్తి అవగాహన కల్పించాలి. అక్టోబర్ 1వ తేదీ నాటికి అన్ని పీపీసీలను ప్రారంభించి, అక్టోబర్ 10 నాటికి ధాన్యం కొనుగోళ్లు జరిగేలా ప్రణాళిక రూపొందించాలి. కేంద్రాల్లో తాగునీరు, నీడ, టార్పాలిన్లు, తూకం యంత్రాలు అందుబాటులో ఉంచాలి. హమాలీల కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. ధాన్యం నిల్వ చేసేందుకు అవసరమైన గోదాములు, భవనాలను ముందే గుర్తించి, మరమ్మతులు ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలి. ధాన్యం రవాణాలో పారదర్శకత కోసం ప్రతి లారీకి జీపీఎస్ ట్రాకింగ్ అమర్చడం తప్పనిసరి. పీపీసీలలో అందుబాటులో ఉన్న మౌలిక వసతుల వివరాలను ఇన్‌చార్జీలు ప్రభుత్వ ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలి. గత సీజన్‌లో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా చూడాలని, కొనుగోలు ప్రక్రియలో అక్రమాలకు పాల్పడితే బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ యాదయ్య, డిఆర్డిఓ రామ మహేశ్వర్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, డిఎస్పి బాలాజీ నాయక్, డీఏవో ఆంజనేయులు, పౌరసరఫరాల డిఎం ఆంజనేయులు, డిపిఓ రఘునాథ్, డిటిఓ సురేష్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# నాణ్యమైన సేవలందించడమే పోలీస్ పెట్రోల్ బంక్ లక్ష్యం

**- తొలి వార్షికోత్సవ వేడుకల్లో జిల్లా ఎస్పీ సునిత రెడ్డి**

**- ప్రతిభ చూపిన సిబ్బందికి నగదు పురస్కారాలు**







వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 8 (విజన్ ఆంధ్ర) పెట్రోల్, డీజిల్ నాణ్యత, పరిమాణంలో ఎలాంటి రాజీ లేకుండా వినియోగదారులకు పారదర్శకమైన సేవలు అందించడమే పోలీసు పెట్రోల్ బంక్ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి తెలిపారు. వనపర్తికొత్తకోట ప్రధాన రహదారిపై రాజపేట శివారులోని గాయత్రి పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన తొలి వార్షికోత్సవ వేడుకల్లో ఎస్పీ కేక్ కట్ చేసి మాట్లాడారు. కల్తీ లేని నాణ్యమైన ఇంధనం వినియోగించడం వల్ల వాహనాల ఇంజిన్ సామర్థ్యం మెరుగుపడి, తరచూ వచ్చే రిపేర్లు తగ్గడంతో పాటు నిర్వహణ ఖర్చులు తగ్గుతాయన్నారు. ఈ పెట్రోల్ బంక్‌లో 24 గంటలూ సేవలు అందుబాటులో ఉంటాయని, వాహనదారులు, రైతులు, స్థానిక ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజోపయోగ కార్యక్రమాల్లోనూ పోలీస్ శాఖ ముందుంటుందని, భవిష్యత్తులోనూ ఇదే నిజాయితీ, పారదర్శకతతో సేవలు కొనసాగించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పెట్రోల్ బంక్‌లో ఉత్తమ సేవలందించిన బాయ్స్‌కు ఎస్పీ నగదు రివార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, వనపర్తి డీఎస్పీ గిరిబాబు, డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ నాయక్, కొత్తకోట సీఐ రమేష్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, వనపర్తి రూరల్ ఎస్సై హృషికేష్, శ్రీరంగాపూర్ ఎస్సై హిమబిందు, ఆర్ఎస్సైలు వినోద్, మగ్దుం భారీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

**- సీనియర్ సివిల్ జడ్జి కే. దీప**






వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 8(విజన్ ఆంధ్ర) : పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే. దీప పేర్కొన్నారు. వనపర్తి జిల్లా పట్టణంలోని శిశు మందిర్ పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ... విద్యార్థులకు ప్రాథమిక హక్కులు, విధులు, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం, బాల కార్మికుల నిర్మూలన చట్టం, మోటార్ వాహనాల చట్టం మరియు ఉచిత-నిర్బంధ విద్యా హక్కు చట్టం ప్రాముఖ్యతను వివరంగా వివరించారు. బాధితులకు అందే ఉచిత న్యాయ సేవలు, సాయం కోసం సంప్రదించాల్సిన నల్సా టోల్ ఫ్రీ నంబర్ 1500 వినియోగంపై స్పష్టతనిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పాలిటిక్స్ ఏ బూతు పురాణం!!

- రాజకీయంలో మాటల యుద్ధం కాదు.... తిట్ల దండకం
- లీడర్లు అలా మాట్లాడితేనే ప్రజా నాయకులా?
- నాయకుల బూతు వ్యాఖ్యలు ఎంత వరకు మార్గదర్శకం?
- ఇది ప్రజాస్వామ్యమా? తిట్ల పంచాయితీయా?

**మైకులు చేతిలోకి వస్తే ప్రజా సమస్యలపై గళం విప్పాల్సిన నాయకులు.. తిట్లతోనే రాజకీయ వేడిని పెంచుతున్నారు. సిద్ధాంతాలు, విధానాలు, అభివృద్ధి చర్చలు పక్కకు వెళ్లి వ్యక్తిగత దూషణలే ప్రధాన అస్త్రాలుగా మారుతున్నాయి. సోషల్ మీడియా వ్యూస్ కోసం సాగుతున్న ఈ మాటల యుద్ధంపై "విజన్ ఆంధ్ర" స్పెషల్ పొలిటికల్ స్టోరీ**



**హైదరాబాద్ (పొలిటికల్ డెస్క్) సెప్టెంబర్ 8:** ఒకప్పుడు రాజకీయ నాయకుడి గొంతు మైకులో మోగితే అందులో విద్వత్తు, సిద్ధాంతం, సమాజపు భవిష్యత్తు కనిపించేవి. కానీ నేడు స్క్రీన్లపై నరాలూగేలా అరవడం, నోటికి హద్దూపద్దూ లేని బూతుల జడివాన కురిపించడమే సరికొత్త "హీరోయిజం"గా మారిపోయింది. తెలంగాణ రాజకీయ యవనికపై రోజురోజుకూ దిగజారుతున్న మాటల సంస్కృతి ప్రజాస్వామ్య మూలాలనే ప్రశ్నార్థకం చేస్తోంది.

### శబ్ద కాలుష్యం కాదు... భాషా కాలుష్యం

మైకులు పట్టుకుంటే విధానాలు, ప్రజా సమస్యలు, పాలన లోపాలపై చర్చ జరగడం లేదు; బదులుగా వ్యక్తిగత దూషణలు, కుటుంబ సభ్యుల ప్రస్తావనలు, రోడ్డు పక్క రౌడీయిజం తలపించే తిట్లే ఆయుధాలవుతున్నాయి. సిద్ధాంతాల పదును తగ్గి, పదజాలపు మురికి పెరిగింది. తిట్టనిదే ప్రెస్‌మీట్ ముగియని, దూషించనిదే వార్తల్లో నిలవని దుస్థితి నెలకొంది.

### అలా మాట్లాడితేనే నాయకుడా?

### అల్గారిథమ్ ట్రాప్


సోషల్ మీడియాలో వ్యూస్, రీల్స్, లైకుల కోసం తీవ్రమైన బూతులు, హావభావాలను "ఫైర్ బ్రాండ్ లీడర్‌షిప్"గా భ్రమింపజేస్తున్నారు.

### భ్రమల్లో కేడర్

ఎవరు ఎంత ఘాటుగా అవతలి వ్యక్తిని అవమానించగలరో వారికే ఎక్కువ చప్పట్లు, సోషల్ మీడియా రీచ్ దక్కుతుండటంతో, దీన్నే నిజమైన నాయకత్వ లక్షణంగా భావించే విష సంస్కృతి బలపడుతోంది.

### కౌంటర్ ఇవ్వడమంటే కించపరచడమేనా?

ఎదుటి వ్యక్తి వేసిన ప్రశ్నకు గణాంకాలతో, తర్కంతో సమాధానం ఇవ్వడం మానేసి, వారిని అంతకంటే హీనమైన బూతుతో కొట్టడమే "తిరుగులేని కౌంటర్" అనే అపహాస్యం స్థిరపడింది.




తార్కికమైన విమర్శ కంటే వ్యక్తిత్వ హననమే సులువైన మార్గంగా మారింది.

### తెలంగాణ సమాజానికి వీరు ఇచ్చే మార్గదర్శకత్వం ఏమిటి?

సాహిత్యం, ఉద్యమ స్ఫూర్తి, భాషా సౌందర్యం మెండుగా ఉన్న నేల ఇది. పోరాటాల కాలంలో ప్రజా గొంతుకగా నిలిచిన తెలంగాణ మాండలికం అంటే ఎంతో గౌరవం, ఆత్మీయత. కానీ ప్రస్తుత నాయకులు అదే మాండలికం ముసుగులో బూతు పురాణాన్ని ప్రదర్శిస్తూ భావితరాలకు ఏం నేర్పిస్తున్నారు? టీవీల్లో, ఫోన్లలో ఈ వికృత మాటలను వింటున్న పిల్లలు, యువత రాజకీయాల పట్ల ఏ విధమైన అవగాహన పెంచుకుంటారు? సభాప్రాంగణాల్లో వినిపించేది ప్రజా గొంతుక కావాలి కానీ, గల్లీ పంచాయితీ భాష కాదు. అసలైన బలం నోటి దురుసులో కాదు... చేసే పనుల్లో, నిలబెట్టే విలువల్లో ఉంటుంది. పదవి ఇచ్చే అధికారం కంటే పదాల వాడకంలో చూపే హుందాతనమే నాయకుడి స్థాయిని నిర్ణయిస్తుంది. ఈ తిట్ల దండకం ఇకనైనా ఆగకపోతే, రాజకీయ వేదికలు ప్రజాస్వామ్య దేవాలయాలుగా కాక, వీధి రౌడీల అడ్డాలుగా మిగిలిపోయే ప్రమాదం ఉంది.

**- గడ్డం సంతోష్ రాజ్**
**స్పెషల్ కరస్పాండెంట్ విజన్ ఆంధ్ర**

## చిలకనగర్‌లో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

- మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఉద్యమాన్ని బలోపేతం చేయాలి
- ప్రజా సమస్యలపై సమిష్టిగా పోరాడాలి: పంగ ప్రణయ్ కుమార్ మాదిగ



కాప్రా/సెప్టెంబర్ 08 ( విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఉప్పల్ మండలం చిలకనగర్ డివిజన్‌లో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఉప్పల్ మండల ఇంచార్జి కోరపాక అంజి మాదిగ అధ్యక్షతన, సీనియర్ నాయకులు అంతగాళ్ల అశోక్ మాదిగ సమన్వయంతో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మాజీ అధ్యక్షులు పంగ ప్రణయ్ కుమార్ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే, అంబేద్కర్, జగ్జీవన్ రామ్, కాన్షీరాం ఆశయాల సాధనకు కృషి చేస్తూ ప్రజా సమస్యలపై సమిష్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. నూతన కమిటీగా అధ్యక్షుడిగా జెర్రిపోతుల బాలకిషన్ మాదిగ, అధికార ప్రతినిధిగా పొట్ట వినోద్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా కానుకుంట్ల అనిల్, ఉపాధ్యక్షుడిగా గంధమల్ల నరేష్, కోశాధికారిగా పానుగంటి నాగరాజు, సహాయ కార్యదర్శిగా యెర్ర రాజు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు, యువత పాల్గొన్నారు.

## కేరళ తాంత్రిక సంప్రదాయంలో అయ్యప్ప పూజా సమ్మేళనం

- రెండు రోజుల పాటు సాధకులకు ప్రాయోగిక శిక్షణ
- తంత్ర గురు బ్రహ్మశ్రీ టి.డి.పి. నంబూద్రి ఆధ్వర్యంలో కార్యక్రమాలు
- మంత్రోపదేశ మహోత్సవంతో ముగిసిన ఆధ్యాత్మిక సమ్మేళనం



హైదరాబాద్, సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర): కేరళ సంప్రదాయ తాంత్రిక విధానంలో అయ్యప్ప స్వామి పూజా ప్రక్రియలపై సాధకులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో నిర్వహించిన కేరళ తాంత్రిక అయ్యప్ప పూజా సమ్మేళనం ఘనంగా జరిగింది. గుండ్లపోచంపల్లిలోని ఏవీఆర్ కన్వెన్షన్ హాల్‌లో సెప్టెంబర్ 6, 7 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమాన్ని కేరళ చెంగన్నూర్‌కు చెందిన మంత్ర విద్యా పీఠం వ్యవస్థాపకులు, తంత్ర గురువు బ్రహ్మశ్రీ టి.డి.పి. నంబూద్రి గురూజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కె. నిరంజన్ రావు గురూజీ పర్యవేక్షణలో జరిగిన ఈ సమ్మేళనానికి అయ్యప్ప భక్తులు, సాధకులు, పూజా విధానాలను అభ్యసిస్తున్న పలువురు హాజరయ్యారు.

### *ప్రాయోగిక శిక్షణతో తొలిరోజు*

తొలిరోజు గురు ఆగమనం, గురు వందనంతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. కేరళ తాంత్రిక సంప్రదాయంలో అయ్యప్ప పూజా విధానాలపై పలు ప్రాయోగిక శిక్షణా తరగతులు నిర్వహించారు. అనంతరం అష్టాదశ కలశ పూజ, అయ్యప్ప పడి పూజను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. సాయంత్రం జరిగిన అయ్యప్ప భజన సంధ్య భక్తులను ఆకట్టుకుంది.

### *మంత్రోపదేశంతో రెండో రోజు*

రెండో రోజు అయ్యప్ప మంత్రోపదేశ మహోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తంత్ర గురువు బ్రహ్మశ్రీ టి.డి.పి. నంబూద్రి గురూజీ ఆధ్వర్యంలో మంత్రోపదేశ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గురు పాదపూజ, సన్మానం, సర్టిఫికెట్ల పంపిణీ, జ్ఞాపికల అందజేత కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం గురూజీతో ప్రత్యేక ముఖాముఖి నిర్వహించి, ఆధ్యాత్మిక సాధన, పూజా విధానాలు, అయ్యప్ప పడి పూజకు సంబంధించిన అంశాలపై సాధకుల సందేహాలను నివృత్తి చేశారు. కేవలం ఉపన్యాసాలకే పరిమితం కాకుండా నేర్చుకోవడంసాధన చేయడంఅనుభవించడంగురు ఆశీస్సులు పొందడం అనే విధానంలో సమ్మేళనాన్ని నిర్వహించడం ప్రత్యేకతగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు.

## రామప్ప దేవాలయ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం.

- శాస్త్రీయ అధ్యయనాలు, భద్రతా ప్రమాణాల సమగ్ర పరిశీలన అనంతరమే నిర్ణయం.
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.



ములుగు సెప్టెంబర్ 08 విజన్ ఆంధ్ర ప్రతినిధి : యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పాలంపేట ప్రత్యేక అభివృద్ధి ప్రాధికార సంస్థ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటాపూర్ మండల పరిధిలో చేపడుతున్న ఓపెన్‌కాస్ట్ మైనింగ్ పనుల వల్ల కాకతీయ రుద్రేశ్వర రామప్ప దేవాలయానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన చర్యలు, ఓపెన్‌కాస్ట్ మైనింగ్ ఏర్పాటుకు నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం మంజూరు అంశాలపై కమిటీ సభ్యులతో సమగ్రంగా చర్చించారు. ఓపెన్‌కాస్ట్ మైనింగ్‌కు సంబంధించిన అంశాలపై ఆయా శాఖల అధికారులు తమ పరిధిలోని అభిప్రాయాలను వెల్లడించారు. రామప్ప దేవాలయ పరిరక్షణ, పర్యావరణం, శాస్త్రీయ అధ్యయనాలు, నిరంతర పర్యవేక్షణతోపాటు సంబంధిత నిబంధనలు, భద్రతా ప్రమాణాల పై విస్తృతంగా చర్చించారు. సంబంధిత శాఖల అధికారులు, కమిటీ సభ్యులు వెల్లడించిన అభిప్రాయాలను నమోదు చేశామని, అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా, సింగరేణి భూపాలపల్లి జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ జీఎం జి. దేవేందర్, పర్యావరణ విభాగం జీఎం పి. సైదులు, ఎక్స్‌ప్లోరేషన్ జీఎం పంకజ్ కులశ్రేష్ఠ, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఆర్. సునీత, పురావస్తు శాఖ సహాయ సంచాలకురాలు బి. గంగాదేవి, భారత పురావస్తు సర్వేక్షణ శాఖ సీనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్లు అజిత్ ఎం.ఎస్., వంశీకృష్ణ జ్యోతి, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రతినిధులు జె. శ్రీధర్‌రావు, ఆచార్య ఎం.పాండురంగారావు, పాలంపేట సర్పంచ్ సీహెచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.


## ఓటరు జాబితా సవరణకు గడువు పెంపు





ములుగు సెప్టెంబర్ 08; విజన్ ఆంధ్ర ప్రతినిధి : ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా వినతులు, అభ్యంతరాల స్వీకరణ గడువును అక్టోబరు 7 వరకు పొడిగించినట్లు జిల్లా కలెక్టరు బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరు నమోదు, సవరణలు, చిరునామా మార్పులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రకటనలు అందుకున్న ఓటర్లు విచారణకు హాజరు కావాలన్నారు. సవరించిన కాలపట్టిక ప్రకారం అక్టోబరు 7 వరకు దరఖాస్తుల స్వీకరణ, నవంబరు 5 వరకు విచారణలు, పరిష్కారం, నవంబరు 9న తుది జాబితా విడుదల చేయనున్నట్లు తెలిపారు.

## మాన్‌హోళ్ల ముప్పులో సంజీవయ్య నగర్!

- కుంగిపోయిన మూడు భూగర్భ డ్రైనేజీ మాన్‌హోళ్లు
- తృటిలో తప్పిన పాఠశాల బస్సు ప్రమాదం.. అయినా మారని పరిస్థితి
- రద్దీ రహదారిపై వాహనదారులు, పాదచారులకు తప్పని ఇబ్బందులు





జీడిమెట్ల, సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర): జీడిమెట్ల సర్కిల్ పరిధిలోని సంజీవయ్య నగర్‌లో భూగర్భ డ్రైనేజీ మాన్‌హోళ్లు ప్రమాదకరంగా మారాయి. చింతల్ నుంచి సుచిత్ర వెళ్లే ప్రధాన రహదారిలో పలుచోట్ల మాన్‌హోళ్లు కుంగిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంజీవయ్య నగర్‌లో దాదాపు మూడు మాన్‌హోళ్లు దెబ్బతిన్నా సంబంధిత అధికారులు శాశ్వత చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### తృటిలో తప్పిన పాఠశాల బస్సు ప్రమాదం

గత నెలలో ఇదే కాలనీలో ఓ భూగర్భ డ్రైనేజీ మాన్‌హోల్ ధ్వంసమై ఉండగా.. అటుగా వెళ్తున్న ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు టైరు అందులో ఇరుక్కుంది. దీంతో బస్సు ఒక్కసారిగా ఒకవైపునకు ఒరిగిపోయింది. ప్రమాదాన్ని గమనించిన కొందరు యువకులు వెంటనే స్పందించి బస్సును నిలువరించడంతో పెను ప్రమాదం తప్పింది. బస్సులోని విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం ఊపిరిపీల్చుకున్నారు. ఈ ఘటన జరిగి కొద్ది రోజులు మాత్రమే గడవగా.. అదే ప్రాంతంలో మరో భూగర్భ డ్రైనేజీ మాన్‌హోల్ ధ్వంసమవడం స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది.

### నల్లపోచమ్మ ఆలయం సమీపంలో మరో మాన్‌హోల్

సంజీవయ్య నగర్‌లోని నల్లపోచమ్మ తల్లి ఆలయం సమీపంలో మరో భూగర్భ డ్రైనేజీ మాన్‌హోల్ పూర్తిగా ధ్వంసమై సుమారు వారం రోజులుగా ప్రమాదకరంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. మాన్‌హోల్ చుట్టూ తగిన రక్షణ చర్యలు లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### నిత్యం రద్దీ.. ప్రమాదం పొంచి ఉంది

చింతల్‌సుచిత్ర ప్రధాన రహదారి కావడంతో ఈ మార్గంలో నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. ప్రధాన రహదారికి అనుసంధానంగా పలు కాలనీలు, బస్తీలు ఉండటంతో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటుంది. ఇలాంటి రద్దీ మార్గంలో మాన్‌హోళ్లు కుంగిపోవడంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు, పాఠశాల బస్సుల డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాదచారులు సైతం ప్రమాద భయంతో రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది.

### ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలి

సంజీవయ్య నగర్‌లో దెబ్బతిన్న మూడు భూగర్భ డ్రైనేజీ మాన్‌హోళ్లను సంబంధిత అధికారులు తక్షణమే పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. కుంగిపోయిన మాన్‌హోళ్ల స్థానంలో నూతన మాన్‌హోళ్లు నిర్మించడంతో పాటు ప్రమాదకర ప్రాంతాల్లో తాత్కాలిక రక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికే పాఠశాల బస్సు ప్రమాదం తృటిలో తప్పిన నేపథ్యంలోనైనా అధికారులు స్పందించి, మరో ప్రమాదం జరగకముందే భూగర్భ డ్రైనేజీ మాన్‌హోళ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



### ఏఈ అభిరామ్ వివరణ

జీడిమెట్ల సర్కిల్ పరిధిలోని సంజీవయ్యనగర్‌లో మ్యాన్‌హోళ్ల సమస్య మా దృష్టికి వచ్చింది. అక్కడ రెండు రకాల మ్యాన్‌హోళ్లు ఉన్నట్లు గుర్తించాం. చతురస్రాకారంలో ఉన్న మ్యాన్‌హోల్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వస్తుంది. దీనిపై త్వరలోనే అవసరమైన చర్యలు తీసుకుని నిర్మాణ పనులు చేపడతాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, ప్రమాదాలు తలెత్తకుండా ప్రస్తుతానికి మ్యాన్‌హోల్ చుట్టూ చిన్న బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించాం. అయితే బ్యారికేడ్ల కారణంగా ట్రాఫిక్‌కు కొంత అంతరాయం ఏర్పడుతున్నట్లు గమనించాం. అందువల్ల వీలైనంత త్వరగా శాశ్వత నిర్మాణ పనులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం. అదేవిధంగా గుండ్రటి ఆకారంలో ఉన్న మ్యాన్‌హోల్ వాటర్ వర్క్స్ పరిధిలోకి వస్తుంది. ఈ విషయాన్ని ఇప్పటికే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఆ మ్యాన్‌హోల్‌కు కూడా త్వరలోనే నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

*– అభిరామ్, అసిస్టెంట్ ఇంజనీర్, జీడిమెట్ల సర్కిల్*

## ఓటు హక్కుకు 'ఎస్సైఆర్' పరీక్షా?

- అర్హుడి ఓటు తొలగిస్తే సహించం
- నోటీసులు, పత్రాల సమర్పణపై ప్రజల్లో గందరగోళం
- పేదలు, వలస కార్మికులకు వెసులుబాటు కల్పించాలని డిమాండ్




సూరారం, సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర): ఎస్సైఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లకు జారీ చేస్తున్న నోటీసులు, ఆధారాల సమర్పణ విషయంలో నెలకొన్న గందరగోళాన్ని తొలగించాలని.. అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సూరారం కాలనీలో ధర్నా నిర్వహించారు. నా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ భవన్ ఎదుట ఈ ఆందోళన చేపట్టారు.

### *పత్రాలు లేవని ఓటు తొలగించొద్దు*

ఎస్సైఆర్ ప్రక్రియలో భాగంగా పలువురు ఓటర్లకు నోటీసులు అందుతున్న నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన నెలకొందని గోగులపాటి కృష్ణమోహన్ అన్నారు. పేదలు, నిరక్షరాస్యులు, సొంత ఇళ్లు లేని వారు, వలస కార్మికుల వద్ద అవసరమైన అన్ని పత్రాలు అందుబాటులో ఉండకపోవచ్చని పేర్కొన్నారు. కేవలం పత్రాలు అందుబాటులో లేవన్న కారణంతో అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకూడదన్నారు.

### *కంప్యూటర్ తప్పిదాలకు ఓటర్లదే బాధ్యతా?*

అధికారిక డేటా నమోదు సమయంలో కంప్యూటర్ ఆపరేటర్ల ద్వారా జరిగే పొరపాట్లకు ఓటర్లు బాధ్యత వహించాల్సిన పరిస్థితి రాకూడదని కృష్ణమోహన్ అన్నారు. 1987కు ముందు నాటి అధికారిక పత్రాలను సమర్పించాల్సి వస్తే ప్రస్తుత కాలంలో 50, 60 ఏళ్లకు పైబడిన వారికే అలాంటి పత్రాలు అందుబాటులో ఉండే అవకాశం ఉందని, తక్కువ వయసున్న వారికి వాటిని సమర్పించడం ఆచరణలో కష్టమని ఆవేదన వ్యక్తం చేశారు.

### *సందేహాలకు అధికారులు సమాధానం చెప్పాలి*

ఆధార్, రేషన్ కార్డు తదితర పత్రాల విషయంలో ప్రజల్లో నెలకొన్న సందేహాలను అధికారులు స్పష్టంగా నివృత్తి చేయాలని కోరారు. అర్హులైన ఓటర్లకు తమ వివరాలను సరిచేసుకునేందుకు తగిన అవకాశం కల్పించాలని, ఓటరు పేరు తొలగించే ముందు సంబంధిత వ్యక్తికి సమాచారం అందించి.. తన వాదన వినిపించుకునే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### *ప్రజలకు అవగాహన కల్పించాలి*

ఎస్సైఆర్ ప్రక్రియపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించడంతో పాటు పేదలు, సామాన్యులు, వలస కార్మికులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ధర్నాలో పాల్గొన్న పలువురు కోరారు. అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కు పరిరక్షించబడేలా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఈ అంశాన్ని పునఃపరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్థానికులు చంద్రశేఖర్, రాము, రామకృష్ణ, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తరుగు భారం మోయలేం.. రైస్ మిల్లుల బంద్ కు ములుగు జిల్లా రైస్ మిల్లర్ల నిర్ణయం



ములుగు సెప్టెంబర్ 08, విజన్ ఆంధ్ర ప్రతినిధి: తరుగు భారం మోయలేక రైస్ మిల్లులను బంద్ చేస్తున్నట్లు ములుగు జిల్లా రైస్ మిల్లర్ల సంఘం లిఅధ్యక్షుడు బాదం ప్రవీణ్‌లి ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర మిల్లర్ల సంఘం పిలుపు మేరకు ఈ నెల 8 నుంచి జిల్లాలో రైస్ మిల్లింగ్ పనులు నిలిపివేస్తున్నట్లు సోమవారం కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లిబాదం ప్రవీణ్‌లి మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ ధాన్యంలో ఫిజికల్ వెరిఫికేషన్ లో 15 నుంచి 20 శాతం తరుగు వస్తోందని, 9 నెలల పాటు బియ్యం తీసుకోకపోవడం వల్ల 41 కిలోల బస్తా 37 కిలోలకు తగ్గిందని లిబాదం ప్రవీణ్‌లి తెలిపారు. ఈ తరుగు ప్రభుత్వ జాప్యం వల్లే జరిగిందని, మిల్లర్లపై రుద్దడం సరికాదన్నారు. నాన్ ఎఫ్ఏక్యూ ధాన్యం వల్ల సార్టెక్స్ వేయాల్సి వస్తోందని, 10 శాతం డిస్ కలర్, డ్యామేజ్ బియ్యం వస్తోందని, దీనిని లిక్కర్, ఇథనాల్ ఫ్యాక్టరీలకు తక్కువ ధరకు అమ్మడం వల్ల క్వింటాలుకు రూ.750 నుంచి 1000 నష్టం వస్తోందని లిబాదం ప్రవీణ్‌లి వివరించారు. రబీ బాయిల్డ్ ధాన్యాన్ని బాయిల్డ్ మిల్లుల్లోనే దించామని, అవసరం లేకపోతే టెండర్ ద్వారా తరలించాలని, గోదాముల్లో స్థలం లేక ఎఫ్సీఐ బియ్యం తీసుకోవడం లేదని, తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని లిబాదం ప్రవీణ్‌లి డిమాండ్ చేశారు.

# కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై కాంగ్రెస్ దండు.. ఎర్రవల్లికి వేలాదిగా శ్రేణులు!

**- డప్పుల మోతతో ఎర్రవల్లి వైపు కాంగ్రెస్ దూకుడు**

**- 'కేసీఆర్ డౌన్ డౌన్' నినాదాలతో మార్మోగిన పరిసరాలు**

**- భారీగా మోహరించిన పోలీసులు.. కాంగ్రెస్ శ్రేణులను అడ్డుకున్న వైనం**



సంగారెడ్డి డిస్క్, విజన్ ఆంధ్ర, సెప్టెంబర్ 8:– సిద్ధిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్ ముట్టడికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివస్తున్నారు. డప్పుల మోతలు, నినాదాలతో ఎర్రవల్లి పరిసరాలు ఒక్కసారిగా రాజకీయ ఉద్రిక్తతతో మార్మోగుతున్నాయి. మర్కుక్ మండలం వరదరాజపూర్ గ్రామం వైపు నుంచి గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున ఫామ్‌హౌస్ వైపు కదులుతున్నాయి. 'కేసీఆర్ డౌన్ డౌన్' అంటూ పోటెత్తిన నినాదాలతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పరిస్థితి అదుపుతప్పకుండా పోలీసులు భారీగా మోహరించి కాంగ్రెస్ శ్రేణులను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఫామ్‌హౌస్ వైపు ఎవరూ వెళ్లకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

## డప్పులతో కాంగ్రెస్ దూకుడు.. అడ్డుకున్న బీఆర్ఎస్ శ్రేణులు

**- పోటాపోటీ నినాదాలు.. ఉద్రిక్తంగా మారిన ఎర్రవల్లి శివారు**

**- దామరగుంట వద్ద కాంగ్రెస్ నేతల బి ఆర్ ఎస్ నేతల వాగ్వాదం**



సంగారెడ్డి డెస్క్ విజన్ ఆంధ్ర, సెప్టెంబర్ 8:–ఎర్రవల్లి గ్రామ శివారులో రాజకీయ రగడ తారస్థాయికి చేరింది. కేసీఆర్ ఫామ్‌హౌస్ వైపు కాంగ్రెస్ శ్రేణులు భారీగా డప్పులతో, నినాదాలతో దూసుకెళ్లే ప్రయత్నం చేయగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుని ఒక్కసారిగా ఘర్షణ వాతావరణం నెలకొంది. పోటాపోటీ నినాదాలతో ఎర్రవల్లి పరిసరాలు దద్దరిల్లాయి. ఇరు వర్గాల కార్యకర్తలు ఎదురెదురుగా నిలవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఉద్రిక్తత మరింత పెరగకుండా పోలీసులు రంగంలోకి దిగి ఇరు వర్గాలను నిలువరించే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు దామరగుంట వద్ద ఫామ్‌హౌస్‌కు వస్తున్న కాంగ్రెస్ నాయకుల వాగ్వాదానికి దిగడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఉద్రిక్తతను మరింత పెంచింది. ఘటనల నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలి


**అధికారులను ఆదేశించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా**



మహబూబ్ నగర్ సెప్టెంబరు 08 విజన్ ఆంధ్ర ప్రతినిధి : మంగళవారం హన్వాడ మండలం నాయినోనిపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ ఫారాల్లో నమోదైన వివరాల్లో తప్పులను ఎలా సరిచేస్తున్నారు, ఇప్పటివరకు ఎంతమంది ఓటర్లకు నోటీసులు జారీ చేశారు, ఇంకా ఎన్ని నోటీసులు పెండింగ్‌లో ఉన్నాయి, ఎన్ని కేసుల్లో సవరణలు పూర్తయ్యాయి తదితర వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల జాబితాలో ఇంటిపేరు, ఓటరు పేరు, ఫొటో తదితర వివరాల్లో తేడాలు ఉన్నట్లయితే వాటిని నిబంధనల ప్రకారం సరిచేయాలని అధికారులకు సూచించారు. ఓటర్ల జాబితాలో అర్హత కలిగిన వారి పేర్లు తొలగిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఫొటోల్లో తప్పులు ఉంటే వాటిని సరిచేయడంతో పాటు, పేరు లేదా ఇంటిపేరులో మార్పులు అవసరమైతే సంబంధిత ఆధారాలను పరిశీలించి సవరణలు చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా జారీ చేసిన నోటీసుల వివరాలను కూడా కలెక్టర్ తెలుసుకున్నారు. నోటీసులు జారీ చేసిన అనంతరం సంబంధిత ఓటర్లకు విచారణ (హియరింగ్) నిర్వహిస్తున్నారా, ప్రతిరోజూ ఎంతమంది విచారణకు హాజరవుతున్నారు, వారి స్పందన ఎలా ఉందనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విచారణకు ఓటర్లు హాజరవుతున్న తీరు, ప్రజల స్పందనపై అధికారులు కలెక్టర్‌కు వివరించారు. విచారణ ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని, నోటీసులు అందుకున్న ఓటర్లు విచారణకు హాజరవుతున్నారని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హన్వాడ తహసీల్దార్ కిష్ట్యా నాయక్, ఆర్.డి.ఓ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి లేని రాజకీయ నాయకులను తయారు చేయాల్సింది అధ్యాపకులే

**- సోషల్ జస్టిస్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు ఏషబోయిన సాంబయ్య యాదవ్.**



ములుగు సెప్టెంబర్ 08, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ఉన్నత విద్యా సంస్థలలో పనిచేస్తున్న అధ్యాపకులు విద్యార్థులను అవినీతి లేని రాజకీయ నాయకులుగా తయారు చేయాలని సోషల్ జస్టిస్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు లిఏషబోయిన సాంబయ్య యాదవ్‌లి పిలుపునిచ్చారు. ములుగు జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో సోమవారం జరిగిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షులు బాణాల ప్రభాకర్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు బాసాని రామ్మూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా లిసాంబయ్య యాదవ్‌లి మాట్లాడుతూ.. అధ్యాపకులు విద్యార్థులకు రాజకీయ నైపుణ్యాన్ని నేర్పించి ప్రభుత్వ నిర్మాణంలో ప్రధాన భూమిక పోషించేలా తయారు చేయాలన్నారు. విలువలు, నైతిక బాధ్యత కలిగిన నాయకత్వం వల్లనే భారతదేశం అవినీతి లేని ప్రజాస్వామ్య వ్యవస్థగా రూపుదిద్దుకుని ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. బాసాని రామ్మూర్తి మాట్లాడుతూ తరగతి గదిలోనే దేశ భవితవ్యం నిర్మాణమవుతుందని, సైనికులు, వైద్యులు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు అందరూ ఉపాధ్యాయుల చేతిలోనే తయారవుతారని అన్నారు. కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కుల సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కల్వకుర్తి గురుకులాలకు రాష్ట్ర స్థాయి పురస్కారాల పంట

**- ఉత్తమ ప్రిన్సిపాల్ గా యామిని, ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్ గా సిందూజ**







తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, సెప్టెంబర్ 08: కల్వకుర్తి పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యాలయాలకు రాష్ట్ర స్థాయిలో ఘన గుర్తింపు లభించింది. కొడంగల్ లో సీఎం రేవంత్ రెడ్డి సభా ప్రాంగణంలో సెప్టెంబర్ 5న గురుపూజోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి అవార్డుల ప్రదానోత్సవంలో కల్వకుర్తికి చెందిన ఇద్దరు ప్రతిభ కనబరిచారు. నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణానికి చెందిన ఎంజేపీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ యామిని రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డును అందుకున్నారు. తెలంగాణ ఇంటర్మీడియట్ కార్యదర్శి యోగితా రాణా, ఎంజేపీటీబీసీరెస్ కార్యదర్శి సైదులు చేతుల మీదుగా ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా యామిని మాట్లాడుతూ తనను ప్రోత్సహించిన అధికారులకు, సహచర ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. అదే వేదికపై కల్వకుర్తి ఎంజేపీ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సిందూజ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్ అవార్డును అందుకున్నారు. గత రెండేళ్లలో 50కి పైగా విద్యార్థులను వివిధ క్రీడలలో జాతీయ స్థాయికి తీసుకెళ్లినందుకు ఈ పురస్కారం లభించింది. విశేషం ఏమిటంటే సిందూజ 2013–14లో అదే ఎంజేపీ పాఠశాలలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థి. నేడు అదే పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ గా తన విద్యార్థులను నేషనల్ స్థాయికి తీసుకెళ్లడం అందరినీ ఆకట్టుకుంటోంది. అవార్డులు అందుకున్న ఇద్దరినీ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగమణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఘనంగా అభినందించారు.

# రుణ లక్ష్యాల సాధనకు బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలి

**- అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణాలు అందేలా చర్యలు**

**- జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా**




నిర్మల్ జిల్లా,సెప్టెంబర్ 08,(విజన్ ఆంధ్ర); జిల్లా ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేసేందుకు నిర్దేశించిన వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలను వంద శాతం సాధించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా బ్యాంకర్లను ఆదేశించారు. అర్హులైన రైతులు, విద్యార్థులు, యువత, మహిళా స్వయం సహాయక సంఘాలు, చిన్న వ్యాపారులకు రుణాలు సకాలంలో అందేలా బ్యాంకర్లు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశంలో 202627 వార్షిక రుణ ప్రణాళిక, ప్రభుత్వ పథకాల రుణాల మంజూరు, ప్రాధాన్యతా రంగాలకు ఆర్థిక సహాయం, సామాజిక భద్రతా పథకాల అమలుపై కలెక్టర్ సమీక్షించారు. 202627 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలోని బ్యాంకులకు రూ.7,952.87 కోట్ల రుణ లక్ష్యం నిర్దేశించగా ఇప్పటివరకు రూ.2,331.18 కోట్లు (29.31 శాతం) సాధించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రాధాన్యతా రంగాలకు నిర్దేశించిన రూ.6,661.73 కోట్ల లక్ష్యానికి గాను రూ.1,847.71 కోట్లు (27.74 శాతం) సాధించారని పేర్కొన్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. విద్యా రుణాల మంజూరు తక్కువగా ఉందని పేర్కొన్న కలెక్టర్, అర్హులైన విద్యార్థులకు అధిక సంఖ్యలో రుణాలు అందించాలని ఆదేశించారు. జిల్లాలో బ్యాంకు ఖాతాలు లేని ప్రతి ఒక్కరికీ సెప్టెంబర్‌లోగా ఖాతాలు తెరవాలని సూచించారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, కాస్మోటిక్ ఛార్జీల జమ కోసం లక్ష్యంగా పెట్టుకున్న 3,500 ఖాతాల్లో ఇప్పటికే 1,022 కొత్త ఖాతాలు ప్రారంభించినట్లు తెలిపారు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, పీఎం విశ్వకర్మ, పీఎం స్వనిధి, ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజీ తదితర పథకాల అమలును కలెక్టర్ సమీక్షించారు. రుణ లక్ష్యాల సాధనకు జిల్లా పరిశ్రమల శాఖ బ్యాంకర్లతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజీ, పీఎం స్వనిధి రుణాల్లో ఎన్‌పీఏలను తగ్గించేందుకు మున్సిపల్ కమిషనర్లతో సమావేశాలు నిర్వహించాలని ఎల్‌డీఎంను సూచించారు. మొండి బకాయిల వసూళ్లకు సీబీఆర్ఎం బృందాల సేవలను వినియోగించుకోవాలని, అన్ని బ్యాంకులను సమన్వయం చేస్తూ మెరుగైన పనితీరు సాధించాలని ఎల్‌డీఎంను ఆదేశించారు. ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజీ లక్ష్యాలను పూర్తి చేయడంతోపాటు డిజిటల్ ఎంసీపీ సమస్యలను పరిష్కరించాలని పీడీ డీఆర్‌డీఏకు సూచించారు. విజయ డెయిరీతో టైఅప్ ద్వారా రైతులకు పాడి పశువుల కొనుగోలుకు రుణాలు అందించే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. పాడి పశువులకు అవసరమైన ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలను జారీ చేయాలని జిల్లా పశువైద్యాధికారిని ఆదేశించారు. డెయిరీ యూనిట్లకు బ్యాంకులు అవసరమైన ఆర్థిక సహకారం అందించాలని కోరారు. రైస్ మిల్లుల ఫైనాన్స్‌కు అవసరమైన ఎన్ఓసీలు, బ్యాంకు గ్యారెంటీల జారీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు సంబంధిత శాఖలు బ్యాంకులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై వంటి సామాజిక భద్రతా పథకాల కింద మరణించిన లబ్ధిదారుల కుటుంబాలకు అందిన క్లెయిమ్‌లను విజయగాథలుగా ప్రచారం చేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే ఎల్‌నినో ప్రభావం జిల్లాలోని క్రెడిట్ పోర్ట్‌ఫోలియోపై ఎలా ఉండొచ్చో అంచనా వేసి నివేదిక అందించాలని ఎల్‌డీఎంను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎల్‌డీఎం బి. రామ్‌గోపాల్, ఆర్‌బీఐ ఏజీఎం, ఎల్‌బీఓ ఎస్. రాములు, పీడీ డీఆర్‌డీఏ విజయలక్ష్మి, ఆర్ఎం నవీన్ పురం, సీఎం క్రెడిట్ ఆర్‌బీఓ ఆదిలాబాద్ పియూష్, వివిధ బ్యాంకుల అధికారులు, నాబార్డ్, ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలు విడుదల చేయాలి!.. భాగ్యరథి డిగ్రీ కళాశాల బంద్..

**- నాలుగు విద్యా సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్**

**- ప్రభుత్వం తక్షణమే స్పందించాలి..**

**- విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి**




జీడిమెట్ల, సెప్టెంబరు 8 (విజన్ ఆంధ్ర): తెలంగాణలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు గత నాలుగు విద్యా సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్య సంఘం చేపట్టిన ఒకరోజు కళాశాలల బంద్‌కు చింతల్‌లోని భాగ్యరథి డిగ్రీ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ మేరకు కళాశాలను బంద్ చేసి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ నల్ల జై శంకర్ గౌడ్, ప్రిన్సిపాల్ నవీన్ రాజ్ బంద్ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. డైరెక్టర్ నల్ల జై శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. గత నాలుగు విద్యా సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. కళాశాలల నిర్వహణ, అధ్యాపకులు, సిబ్బంది వేతనాల చెల్లింపులతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంపై ఈ జాప్యం ప్రతికూల ప్రభావం చూపుతోందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. నాలుగు విద్యా సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు, ఇకపై రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో విడుదలయ్యేలా శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ప్రిన్సిపాల్ నవీన్ రాజ్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల్లో జాప్యం కారణంగా ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ప్రభుత్వం ఇకనైనా ఆలస్యం చేయకుండా పెండింగ్ బకాయిలను విడుదల చేసి కళాశాలలకు ఆర్థికంగా అండగా నిలవాలని కోరారు.కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు బంద్ కార్యక్రమంలో పాల్గొని తమ మద్దతు తెలిపారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి కళాశాలల ఆర్థిక సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ





కల్వకుర్తి, విజన్ ఆంధ్ర, సెప్టెంబర్ 08: కల్వకుర్తి గవర్నమెంట్ హైస్కూల్ నందు సోమవారం సంకల్ప సిద్ధి కార్యక్రమం ప్రసూన గంగుల అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాలమూరు ఎన్నారై ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు మరియు ఫిలడెల్ఫియా తెలంగాణ అసోసియేషన్ ప్రోగ్రాం డిజైనర్ మేరెడ్డి రవి ప్రకాష్ హాజరయ్యారు. పాలమూరు ఎన్నారై కోఆర్డినేటర్ మహిపాల్ రెడ్డి, ఫిలడెల్ఫియా తెలంగాణ అసోసియేషన్ ప్రతినిధి సాయి పాల్గొన్నారు. గత వేసవి సెలవుల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దాదాపు 50 మంది విద్యార్థులకు సంకల్ప సిద్ధి ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ తరగతులు నిర్వహించారు. క్రమం తప్పకుండా హాజరైన 30 మంది విద్యార్థులకు రవి ప్రకాష్ మేరెడ్డి ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు, వాటర్ బాటిళ్లు, జామెట్రీ బాక్సులు అందజేశారు. త్వరలో ఎన్ఎంఎంఎస్ పరీక్షకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు అవసరమైన మెటీరియల్ కూడా అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సంకల్ప సిద్ధి ఇన్చార్జి సభావత్ శ్రీను, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రోబోటిక్ న్యూరోసర్జరీతో మెరుగైన చికిత్స

**- యశోద హాస్పిటల్స్ వెల్లడి**




మహబూబ్ నగర్ అర్బన్,విజన్ ఆంధ్ర, సెప్టెంబర్ 8: సంక్లిష్టమైన బ్రెయిన్ ట్యూమర్లకు అత్యాధునిక రోబోటిక్ సాంకేతికతతో మరింత కచ్చితమైన, సురక్షితమైన శస్త్రచికిత్సలు అందిస్తున్నట్లు సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ ప్రతినిధులు తెలిపారు. మహబూబ్ నగర్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో యశోద హాస్పిటల్స్ మేనేజర్ బి. సుదర్శన్ రెడ్డి, రోహిత్ కుమార్ పాల్గొన్నారు. మెదడు శస్త్రచికిత్సలకు ప్రత్యేకంగా రూపొందించిన 'రోసా' (ROSA) రోబోటిక్ సర్జికల్ అసిస్టెంట్ న్యూరోసర్జన్ కు ఊూ మాదిరిగా మార్గనిర్దేశం చేస్తుందని తెలిపారు. దీని సహాయంతో మెదడులోని లోతైన కణితులను కీహోల్ విధానంలో అత్యంత కచ్చితత్వంతో ఆపరేషన్ చేయవచ్చని వివరించారు. ఇంట్రా ఆపరేటివ్ MRI, న్యూరోనావిగేషన్, మైక్రోస్కోప్, ఎండోస్కోప్, ఇంట్రా ఆపరేటివ్ మానిటరింగ్ వంటి ఆధునిక సౌకర్యాలతో సంక్లిష్ట బ్రెయిన్ ట్యూమర్లకు మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. అలాగే యశోద సెంటర్ ఫర్ న్యూరో ఎండోస్కోపీ ద్వారా పిట్యూటరీ ట్యూమర్లు, స్కల్ బేస్ సమస్యలు, ట్రైజెమినల్ న్యూరాల్జియా తదితర వ్యాధులకు ముక్కు ద్వారా లేదా కీహోల్ విధానంలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

# చీకటి మాటున దోపిడీ వేట!

**- ద్విచక్రవాహనంపై వెళ్తున్న జంటను అటకాయించిన ముగ్గురు వ్యక్తులు**

**- నిర్జన ప్రాంతానికి తీసుకెళ్లి బెదిరింపులు.. మహిళ ఆభరణాల అపహరణ**

**- చాకచక్యంగా ఛేదించిన జగద్గిరిగుట్ట పోలీసులు.. ముగ్గురు అరెస్టు**



జగద్గిరిగుట్ట, సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర): చీకటి పడిన తర్వాత నిర్మానుష్య ప్రాంతాల్లో రెక్కీ నిర్వహిస్తూ ఒంటరిగా ప్రయాణించే వారిని లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడుతున్న ముగ్గురిని జగద్గిరిగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 6న రాత్రి కూకట్‌పల్లి నుంచి జీడిమెట్ల వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను యల్లమ్మబండలోని సిక్కు బస్తీ, గురుగోవింద్‌సింగ్ కాలనీ వద్ద ముగ్గురు వ్యక్తులు అడ్డగించారు.

**నిర్జన ప్రాంతానికి తీసుకెళ్లి..**

ముగ్గురు వ్యక్తులు బాధితులను బెదిరించి సమీపంలోని నిర్మానుష్య ప్రాంతం వైపు తీసుకెళ్లినట్లు పోలీసులకు అందిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్కడ దాడి చేసి డబ్బులు ఇవ్వాలని బెదిరించినట్లు తెలిపారు. అనంతరం మహిళ వద్ద ఉన్న బంగారు చెవిదుద్దులు, ప్లాటినం ఉంగరాన్ని బలవంతంగా తీసుకుని పరారైనట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై సెప్టెంబర్ 7న తెల్లవారుజామున 12.45 గంటలకు ఫిర్యాదు అందడంతో జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**సీసీ కెమెరాలు, సమాచారంతో పట్టివేత**

కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించగా.. ఈ ఘటనకు పాల్పడినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితులను తిలిపిత్య దీపక్‌సింగ్ (45), బౌరీ రాచన్‌సింగ్ (25), బురానీ సుర్జిత్‌సింగ్ (25)గా గుర్తించారు. వారి నుంచి సుమారు 4 గ్రాముల బరువున్న ఒక జత బంగారు చెవిదుద్దులు, ఒక ప్లాటినం ఉంగరం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. సెప్టెంబర్ 8న నిందితులను అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

**చీకటి పడితే రెక్కీ.. ఒంటరిగా కనిపిస్తే టార్గెట్**

పోలీసుల విచారణలో నిందితుల వ్యవహారశైలి వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. సూర్యాస్తమయం తర్వాత యల్లమ్మబండ సిక్కు బస్తీ పరిసరాల్లో రెక్కీ నిర్వహించి.. ఒంటరిగా ప్రయాణించే వారిని గుర్తించేవారని పోలీసులు తెలిపారు. అనంతరం మార్గమధ్యంలో అడ్డుకుని నిర్మానుష్య ప్రాంతాలకు తీసుకెళ్లి బెదిరించడం, దాడి చేయడం, నగదు లేదా ఆభరణాలను అపహరించడం చేసేవారని పేర్కొన్నారు.

**ఏ1పై గతంలోనూ చోరీ కేసు**

నిందితుల్లో ఏ1గా ఉన్న దీపక్‌సింగ్‌పై గతంలో జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో రాత్రివేళ ఇంటి చోరీ కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. మిగిలిన నిందితుల నేర చరిత్రపైనా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

**పోలీసు బృందానికి అభినందనలు**

కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ ఎన్.కోటి రెడ్డి (ఐపీఎస్), కుత్బుల్లాపూర్ డివిజన్ ఏసీపీ ఏ.సి.బాలగంగి రెడ్డి పర్యవేక్షణలో జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ ఎన్.సురేష్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పి.నరేంద్ర రెడ్డి, ఎస్ఐ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలోని క్రైమ్ సిబ్బంది కేసును ఛేదించినట్లు పోలీసులు తెలిపారు. హెడ్ కానిస్టేబుళ్లు కె.పురందాస్, కె.నరేష్‌కుమార్, మహిళా పోలీస్ కానిస్టేబుల్ ఎం.సుమ తదితరులు దర్యాప్తులో పాల్గొన్నారు. కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# అక్షరాస్యతతోనే సమాజ ప్రగతి ప్రతి ఒక్కరూ విద్యావంతులుగా ఎదగాలి

**- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

**అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా మహబూబ్‌నగర్‌లో అవగాహన ర్యాలీ**




మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 8(విజన్ ఆంధ్ర)అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం ఘనంగా అక్షరాస్యత అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ (గ్రా) మైదానం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా పరిషత్ మైదానం నుంచి ప్రారంభమైన ర్యాలీ మల్లికార్జున్ ఎంటర్‌ప్రైజెస్ మీదుగా కొనసాగి అంబేద్కర్ చౌరస్తా వద్ద ముగిసింది. ర్యాలీలో పాఠశాల విద్యార్థులు, మహిళలు, ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్స్,వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా అక్షరాస్యత కేవలం చదవడం, రాయడం నేర్చుకోవడమే కాకుండా వ్యక్తి సాధికారతకు, కుటుంబ అభివృద్ధికి, సమాజ పురోగతికి పునాది అని అన్నారు. ప్రతి ఒక్కరూ విద్యను అందిపుచ్చుకొని తమ హక్కులు, బాధ్యతలు తెలుసుకోవాలని సూచించారు. "అక్షరం ప్రతి ఒక్కరి హక్కు విద్య ప్రతి కుటుంబానికి బలం. నిరక్షరాస్యతను నిర్మూలించి, ప్రతి వ్యక్తిని అక్షరాస్యుడిగా తీర్చిదిద్దడం మనందరి సామాజిక బాధ్యత" అని కలెక్టర్ పేర్కొన్నారు. అక్షరాస్యత పెరిగితే ప్రజల్లో అవగాహన, ఆత్మవిశ్వాసం, ఉపాధి అవకాశాలు పెరిగి సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. వయోజన విద్యా శాఖ ఉప సంచాలకులు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో అక్షరాస్యత ప్రాధాన్యతపై అవగాహన కల్పించడం, నిరక్షరాస్యులను విద్య వైపు ప్రోత్సహించడం, "ప్రతి ఒక్కరూ చదవాలి ప్రతి ఒక్కరూ ఎదగాలి" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం లక్ష్యంగా ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వయోజన విద్యా శాఖ, మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో చీ×ఖ్రాఖూూూ కార్యక్రమం కింద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జడ్.పి.సి.ఈ.ఓ వెంకట రెడ్డి, డి.ఈ.ఓ విజయ కుమారి,డి.ఆర్.డి.ఓ నర్సింహులు, వయోజన విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రైతులకు కూరగాయల సాగుపై శిక్షణ



ఆదిలాబాద్, సెప్టెంబర్ 08 (విజన్ ఆంధ్ర): ఆదిలాబాద్‌లోని కృషి విజ్ఞాన కేంద్రం వేదికగా మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు కూరగాయల సాగుపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని పలు గ్రామాల నుంచి వచ్చిన రైతులకు ఉద్యాన పంటల సాగు మెలకువలు నేర్పించారు. ఈ సందర్భంగా కేవీకే కోఆర్డినేటర్ రామ్ గోపాల్ వర్మ మాట్లాడుతూ, ఉద్యాన పంటల ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు పొందవచ్చని సూచించారు. శాస్త్రవేత్త మల్లేష్ మాట్లాడుతూ.. రసాయన పురుగుమందుల వాడకం తగ్గించి, సేంద్రియ విధానంలో కూరగాయలు సాగు చేయడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని వివరించారు. మహిత స్వచ్ఛంద సంస్థ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్ రావు మాట్లాడుతూ.. గిరిజన మహిళల సాధికారతే ధ్యేయంగా ఆదిలాబాద్ రూరల్, భీంపూర్ మండలాల పరిధిలోని 20 గ్రామాలకు చెందిన 150 మంది రైతులకు కూరగాయల నారు, విత్తనాలు, కంపోస్టు ఎరువు, వేప పిండి బస్తాలను ఉచితంగా అందించినట్లు తెలిపారు. రైతులకు మినీ ట్రాక్టర్లు, కలుపు తీసే పరికరాలు, స్ప్రేయర్లు అందించడంతో పాటు, సులువుగా విత్తనాలు చల్లడానికి మరియు మందులు పిచికారీ చేయడానికి స్వయం సహాయక సంఘాల మహిళలకు డ్రోన్లు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గిరిజన కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు రఘువీర్, మల్లేష్, కేవీకే మరియు మహిత సంస్థ సిబ్బంది ఆదర్శ్, ప్రవీణ్, అలివేలుమంగతో పాటు వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## మట్టి గణపతులనే పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

**- జిల్లా కలెక్టర్ రాజర్షి షా**




ఆదిలాబాద్, సెప్టెంబర్ 08 (విజన్ ఆంధ్ర): వినాయక చవితి ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణహితంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన గణేష్ ఉత్సవ శాంతియుత సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మండపాల వద్ద విద్యుత్ భద్రత, అగ్నిమాపక నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, పోలీస్ శాఖ అనుమతి పొందిన తర్వాతే మండపాలు ఏర్పాటు చేయాలని ఉత్సవ కమిటీలకు సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించి, పర్యావరణ హితంగా వేడుకలు జరుపుకోవాలని కోరారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లాలో 2,000 మట్టి వినాయక ప్రతిమలను అందుబాటులో ఉంచామన్నారు. మట్టి విగ్రహాలు కావాల్సిన వారు మెప్మా (8106344637), డీఆర్డీఓ (9701888058) నంబర్లను సంప్రదించాలని సూచించారు. అనంతరం ఉచిత మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించి ప్రజలకు స్వయంగా ప్రతిమలను అందజేశారు.

కట్టుదిట్టమైన భద్రత: ఎస్పీ అఖిల్ మహాజన్

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాల సందర్భంగా జిల్లావ్యాప్తంగా కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండపాల వద్ద నిర్వాహకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, ఆర్.ఎస్. చిత్రు, సబ్ కలెక్టర్ కే. ప్రణయ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, వైస్ చైర్మన్ రోహిత్, ఆర్డీవో జగదీశ్వర్‌రావు, వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ బీమా పథకంతో ఆర్థిక భరోసా

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం ఇందిరమ్మ బీమా పథకంను త్వరలోనే అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక రక్షణ, భరోసా కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం విధివిధానాలపై రాష్ట్ర ప్రణాళిక ప్రిన్సిపల్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్ మంగళవారం హైదరాబాదు నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభిప్రాయాలు సేకరించారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు కొరకు రాష్ట్రంలోని ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తును ఏ విధంగా తీసుకోవాలి అనే విషయంపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి కుటుంబ పెద్దకు రూ. 5 లక్షల జీవిత భీమా ఉచితంగా కల్పించడం జరుగుతుందన్నారు. 18-59 సంవత్సరాల వయసు గల కుటుంబ పెద్దకు కల్పించనున్న ఈ బీమా పథకంకు సంబంధించి నవంబర్ 19లోపు దరఖాస్తుల స్వీకరణ ఆన్లైన్ ప్రక్రియ ద్వారా పూర్తి చేసి పథకాన్ని ప్రారంభించుకోవాల్సి ఉందన్నారు. రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులతోపాటు మిగిలిన అన్ని రకాల కుటుంబ పెద్దలకు ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా ఉచితంగా కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కుటుంబ యజమాని ఆమె లేదా ఆయన ప్రమాదవశాత్తు మరణించిన సందర్భంలో వారి నామినీకి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రజల నుండి దరఖాస్తులను ఏ విధంగా సేకరించాలి, ఆన్లైన్లో ఏ విధంగా అప్లోడ్ చేయాలనే అంశాలపై వారి అభిప్రాయాలను వివరించారు. గద్వాల ఐడిఓసి కలెక్టర్ ఛాంబర్ నుంచి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఈడీఎం శివ పాల్గొన్నారు.

# ఉప్పల్ బగాయతులో ఈనెల 13న భూమి పూజ

**- భూమి పూజకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**- వేల సంఖ్యలో ఆర్యవైశ్య ప్రతినిధులు తరలి రావాలి**

**- రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు పిలుపు**






కాప్రా/సెప్టెంబర్ 7(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని ఉప్పల్ బగాయత్లో రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్యుల కోసం కేటాయించిన ఐదు ఎకరాల స్థలంలో నిర్మించే ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన సముదాయ నిర్మాణ భూమి పూజ కార్యక్రమానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఆర్య వైశ్యులు వేలాదిగా తరలి రావాలని తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం నాడు ఉప్పల్ బగాయతులో జరిగిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆర్యవైశ్య మహాసభ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమరవాది మాట్లాడుతూ ఈనెల 13వ. తేదీన నిర్వహించే భూమి పూజ కార్యక్రమానికి రాష్ట్రంలోని ఆర్యవైశ్య సోదరీ సోదరీమణులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ప్రతి జిల్లాలోని ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు బాధ్యత వహించి అధిక సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని వైశ్యుల సత్తా ను చాటాలని, రాబోయే ఎన్నికల్లో మన ఐక్యత ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సుమారు 30 కోట్ల రూపాయల వ్యయంతో అత్యాధునిక సౌకర్యాలతో అంగరంగ వైభవంగా నిర్మాణం జరగనుందని ఆయన వివరించారు. భూమి పూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆర్యవైశ్య మహాసభ, రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ కీలక భూమిక పోషించాలని అధ్యక్ష కార్యదర్శులు బెలిదే రమేష్ గుప్తా, బచ్చు నగేష్ గుప్తా లకు సూచించారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఉప్పల్ బగాయతులో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ భవన సముదాయం ఏర్పాటు కావడం జిల్లాకే గర్వకారణమని మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి బెలిదే రమేష్ గుప్తా , బచ్చు నగేష్ గుప్త లు అన్నారు. భవన సముదాయ నిర్మాణంలో తమ వంతు బాధ్యతగా కీలకపాత్రను పోషిస్తామని తెలిపారు. మేడ్చల్ జిల్లాలోని ఆర్యవైశ్యులందరూ ఈనెల 13న జరిగే భూమి పూజ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి యనమల రేవంత్ రెడ్డి విచ్చేస్తున్నందున పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ప్రభుత్వం కేటాయించిన ఉప్పల్ భగత్ స్థలంలో ఉదయం 8 గంటలకు శ్రీనివాస కళ్యాణం నిర్వహిస్తున్నామని దంపతులు కళ్యాణ మహోత్సవంలో పాల్గొనవచ్చు అని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ కమిటీ చైర్మన్ అగ్గి వెంకటేష్, మాజీ కోశాధికారి నేతి రాములు,ఉపాధ్యక్షుడు ఊరే లక్ష్మణ్ ,మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు భేలిదే రమేష్,ప్రధాన కార్యదర్శి బచ్చు నగేష్ కుమార్,మెంబర్ షిప్ కమిటీ చైర్మన్ పెరుమాళ్ అనిల్ బాబు, కాసం వెంకట హరి, పెద్ది శ్రీనివాస్, తారకేష్, రమేష్, బిక్కుమల్ల రమేష్, పొద్దుటూరు నర్సింగరావు, సత్యనారాయణ, పవన్, సుధాకర్, శ్రీను,సంతోష్ రాష్ట్ర మహిళ విభాగం ప్రధాన కార్యదర్శి సామ్రాజ్య లక్ష్మి,ఉపాధ్యక్షురాలు బచ్చు సుదీప, భేలిదే వసంత,బచ్చు సరిత,పోలా చందన,శిరీష, వివిధ మండలాల, పట్టణ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారులు, సభ్యులు, ఆర్యవైశ్య ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వాడుక భాషలోనే రచనలు ఉండాలి

**- డాక్టర్.నందిని సిద్ధ రెడ్డి**

**- కాళోజి జయంతి సందర్భంగా**

**'తెలుగునాడు' మాసపత్రిక ఆవిష్కరణ**






కాప్రా/సెప్టెంబర్ 08(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా, ప్రజల వాడుక భాషలోనే రచనలు సాగాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నందిని సిద్ధారెడ్డి అన్నారు. కాళోజి నారాయణరావు జయంతి సందర్భంగా మంగళవారం కాప్రా ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన 'తెలుగునాడు' మాసపత్రిక ఆవిష్కరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సభకు 'తెలుగునాడు' మాసపత్రిక ఎడిటర్ గుమ్మడి హరిప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లినందిని సిద్ధారెడ్డి మాట్లాడుతూలి తెలుగు భాషలో ఎంతోమంది కవులు, రచయితలు విలువైన రచనలు చేస్తున్నారని, వారి రచనలు అభ్యుదయంతో పాటు సమాజాన్ని ప్రగతి వైపు నడిపించే విధంగా ఉండాలని ఆకాంక్షించారు. తెలుగు భాషలో దాగి ఉన్న గొప్పతనం, వైభవం, ప్రాధాన్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి భాష పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రముఖ పద్యకవి డాక్టర్ రాధశ్రీ మాట్లాడుతూ పద్యాల ద్వారా ప్రజలను అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు నడిపించవచ్చన్నారు. వేమన కాలం నుంచి నేటి వరకు పద్యం ప్రజలను చైతన్యపరిచే సాధనంగా కొనసాగుతోందని తెలిపారు. స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గౌడుగు యాదగిరిరావు మాట్లాడుతూ గిడుగు రామమూర్తి పంతులు వ్యవహారిక భాష కోసం చేసిన కృషిని వివరించారు. కాళోజి నారాయణరావు తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించడంతో పాటు ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించారని పేర్కొన్నారు. సినీ గీత రచయిత మౌనశ్రీ మల్లిక్ మాట్లాడుతూ నేటి సమాజంలో అనేక ఉద్యమాలకు గీతాలు ఊపిరి పోశాయని అన్నారు. పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతో పాటు అనేక ఉద్యమాలు విజయవంతమైన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. సమాజాన్ని ప్రభావితం చేయడంలో గీత రచనలకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వడ్లోజు జ్యోతిర్మయాచారి మాట్లాడుతూ ప్రస్తుత జర్నలిజం ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సవాళ్లను వివరించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల బాధ్యత కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో 'తెలుగునాడు' ఎగ్జిక్యూటివ్ బంగారు బి.వి. ఆచార్యులు, 'కుసుమ జయభేరి' సంపాదకులు రాధా కుసుమ, 'ధరణి' పత్రిక సంపాదకులు జి. రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన నేరేడ్‌మెట్ రజక సంఘం పాలకవర్గం



మల్కాజిగిరి, సెప్టెంబర్ 8, (విజన్ ఆంధ్ర): సీనియర్ నాయకులు కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఎస్.ఆర్. ప్రసాద్ ఆధ్వర్యంలో నేరేడ్‌మెట్ రజక సంఘం పాలక వర్గం మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారికి,ఆయన కాంగ్రెస్ కండువాలు కప్పి సభ్యులందరినీ కాంగ్రెస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నేరేడ్‌మెట్ రజక సంఘం పాలక వర్గం గతంలో మల్కాజ్‌గిరి ఎమ్మెల్యేగా మైనంపల్లి హనుమంత్ రావు,మాజీ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రజక సంఘానికి అవసర మైన 1200 గజాల స్థలాన్ని కలెక్టర్ తో మాట్లాడి మంజూరు చేయించడం జరిగిందన్నారు. అనంతరం ఆ స్థలంలో కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభిం చడం జరిగిందని వారు తెలిపారు. ప్రస్తుతం రజక సంఘానికి అవసరమైన కాంపౌండ్ వాల్, షెడ్, బోర్ వంటి సౌకర్యాల కల్పన కోసం మైనంపల్లి హనుమం త రావు, కమిషనర్ తో ఫోన్‌లో వెంటనే మాట్లాడి రూ.40 లక్షలు నిధులు మంజూరు చేయించారు. అలాగే మరో రూ.60 లక్షలు త్వరలో మంజూరు చేయి స్తానని ఆయన హామీని చ్చారు. అప్పుడు మైనం పల్లి హనుమంతరావు స్థలం ఇప్పించారని, ఇప్పు డు షెడ్ , ఇతర మౌలిక వసతుల కోసం నిధులు మంజూరు చేయించిన మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుకి నేరేడ్ మెట్ రజక సంఘం పాలక వర్గం తరపున హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్య క్రమంలో డివిజన్ అధ్యక్షు లు రాఘవన్, శ్యామ్, శ్రీని వాస్ యాదవ్, భాస్కర్, నరేష్, మహేష్ యాదవ్, అలాగే ధోబీఘాట్ అధ్యక్షు లు డి.పి.కృష్ణ, జనరల్ సెక్రటరీ పోతురాజు శంకర్, వైస్ ప్రెసిడెంట్ శివ, ట్రెజరర్ భరత్, సురేష్, నరసింహ, ప్రభాకర్, గణేష్, డి.పి. శంకర్, జై రాములు, మురళి, శోభ, రాజశేఖర్, నరసింహ, రవి, పి. శ్రీను, అంజు, పి. శ్రీను, డి.పి. సత్యం, ఏ. రాజు, రాము లు, పి. సూరి తదితరులు పాల్గొన్నారు.

# కళాశాలలో విద్యార్థులపై వేధింపులు అరికట్టాలి

***ప్రతి విద్యాసంస్థలో సీసీ టీవీ లు, నిరంతర పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలి: ఎస్ ఎఫ్ ఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి కార్తీక్***



మల్కాజిగిరి, సెప్టెంబర్ 8, (విజన్ ఆంధ్ర):మల్కాజిగిరి ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో విద్యార్థులపై వేధింపులను అరికట్టాలని ఎస్ ఎఫ్ ఐ మేడ్చల్ జిల్లా కమిటీ నాయకులు కోరారు. కళాశాలలలో విద్యార్థినులను వేధిస్తున్న ఓ వ్యక్తిని ఎస్ ఎఫ్ ఐ నాయకులు పట్టుకుని మంగళవారం నేరేడ్‌మెట్ పోలీసులకు అప్పగించారు. అనంతరం నిందితుడుపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ ఎఫ్ ఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ, కళాశాల విద్యార్థులను మాత్రమే కాకుండా అధ్యాపకులు, ఫ్యాకల్టీ, ప్రభుత్వ సిబ్బందిని కూడా కొంత మంది పోకిరీలు వేధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తూ, వాగ్వాదాలకు దిగడం, బెదిరింపులకు పాల్పడటం వంటి ఘటనలు చేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాసంస్థల్లో విద్యార్థులు భయంలేకుండా చదువుకునే పరిస్థితులు ఉండాలని, వారికి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందన్నారు.ఈ ఘటనపై పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థినుల భద్రతకు సంబంధించిన సమస్యలపై ఈగల్ టీమ్ ప్రత్యేక దృష్టి సారించాలని, మేడ్చల్ జిల్లాలోని అనేక ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఇలాంటి ఘటనలు అనేకం వెలుగులోకి వస్తున్నాయని కార్తీక్ తెలిపారు. ఏదో ఒక ఘటన జరిగినప్పుడు మాత్రమే స్పందించకుండా, ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.మేడ్చల్ జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాల, ఇతర విద్యాసంస్థల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. అలాగే విద్యాసంస్థల పరిసరాల్లో క్రమం తప్పకుండా పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ్, మల్కాజిగిరి మండల అధ్యక్షుడు, కార్యదర్శి అనిరుధ్, జిల్లా కమిటీ సభ్యుడు యశ్వంత్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.






కాప్రా/సెప్టెంబర్ 08(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : తెలంగాణ మాలిదశ ఉద్యమకారుడు దొమ్మాటి కిరణ్ కుమార్ రావు, నర్రా శ్రీనివాస్ రెడ్డి, కీర్తి శ్రీనివాస్, లను మంగళవారం నాడు కాప్రా ప్రెస్ క్లబ్ లో సన్మానించిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నందిని సిద్ధారెడ్డి.

## ఓయూ స్నాతకోత్సవంలో పీహెచ్ పట్టా అందుకున్న ఇక్ఫాయ్ యూనివర్సిటీ అధ్యాపకురాలు డా. మౌనికరావు.




కాప్రా/సెప్టెంబర్ 08(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో మంగళవారం జరిగిన 85వ స్నాతకోత్సవం కార్యక్రమంలో సికింద్రాబాద్ శాంతినగర్కు చెందిన డా. ముత్యాల మౌనికరావు పీహెచ్ఎ పట్టాను అందుకున్నారు. ఈ మేరకు స్నాతకోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథి భారత్ బయోటెక్ చైర్మన్ డా. కృష్ణ ఎల్ల, ఓయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం చేతుల మీదుగా ఆమెకు పీహెచ్ డీ పట్టాను ప్రధానం చేశారు. కాగా మౌనికరావు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ నుంచి ఎంఏ సైకాలజీతో పాటు 2025లో పీహెచ్ఎ పూర్తి చేశారు. ప్రస్తుతం ఇక్ఫాయ్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్గా పని చేస్తున్నారు.సాధారణ కుటుంభం నుంచి వచ్చిన తాను ప్రతిష్టాత్మకమైన ఓయూ నుంచీ పీహెచ్ఎ డిగ్రీ అవార్డును అందుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఇది జీవితంలో ఎప్పటికీ గుర్తిండిపోయే మధురమైన జ్ఞాపం అన్నారు.

## ఓయూ నుండి డాక్టరేట్ అందుకోవడం గర్వంగా ఉంది : లతా విశ్వాజెన్

***ఈ గౌరవ డాక్టరేట్ మా తల్లి తండ్రులు, భర్తకి అంకితం***




కాప్రా/సెప్టెంబర్ 08(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : ఉస్మానియా యూనివర్సిటీ 85వ కాన్వొకేషన్ సందర్భంగా పీహెచ్‌డీ పూర్తి చేసిన స్కాలర్లకు డాక్టరేట్ డిగ్రీలు అందజేశారు. ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూసిన ఈ రోజు రావడం ఎంతో ఆనందంగా ఉందని డాక్టరేట్ అందుకున్న స్కాలర్ లత విశ్వాజెన్ తెలిపారు. ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చిన తనకు ఉస్మానియా వంటి ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ గౌరవం తన ఒక్కరి విజయం కాదని, తన తల్లిదండ్రుల ఆశీస్సులు, కుటుంబ సభ్యుల సహకారం వల్లే సాధ్యమైందని చెప్పారు. ఈ డాక్టరేట్‌ను తన తల్లిదండ్రులకు, కుటుంబానికి అంకితం చేస్తున్నట్లు లత తెలిపారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకులకు, సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## మానవత్వం చాటుకున్న ఓయూ మహిళ సెక్యూరిటీ సిబ్బంది వాణి..!





కాప్రా/సెప్టెంబర్ 08(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) స్నాతకోత్సవంలో భద్రతా సిబ్బంది చూపిన మానవీయత అందరి ప్రశంసలు అందుకుంది. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగిన ఈ కార్యక్రమంలో డిగ్రీ పట్టా పుచ్చుకునేందుకు వచ్చిన ఒక దివ్యాంగ స్నాతకురాలికి ఓయూ మహిళా సెక్యూరిటీ సిబ్బంది వాణి కొండంత ఆసరాగా నిలిచారు. వైకల్యాన్ని జయించి పట్టా అందుకునేందుకు వచ్చిన ఆ విద్యార్థిని ప్రాంగణంలోకి సజావుగా చేరుకునేందుకు వీల్‌చేర్‌ను స్వయంగా ముందుకు తీసుకెళ్తూ, ఎంతో ఆప్యాయంగా సహాయం అందించి తమ బాధ్యతను, మానవత్వాన్ని చాటుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ స్నాతకోత్సవంలో పట్టా అందుకోవడానికి వచ్చిన దివ్యాంగ విద్యార్థినిని వీల్‌చేర్‌పై సభా ప్రాంగణానికి తీసుకెళ్తున్న ఓయూ మహిళా భద్రతా సిబ్బంది.

# వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ 2027లో పాల్గొనాలని యువతకు ఆహ్వానం



రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 8, ( విజన్ ఆంధ్ర ): భారతదేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే దిశగా యువత ఆలోచనలు, నూతన ఆవిష్కరణలు, సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మై భారత్ నిర్వహిస్తున్న వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ 2027లో రంగారెడ్డి జిల్లా యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని అధికారులు పిలుపునిచ్చారు. ఎంపికైన యువతకు భారత ప్రధానమంత్రి సమక్షంలో తమ ఆలోచనలను, అభిప్రాయాలను వివరించే అవకాశం లభిస్తుంది. హైదరాబాద్‌లోని పిఐబి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మై భారత్ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ అన్వేష్ చింతాల కార్యక్రమ వివరాలను వెల్లడిస్తూ యువత విస్తృతంగా పాల్గొనాలని కోరారు. యూత్ సర్వీసెస్ జాయింట్ డైరెక్టర్ వేణుగోపాల్ రావు కూడా కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. 2026 ఆగస్టు 17 నాటికి 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు కలిగిన యువత ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చు. కార్యక్రమంలో వికసిత్ భారత్ ఛాలెంజ్ కల్చరల్ ట్రాక్ మరికొన్ని మొత్తం ఆరు విభాగాలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రానికి టెక్నాలజీ, ఇన్నోవేషన్, ఫ్యూచర్, రెడీనెస్ అనే ప్రాంతీయ అంశాన్ని కేటాయించారు. వికసిత్తు భారత చాలెంజ్ లో డిజిటల్ క్విజ్, వ్యాసరచన, జిల్లా స్థాయి ప్రదర్శనలు, రాష్ట్ర స్థాయి ఎంపిక వంటి దశలు ఉంటాయి. జాతీయ స్థాయి తుది కార్యక్రమం 2027 జనవరి 10 నుంచి 12 వరకు న్యూఢిల్లీలో నిర్వహించనున్నారు. మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ స్నేహల్ బసుత్కర్ రంగారెడ్డి జిల్లాలోని విద్యాసంస్థలు, ఎన్ఎస్ఎస్ యూనిట్లు, యువజన సంఘాలు తమ పరిధిలోని అర్హులైన యువతను ప్రోత్సహించి కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని కోరారు. అర్హత కలిగిన యువత "mybharat.gov.in" (https://reference`url`citation.invalid/0) వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని క్విజ్‌లో పాల్గొనవచ్చు.

## రెండు పడక గదుల ఇండ్లలో లబ్ధిదారులే నివసించాలి

**- లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా మౌలిక వసతులు కల్పిస్తాం**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర బ్యూరో) : రెండు పడక గదుల ఇండ్లను అద్దెకివ్వడం, అమ్మడం వంటివి చేస్తే తగు చర్యలు తీసుకుంటామని, ఎంపికైన లబ్ధిదారులే అక్కడ నివసించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో కలిసి పట్టణ శివారులోని రెండు పడక గదుల ఇండ్ల సముదాయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు బ్లాక్ లలో తిరిగి కొంతమంది లబ్ధిదారులతో మాట్లాడారు. పలువురి పట్టాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. కొన్ని ఇండ్లకు తాళం వేసి ఉండడంతో సంబంధిత లబ్ధిదారుల గురించి ఆరా తీశారు. ఇక్కడ నివసించని వారికి నోటీసులు జారీ చేయాలని, వారి లిస్టును తయారు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం నిర్మించిన ఇండ్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని, అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తామన్నారు. రహదారులు, వీధి దీపాల సమస్యను పరిష్కరిస్తామని, గృహజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్ సదుపాయం లేని వారికి ప్రభుత్వం త్వరలోనే పథకాన్ని మంజూరు చేయడం జరుగుతుందన్నారు. చేనేత కార్మిక కుటుంబంతో మగ్గంపై చీరల తయారీ, మార్కెటింగ్ గురించి మాట్లాడారు. అర్హులైన వారందరూ పెన్షన్ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులు తమ వాటర్ ట్యాంకులను శుభ్రంగా ఉంచుకోవాలని, ఆయా బ్లాక్ ల పరిసరాల పరిశుభ్రతకు కమిటీ ఏర్పాటు చేసుకొని ముందుకెళ్లాలన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్లాక్ ల సమీపంలో వివిధ నిత్యావసర సరుకులు అమ్ముకునేందుకు షెడ్డును నిర్మించాలని, పరిసరాల్లో పొదలను తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇండ్లు లేని వారందరూ దరఖాస్తు చేసుకుంటే మరో విడతలో అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అక్కడ నిర్మించిన కమ్యూనిటీ హాల్ ను వినియోగించుకోవాలని స్థానికులకు సూచించారు. అనంతరం కలెక్టర్ సమీపంలో నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవనాన్ని సందర్శించారు. భవనంలోని పలు విభాగాలను పరిశీలించారు. ఈ పర్యటనలో హౌసింగ్ పిడి శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్, డీఈలు నరేందర్, లక్ష్మణ్, తహసిల్దార్ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, ఏఈఈ సతీష్, ఇతర అధికారులు, తదితరులున్నారు.

## సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్

**- రంగారెడ్డి జిల్లా నుండి 10 వేల మందిని తరలింపునకు ఏర్పాట్లు**

**- చలో హైదరాబాద్ ను విజయవంతం చేద్దాం**

**- జిల్లా చైర్మన్ కన్వీనర్లు ఊటు యశ్వంత్ డాక్టర్ రామారావు**




రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 8, ( విజన్ ఆంధ్ర ): రాష్ట్ర టీజీఈ జేఏసీ పిలుపు మేరకు సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్ ప్రోగ్రాం ను విజయవంతం చేయడానికి ఈరోజు రంగారెడ్డి జిల్లా టీజీఈజేఏసీ చైర్మన్ ఊటు యశ్వంత్ కన్వీనర్ డాక్టర్ రామారావ్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా లోని ఇబ్రహీంపట్నం డివిజన్, కందుకూరు డివిజన్, రాజేందర్ నగర్ డివిజన్ లలో అనేక కార్యాలయాలకి వెళ్లి ఉద్యోగస్తులతో సమావేశాలు ఏర్పాటు చేసి చలో హైదరాబాద్ కు సమాయత్తం చేయడం జరిగిందని ఊటు యశ్వంత్ అన్నారు. ఉద్యోగస్తులు అందరు ఈనెల 10న చలో హైదరాబాద్ కు అందరు తరలి రావడానికి సిద్ధం గా ఉన్నారని ఉద్యోగస్తులలో మంచి స్పందన కనపడుతుందని, మరియు ఈ జిల్లా నుండి 10వేల మందికి పైగా తరలించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తూ జిల్లా లోని ప్రతి డివిజన్ స్థాయిలలో ఉద్యోగస్థులు టీచర్స్, పెన్షనర్స్ తో సమావేశాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా టీజీఈజేఏసీ చైర్మన్ ఊటు యశ్వంత్, కన్వీనర్ డాక్టర్ రామారావు, టీ ఎన్ జీ ఓ సెక్రటరీ శ్రీనివాస్, టీజీఓ కార్యదర్శి శ్రీనేష్ కుమార్ నోరి, శాంతిశ్రీ, గోపాల్ నాయక్, వెంకటప్ప, నాగార్జున, నూతనకంటి వెంకట్, శ్రీనివాస్ మరియు టీచర్స్ యూనియన్ నాయకులు ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## హన్వాడ పీహెచ్‌సీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి , సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర): హన్వాడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఓపీ రిజిస్టర్, మందుల నిల్వలు, ల్యాబొరేటరీలో నిర్వహిస్తున్న పరీక్షలను పరిశీలించారు. గర్భిణులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడంతో పాటు పోషకాహారం, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి అవసరమైన మందులు అందుతున్నాయా అని ఆరా తీశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రగతి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన వారందరికీ బ్యాంకర్లు విరివిగా రుణాలు అందించాలి

**- బ్యాంకర్లుఅధికారులు సమన్వయంతో రుణాల పురోగతి సాధించాలి**

**- ఆర్ఎస్ఈటీఐ శిక్షణ పొందిన వారికి స్వయం ఉపాధికి రుణాలు అందించాలి**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జిల్లాలో అర్హులైన వారందరికీ విరివిగా రుణాలు అందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన జిల్లా డిసిసి డిఎల్ఆర్సి కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు,ఇతర రుణ లక్ష్యాలను బ్యాంకులు సమన్వయంతో పనిచేస్తూ నిర్ణీత గడువులోగా పూర్తిస్థాయిలో సాధించాలన్నారు. ప్రధానమంత్రి ధన్-ధాన్య కృషి యోజన పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేసి,వారు పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని బ్యాంకర్లను ఆదేశించారు.ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల పథకం, మత్స్యకారుల కేసీసీ(కిసాన్ క్రెడిట్ కార్డ్) రుణాల మంజూరులో పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.క్రెడిట్‌డిపాజిట్ నిష్పత్తి మార్చి 31న 228.74% ఉండగా, జూన్ 30న 227.60% గా నమోదైనందున, దీనిని మరింత పెంచేలా రుణాల మంజూరును వేగవంతం చేయాలన్నారు. ప్రాధాన్యత రంగంలో మార్చి 31న రూ.5,743.98 కోట్ల లక్ష్యానికి రూ.3,463.10 కోట్లు (60.23%) సాధించగా, జూన్ 30న రూ.6,495.02 కోట్ల లక్ష్యానికి రూ.1,050.24 కోట్లు (16.17%) మాత్రమే సాధించడం జరిగిందన్నారు. వ్యవసాయ రంగంలో మార్చి 31న రూ.4,979.08 కోట్ల లక్ష్యానికి రూ.3,652.98 కోట్లు (73.37%) సాధించగా, జూన్ 30న రూ.5,575.54 కోట్ల లక్ష్యానికి రూ.990.19 కోట్లు (17.75%) సాధించినట్లు తెలిపారు. రుణాల మంజూరును మరింత వేగవంతం చేయాలన్నారు. ఏమ్.ఎస్.యం.ఈ రంగంలో మార్చి 31న రూ.606 కోట్ల లక్ష్యానికి రూ.335.05 కోట్లు (55.29%),జూన్ 30న రూ.691.80 కోట్ల లక్ష్యానికి రూ.205.56 కోట్లు (29.71%) సాధించినందున పురోగతిని మరింత పెంచాలన్నారు.ముద్ర రుణాలు, హౌసింగ్, వ్యవసాయ రంగాలకు సంబంధించిన రుణాల మంజూరును మరింత పెంచాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సదుపాయాలను మరింత విస్తరించాలని సూచించారు. ఫైనాన్షియల్ లిటరసీ క్యాంపుల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేలా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల ద్వారా రుణాలు పొందడం వల్ల కలిగే ప్రతికూలతలు,వడ్డీ భారంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వీడియోలు, బాధితుల అనుభవాలు, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్వయం సహాయక సంఘాల బ్యాంకు లింకేజీని వేగవంతం చేసి,అర్హత ఉన్న అన్ని సంఘాలకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలన్నారు. యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో శిక్షణ పొందిన నైపుణ్యవంతులైన అభ్యర్థులకు రుణాలు మంజూరు చేసి,వారు స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించేలా ప్రోత్సహించాలని కలెక్టర్ బ్యాంకర్లను ఆదేశించారు. బ్యాంకర్లు, అధికారులు క్రమం తప్పకుండా సమన్వయ సమావేశాలు నిర్వహించి,పథకాల అమలు, రుణాల మంజూరుపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం వార్షిక రుణ ప్రణాళిక 202627 పుస్తకాలను కలెక్టర్ బ్యాంకర్లతో కలిసి ఆవిష్కరించారు. గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎల్డిఎం శ్రీనివాసరావు, ఇండియన్ నాబార్డ్ డీడీఎం మోహన్ రెడ్డి,ఆర్బీఐ ప్రతినిధి శ్రీనివాసులు వెన్న,ఎస్బీఐ రీజినల్ మేనేజర్ శ్రీ చరణ్, యూనియన్ బ్యాంక్ డిప్యూటీ ఆర్.యం హరి కృష్ణ, ఇండియన్ బ్యాంక్ డిజియం శ్రీనివాసులు, డైరెక్టర్ శ్రీనివాస్ నాయక్, డిఆర్డీఓ ముషాయిదా బేగం,పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ రామ లింగేశ్వర్ గౌడ్,ఉద్యానవాన శాఖ అధికారి రాజ్ కుమార్,మత్స్య శాఖ అధికారి షకీల భాను,వివిధ శాఖల జిల్లా అధికారులు,ఆయా బ్యాంకుల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులపై పోలీసుల నిఘా

**- రాజకీయ, మత, కమ్యూనల్ పోస్టులు చేస్తే చర్యలు తప్పవు**

**- ఫేక్ సమాచారం, విద్వేష ప్రచారంపై ప్రత్యేక నిఘా**

**- పోస్టులు చేసే వారితో పాటు ఉద్దేశపూర్వకంగా షేర్ చేసే హ్యాండ్లర్లపైనా చర్యలు**

**- బాధ్యతాయుతంగా సోషల్ మీడియాను వినియోగించాలి: ఎస్పీ రోహిత్ రాజు**



కొత్తగూడెం బ్యూరో, సెప్టెంబర్ 09(విజన్ ఆంధ్ర) : సోషల్ మీడియా వేదికగా ప్రజలను రెచ్చగొట్టేలా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా పోస్టులు, వీడియోలు, సందేశాలను ప్రచారం చేసే వారిపై నిరంతర నిఘా కొనసాగుతుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో పోలీసుశాఖ సోషల్ మీడియా హ్యాండ్లర్ల పనితీరును ఎస్పీ సమీక్షించారు. జిల్లాలో సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న కార్యకలాపాలు, ప్రజలను ప్రభావితం చేసే హ్యాండ్లర్లు, వారు ప్రచారం చేస్తున్న పోస్టులు, వీడియోలు, సందేశాలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**రెచ్చగొట్టే పోస్టులపై కన్ను**

రాజకీయ, మత, కమ్యూనల్ అంశాలను ఆధారంగా చేసుకుని ప్రజలను రెచ్చగొట్టే విధంగా పోస్టులు, వీడియోలు, సందేశాలను ప్రచారం చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచుతామని ఎస్పీ తెలిపారు. ప్రజల్లో విద్వేషాలను రెచ్చగొట్టే లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కంటెంట్‌ను గుర్తించి, వాటిని తొలగించే చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

***షేర్ చేసినా చర్యలు తప్పవు!***

విద్వేషపూరిత లేదా రెచ్చగొట్టే కంటెంట్‌ను రూపొందించి పోస్టు చేసే వారితో పాటు, వాటిని ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేసే హ్యాండ్లర్లపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఏదైనా సమాచారం కనిపించిందని నిర్ధారణ లేకుండా ప్రచారం చేయడం, రెచ్చగొట్టే పోస్టులను షేర్ చేయడం, ఫార్వర్డ్ చేయడం వంటి చర్యలకు ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు.సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, ప్రజల మధ్య శాంతి, సామరస్యాన్ని దెబ్బతీసే సమాచారాన్ని ప్రచారం చేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్పీ కోరారు. ఈ సమీక్ష సమావేశంలో ఎస్బీ ఇన్‌స్పెక్టర్ ఇ. శ్రీనివాస్, ఎస్సై చంద్రశేఖర్, పోలీసుశాఖ సోషల్ మీడియా హ్యాండ్లర్లు పాల్గొన్నారు.

## ఐసీఐసీఐ లైఫ్ పార్ట్‌నర్ స్టాక్ 2.0 ఆవిష్కరణ

హైదరాబాద్, సెప్టెంబర్ 08 (విజన్ ఆంధ్ర) : అడ్వైజర్లు, డిస్ట్రిబ్యూషన్ భాగస్వాముల డిజిటల్ సామర్థ్యాలను పెంపొందించేలా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ 'ఐసీఐసీఐ లైఫ్ పార్ట్‌నర్ స్టాక్ 2.0'ను ఆవిష్కరించినట్లు ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ అమీష్ బ్యాంకర్ మంగళవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏఐ ఆధారిత ఈ కోట్, లివ టూల్స్‌తో ప్రొడక్ట్ సిఫార్సులు, వ్యక్తిగతీకరించిన కొటేషన్లు అందించడంతో పాటు భాగస్వామి వ్యవస్థలతో అనుసంధానతను మెరుగు పరిచిందని తెలిపారు. యూఐడిఎఐ, సికెవైసి, వాహన్, జిఎస్టిఎన్, ఇపిఎఫ్ఓ, సిఎఎస్, పెర్ఫియోస్ వంటి డేటాబేస్‌ల అనుసంధానంతో అప్లికేషన్‌లో 70 శాతం వరకు ప్రీ-ఫిల్ చేసుకునే అవకాశం కల్పించినట్లు చెప్పారు. 200కు పైగా పార్ట్‌నర్-సిస్టమ్ ఇంటిగ్రేషన్స్, 99 శాతం డిజిటల్ బిజినెస్ అప్లికేషన్లతో కంపెనీ డిజిటల్ సామర్థ్యాలను విస్తరించిందని పేర్కొన్నారు. భాగస్వాముల రోజువారీ కార్యకలాపాలను సరళతరం చేసి కస్టమర్ సేవలను మరింత వేగవంతం చేయడమే లక్ష్యమని అన్నారు. 2027 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో కంపెనీ 99.3 శాతం క్లెయిమ్ సెటిల్మెంట్ రేషియోను సాధించిందని తెలిపారు.

# పారదర్శకంగా భూముల రీ సర్వే చేపట్టాలి

**- బెక్కెరలో సర్వే ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్,**

**- వివరాల నమోదులో ఎలాంటి తప్పులకు తావివ్వొద్దు,**

**- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్,**



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): సెప్టెంబర్ 08 భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, భూ వివరాల నమోదులో ఎలాంటి తప్పులు లేకుండా చర్యలు తీసుకోవాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు. భూ భారతి కార్యక్రమంలో భాగంగా కల్వకుర్తి మండలం బెక్కెర గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ మంగళవారం క్షేత్రస్థాయిలోపరిశీలించారు. గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్.. సర్వే నిర్వహిస్తున్న తీరును పరిశీలించి, అధికారులు, సర్వేయర్లను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ పరిధిలోని రెవెన్యూ భూములు, ప్రభుత్వ భూములకు సంబంధించిన రీ సర్వే వివరాలపై అధికారులతో చర్చించారు. సర్వే ప్రక్రియకు సంబంధించి గ్రామంలోని రైతులకు ముందస్తుగా సమాచారం అందించారా? లేదా? అనే అంశంపై కూడా ఆరా తీశారు. రైతులకు పూర్తి సమాచారం అందిస్తూ, వారి సమక్షంలో భూముల హద్దులు, వివరాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. భూముల రీ సర్వే అత్యంత కీలకమైన ప్రక్రియ అని, భవిష్యత్తులో భూ సంబంధిత సమస్యలు తలెత్తకుండా నిబంధనలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకతతో సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి భూమికి సంబంధించిన హద్దులు, విస్తీర్ణం, ఇతర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. డేటా నమోదులో ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా అధికారులు, సర్వేయర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా రైతులకు సంబంధించిన భూ వివరాల విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. నిర్ణీత నిబంధనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ రీ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.భూముల రీ సర్వేలోఖచ్చితత్వం,పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, రైతుల భూ హక్కులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.జిల్లా కలెక్టర్ వెంట కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి, ఏడి సర్వేయర్ గిరిధర్, కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం, ఆర్ఐ కార్తీక్ రెడ్డి, సర్వేయర్లు, సంబంధిత రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మోడ్రన్ స్కూల్‌లో పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్.




మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 8(విజన్ ఆంధ్ర )స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మంగళవారం మహబూబ్‌నగర్‌లోని మోడ్రన్ స్కూల్‌లో నిర్వహించిన పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ తొలగించిన చెత్తను స్వయంగా ఎత్తి పరిశుద్య పనుల్లో చురుగ్గా పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తొలగించడంతో పాటు పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు, పొదలను తొలగించారు. పరిశుభ్రతను పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని మధుసూదన్ నాయక్ అన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పరిశుభ్రత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచాలని ఆయన సూచించారు. స్వయంగా పారిశుద్ధ్య పనుల్లో పాల్గొని ఇతరులకు ఆదర్శంగా నిలిచారు.

## డిండి ఎత్తిపోతల భూసేకరణను వేగవంతం చేయాలి

**- మార్కింగ్, ఆర్అండ్ఆర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి,**

**- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్,**




నాగర్‌కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర) సెప్టెంబర్ 08 జిల్లా లో డిండి ఎత్తిపోతల పథకానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతం చేసి, అవసరమైన భూములకు పెగ్ మార్కింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ చెన్నయ్యతో కలిసి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పెగ్ మార్కింగ్, పరిహారం, ఆర్అండ్ఆర్ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిండి ఎత్తిపోతల పథకానికి అవసరమైన భూముల వివరాలు, ఇప్పటివరకు చేపట్టిన భూసేకరణ, పెగ్ మార్కింగ్ పురోగతి, ఆర్అండ్ఆర్ ప్రక్రియ తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూసేకరణకు సంబంధించిన ప్రతి అంశాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, పెండింగ్ సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రాజెక్టుకు అవసరమైన భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి హద్దులను స్పష్టంగా నిర్ధారించి పెగ్ మార్కింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో ఏవైనా సమస్యలు లేదా అభ్యంతరాలు ఉంటే వాటిని వెంటనే గుర్తించి, సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. అదేవిధంగా భూసేకరణకు సంబంధించి పరిహారం చెల్లింపు, పునరావాసం మరియు పునరావాస పునరుద్ధరణ (ఆర్అండ్ఆర్) చర్యలను నిబంధనల ప్రకారం వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అర్హులైన భూ నిర్వాసితులకు నిబంధనల మేరకు ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డిండి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన భూసేకరణలో వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, పెండింగ్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత సమయంలోగా ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు. సమీక్షలో ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు, రెవెన్యూ, సాగునీటి శాఖలకు చెందిన సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బారిష్టర్ డా.మరియం కామిల్‌కు ఘన సన్మానం



హైదరాబాద్, సెప్టెంబర్ 08 (విజన్ ఆంధ్ర) : లండన్ కోర్టులో మీడియా చట్టానికి సంబంధించిన కేసుల్లో బారిష్టర్‌గా పనిచేస్తున్న డా.మరియం కామిల్‌ను తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డా.రాజ్ నారాయణ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్, నల్సార్ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ న్యాయ విద్యార్థులు నిరుపేదలకు చట్టాలపై అవగాహన కల్పించి, మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎల్ఎల్బీ, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో బీసీఎల్, ఎంఫిల్, పీహెచ్‌డీ చేసిన డాక్టర్ కామిల్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి జ్యుడిషియల్ అసిస్టెంట్‌గా సేవలందించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి డా.అక్తర్ అలీ, ప్రొ.ధరం పాల్, న్యాయవాదులు డా.యాసర్, వశీయుద్దీన్, డా.సాజిద్ అలీ ఖాన్, కోఆర్డినేటర్ జి.వేణుగోపాల్ పాల్గొన్నారు. విద్యార్థులు డా.కామిల్‌తో లండన్ న్యాయ వ్యవస్థపై ప్రశ్నోత్తరాలు నిర్వహించారు.

## వి డి సి పేరుతో అధికారులను తప్పుదోవ పట్టించారా?

**- గ్రామసభ లేకుండానే నకిలీ తీర్మానాలా?..**

**- బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి**



కాటారం డివిజన్ ప్రతినిధి, సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర): మేడిపల్లి గ్రామపంచాయతీలో గ్రామసభ నిర్వహించకుండానే వి డి సి కమిటీ ఏర్పాటు చేసినట్లు చూపిస్తూ తప్పుడు తీర్మానాలు, అనుమానాస్పద సంతకాలతో పత్రాలు సృష్టించి ఐ టి డి ఏ , పంచాయతీరాజ్ అధికారులను తప్పుదోవ పట్టించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారంపై ఆదివాసీ నాయకపోడ్ సేవ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు గొల్లెం భూమయ్య ఐ టి డి ఏ ఏటూర్నాగారం ప్రాజెక్ట్ అధికారికి ఫిర్యాదు చేశారు. వి డి సి ఏర్పాటుకు సంబంధించిన పత్రాలపై సమగ్ర విచారణ చేపట్టడంతో పాటు, అనుమానాస్పదంగా ఉన్న సంతకాలపై ఫోరెన్సిక్ పరీక్ష నిర్వహించాలని ఆయన కోరారు. ఫోర్జరీ, తప్పుడు పత్రాల సృష్టి, అధికారులను తప్పుదోవ పట్టించడం, ప్రజాధన దుర్వినియోగం జరిగినట్లు విచారణలో తేలితే బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గిరిజనుల హక్కులు భంగం కలిగినట్లు నిర్ధారణ అయితే ఎస్ సి, ఎస్ టి చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని, సర్పంచ్ అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు తేలితే చట్టప్రకారం పదవి నుంచి తొలగించే చర్యలు చేపట్టాలని పి ఓ ను కోరారు. ఈ సందర్భంగా భూమయ్య వెంట మాజీ సర్పంచ్ చింతల సుధాకర్, గ్రామస్థుడు అప్పల భూమేష్ యాదవ్ ఉన్నారు.

## గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

**- భక్తుల భద్రత, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం..**

**- అధికారులకు కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆదేశం**




మల్కాజ్‌గిరి జిల్లా,సెప్టెంబరు 8(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా,సురక్షితంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. నిమజ్జన ఏర్పాట్ల పురోగతితో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపిన సమస్యలు,అవసరాలపై చర్చించారు.నిమజ్జన ప్రాంతాల్లో క్రేన్లు, అంబులెన్సులు, ఫైర్ ఇంజిన్లు, సిబ్బందిని ముందుగానే అందుబాటులో ఉంచాలని సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్, క్రౌడ్ మేనేజ్‌మెంట్, భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చెరువులు, నిమజ్జన పాండ్ల వద్ద క్లీనింగ్, డీసిల్టింగ్, పారిశుద్ధ్య పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అప్రోచ్ రోడ్లు, లైటింగ్, మౌలిక వసతులను సిద్ధం చేయాలని సూచించారు.పూజా సామగ్రిలోని పూలు, ఇతర సేంద్రియ వ్యర్థాలను ప్రత్యేకంగా సేకరించి సహజ ఎరువుగా వినియోగించాలని తెలిపారు. నిమజ్జనం అనంతరం వ్యర్థాలను వెంటనే తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. చివరి నిమిషం వరకు పనులు పెండింగ్‌లో ఉంచకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ (పారిశుద్ధ్యం) సి.ఎన్. రఘు ప్రసాద్, చీఫ్ ఇంజినీర్ బి.ఎల్. శ్రీనివాస్, సంబంధిత అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## బైక్ టాక్సీలకు అనుమతివ్వాలన్న గడ్కరీ పిలుపును స్వాగతిస్తున్నాం

**- బైక్ టాక్సీ అసోసియేషన్(బిటిఎ) అధ్యక్షుడు అమిత్ గావ్డే**

హైదరాబాద్, సెప్టెంబర్ 08 (విజన్ ఆంధ్ర): దేశవ్యాప్తంగా ప్రైవేట్ ద్విచక్ర వాహనాలను బైక్ టాక్సీలుగా నడిపేందుకు అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చేసిన పిలుపును స్వాగతిస్తున్నట్లు బైక్ టాక్సీ అసోసియేషన్(బిటిఎ) అధ్యక్షుడు అమిత్ గావ్డే మంగళవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ బైక్ టాక్సీలకు దేశ వ్యాప్తంగా ఏకరీతి, జీవనోపాధికి అనుకూలమైన విధానం అవసరమని అన్నారు. ద్విచక్ర వాహనాల ద్వారా సుమారు 8 కోట్ల మందికి ఉపాధి లభించే అవకాశం ఉందని, రాష్ట్రాలు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. సురక్షిత, క్రమబద్ధమైన బైక్ టాక్సీ సేవల కోసం రాష్ట్ర రవాణా శాఖలతో కలిసి పనిచేస్తామని తెలిపారు.

## భద్రాద్రి జిల్లా టూరిజం నోడల్ అధికారిణిగా అనూష

**- ఉత్తర్వులు విడుదల చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్**



కొత్తగూడెశీ బ్యూరో సెప్టెంబర్ 09(విజన్ ఆంధ్ర) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టూరిజం నోడల్ అధికారిణిగా జిల్లా పంచాయతీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న గ్రూప్ – 1 అధికారిణి అనూషకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చీఫ్ సెక్రటరీ నిర్వహించిన సమావేశంలో పర్యాటక రంగం అభివృద్ధి చేయాలనే సంకల్పంతో భద్రాద్రి జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధి కోసం అనుష ను నియమించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పర్యాటక ప్రాంతాలను గుర్తించి, ప్రణాళికలు రూపొందించి, వాటి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందిస్తూ పర్యాటక అభివృద్ధికి నోడల్ అధికారి పనిచేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.ప్రస్తుతం పర్యాటక అధికారిగా ఉన్న పరాధామ రెడ్డి జిల్లా యువజన, క్రీడల.అధికారిగా కొనసాగనున్నారు.

## నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశం, సెప్టెంబర్ 9న ఉద్యోగ మేళా



నాగర్‌కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర) సెప్టెంబర్ 08 జిల్లా లోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు GMR వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో, LAVISG GRAND TRADERS PVT. LTD. వారి సహకారంతో ఉద్యోగమేళానిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి బి. రాఘవేందర్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 09, 2026న ఉదయం 10:30 గంటలకు నాగర్ కర్నూల్ పట్టణంలోని నేషనల్ ఐటీఐ కళాశాల, మెయిన్ రోడ్, ఆర్టీసీ బస్ స్టాండ్ సమీపంలో ఈ ఉద్యోగమేళానిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.ఈ ఉద్యోగ మేళా ద్వారా 100 ఉద్యోగ ఖాళీలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. టెూజ, ఇంటర్మీడియట్, డిగ్రీ లేదా అంతకంటే పై విద్యార్హతలు కలిగి, 25 నుంచి 32 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువత ఈ ఉద్యోగ మేళాకు హాజరు కావచ్చని తెలిపారు.ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15,000 జీతంతో పాటు ప్రోత్సాహకాలు అందించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాలతో నిర్ణీత సమయానికి ఉద్యోగ మేళాకు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాల కోసం 9666974704, 8499065663 నంబర్లను సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి బి. రాఘవేందర్ సింగ్ కోరారు.

# అనుమతుల్లేకుండా విచ్చలవిడిగా షెడ్ల నిర్మాణాలు..

**- గాయిత్రి హిల్స్ షెడ్ ను పరిశీలించిన బోడుప్పల్ సెటిలర్స్ ఫోరం ప్రతినిధులు**

**- అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరిక**




బోడుప్పల్,సెప్టెంబర్ 08(విజన్ ఆంధ్ర) : బోడుప్పల్ సర్కిల్ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న షెడ్లు, ఇతర నిర్మాణాలపై బోడుప్పల్ సెటిలర్స్ ఫోరం ఆగ్రహం వ్యక్తం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు విచ్చలవిడిగా సాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ ఫోరం చైర్మన్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం గాయిత్రిహిల్స్ లోని అనుమతి లేని షెడ్ ను ఫోరం ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఫోరం ప్రతినిధులు మాట్లాడుతూ.. బోడుప్పల్‌లో నిర్మాణాలకు అనుమతులు తీసుకోవాల్సిన నిబంధనలు ఉన్నప్పటికీ కొందరు వాటిని పట్టించుకోకుండా షెడ్లు, ఇతర నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. నిర్మాణ దశలోనే గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని మండిపడ్డారు. అక్రమ నిర్మాణాలపై స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోకపోవడం అధికారుల పనితీరుపై అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు.

***ప్రభుత్వ ఆదాయానికి గండి***

అనుమతులు లేకుండా నిర్మాణాలు సాగితే ప్రభుత్వానికి రావాల్సిన వివిధ రకాల రుసుములు, పన్నుల ఆదాయానికి గండిపడే అవకాశం ఉందని ఫోరం ప్రతినిధులు పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం అనుమతులు పొందిన వారిపై కఠినంగా వ్యవహరిస్తూ, అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్న వారిని పట్టించుకోకపోవడం సరికాదన్నారు. అక్రమ నిర్మాణాలకు ఎవరు సహకరిస్తున్నారనే విషయంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరారు. బోడుప్పల్ పరిధిలో అనుమతిలేని షెడ్లు, నిర్మాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే వాటిని తొలగించాలని కోరారు. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చినప్పుడు తక్షణమే స్పందించేలా టౌన్‌ప్లానింగ్ విభాగం ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.

***చర్యలు లేకుంటే ఆందోళన ఉద్ధృతం***

అనుమతిలేని షెడ్లపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోకపోతే ఆందోళనను మరింత ఉద్ధృతం చేస్తామని సెటిలర్స్ ఫోరం ప్రతినిధులు హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజల్లో ప్రభుత్వ యంత్రాంగంపై నమ్మకం సన్నగిల్లుతుందని అన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి బోడుప్పల్‌లోని అనుమతిలేని నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సెటిలర్స్ ఫోరం అధ్యక్షుడు కత్తి వెంకట్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి అమరలింగారెడ్డి,కోశాధికారి బజ్జూరి శ్రీనివాస్ గుప్తా,సలహదారులు వెమకటస్వామి తదితరులు పాల్గోన్నారు.

## ప్రజలను మోసం చేసిన రేవంత్ రెడ్డి సీఎం పదవికి రాజీనామా చేయాలి

**- వెయ్యి రోజులు పూర్తి కావస్తున్నా అమలు కాని వంద రోజుల హామీలు**

**- పాలన, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం పూర్తిగా విఫలం**

**- బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు విజయ్ సాగర్**



నారాయణపేట సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర) : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని,ప్రజలకు ఇచ్చిన వంద రోజుల హామీలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, నేటికి వెయ్యి రోజులు పూర్తి కావస్తున్నా అనేక హామీలను నేటికీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని నారాయణపేట పట్టణ బి.ఆర్.ఎస్ అధ్యక్షులు విజయసాగర్ అన్నారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై ప్రజలు ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం, ప్రశ్నించే గొంతులను అణచివేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో పాలన ఒకవైపు, శాంతిభద్రతల పరిరక్షణ మరోవైపు తీవ్రంగా దెబ్బతిన్నాయని అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమవుతున్నదని ముఖ్యంగా ప్రజలు, రైతులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీగా ప్రజల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నించడం బిఆర్ఎస్ పార్టీ బాధ్యత అని, కానీ ప్రజా సమస్యలను లేవనెత్తుతున్న ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై పోలీసు కేసులు, అరెస్టులు, నిర్బంధాలతో ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ప్రజల సమస్యలను ప్రశ్నించే హక్కు కూడా నేడు లేకుండా పోయిందన్నారు. ప్రశ్నిస్తే కేసులు నమోదు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాటిగా మారిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నైతిక బాధ్యత వహించి సీఎం పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మూడేళ్లు అవుతున్నా నారాయణపేట లో ఒక్క అభివృద్ధి పని జరిగింది లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం ప్రజల తరఫున పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వేపూరి రాములు చెన్నారెడ్డి ప్రతాపరెడ్డి కన్నా జగదీష్ శరణపల్లి రాములు రాంరెడ్డి గురులింగప్ప చిన్నయ్య గుండోళ్ళ మొగులప్ప హనుమంతు మైనార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

**రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి పరిశీలన**




రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 8, ( విజన్ ఆంధ్ర ): రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మంగళవారం రాజేంద్రనగర్‌లోని ఈవీఎం గోడౌన్‌ను సందర్శించి త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్‌లో భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్లు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఇతర ఎన్నికల సామగ్రి మరియు వాటిని భద్రపరిచిన గదులను కలెక్టర్ పరిశీలించి చూశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని భద్రంగా భద్రపరుస్తున్న విధానాన్ని, ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు తదితర ఎన్నికల సామగ్రికి సంబంధించిన వివరాలను కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గోడౌన్‌లో భద్రపరిచిన యంత్రాల సంఖ్య, వాటి భద్రత, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఈవీఎంలు మరియు ఎన్నికల సామగ్రి విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గోడౌన్ భద్రత, సీసీటీవీ పర్యవేక్షణ, సీల్ విధానం, రిజిస్టర్ల నిర్వహణ వంటి అంశాలను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.త్రైమాసిక తనిఖీలో భాగంగా జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్ సీల్‌ను తెరిచి, భద్రపరిచిన ఈవీఎంలు మరియు ఇతర ఎన్నికల సామగ్రిని పరిశీలించారు. తనిఖీ ప్రక్రియ పూర్తయిన అనంతరం ఎన్నికల నిబంధనల ప్రకారం గోడౌన్‌కు తిరిగి సీల్ వేయించారు. మొత్తం ప్రక్రియ పారదర్శకంగా, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించబడింది. అనంతరం రాజేంద్రనగర్ తహసిల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఎస్ ఐ ఆర్ హియరింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. హియరింగ్‌కు హాజరవుతున్న ప్రజలతో మాట్లాడి, వారి దరఖాస్తులు మరియు సమర్పిస్తున్న పత్రాల వివరాలను తెలుసుకున్నారు. హియరింగ్ సమయంలో ప్రజలు అవసరమైన పత్రాలను సక్రమంగా సమర్పించేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.హియరింగ్ ప్రక్రియను ఎన్నికల నిబంధనలు,మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. హియరింగ్‌కు వచ్చే ప్రతి దరఖాస్తుదారునికి ప్రక్రియపై స్పష్టమైన సమాచారం అందించి, వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్డీఓ శ్రీధర్, తహశీల్దార్, వేర్‌హౌస్ ఇన్‌చార్జ్ రాములు, ఎన్నికల విభాగం అధికారి రవీంద్ర గుప్తా, సంబంధిత అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు ఐ ఎన్ సి నుంచి ఎన్. ధనుంజయ, బిజేపి నుంచి వై. శ్రీధర్, బిఆర్ఎస్ నుంచి వీర్లపల్లి నవీన్ కుమార్, సిపిఐ నుంచి జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్-అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి

**- రాజీ మార్గమే.. రాజ మార్గం..!**

**జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు**



గద్వాల సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర బ్యూరో) : రాజీ పడడానికి అవకాశం ఉన్న అన్ని కేసుల్లో కక్షిదారులు రాజీపడవచ్చు క్షణికావేశంలో జరిగిన తప్పులను సరిదిద్దుకోవడానికి రాజీమార్గమే, రాజమార్గం, కావున సెప్టెంబర్ 12న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, (ఐపిఎస్) తెలిపారు. సెప్టెంబర్ 12న జరగనున్న జాతీయ లోక్– అదాలత్ ను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పులను సరిదిద్దుకోవాడానికి లోక్–అదాలత్ అనేది ఒక మంచి అవకాశం అని, అనవసర గొడవలకు పోయి జీవితాలను ఇబ్బందులపాలు చేసుకోకూడదని, జిల్లా వ్యాప్తంగా నమోదైన, చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న, రాజీ కుదుర్చుకోవడానికి అవకాశం ఉన్న అన్ని కేసులలో కక్షిదారులు రాజీ పడుటకు జాతీయ లోక్ – అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. క్రిమినల్ కంపౌండబుల్ కేసులు,సివిల్ తగాదా కేసులు,ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన కేసులు,వైవాహిక జీవితం సంబంధిత కేసులు,బ్యాంకు రికవరీ,విద్యుత్ చౌర్యం,చెక్ బౌన్స్ కేసులు పై కేసుల్లో ఇరువర్గాల మధ్య రాజీకి అవకాశం ఉంటుంది అన్నారు. కానిస్టేబుల్ నుండి అధికారుల వరకు ప్రతి ఒక్కరు భాధ్యతగా వ్యవహరించి, రాజీ పడదగిన కేసులలో ఇరువర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించి, వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ పడేలా చూడాలన్నారు. జాతీయ లోక్–అదాలత్ ద్వారా సత్వర పరిష్కారం జరుగుతుందని అవగాహన కల్పించాలని తెలిపారు.

**గణేష్ నిమజ్జన ప్రాంతాల్లో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్**



గద్వాల సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర బ్యూరో) : గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా పకడ్బందీగా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్ అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నదీ అగ్రహారం, బీచుపల్లి వద్ద గల గణేష్ నిమజ్జన ప్రాంతాలను అదనపు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నర్సింగ రావు తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణేశ్ నిమజ్జన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు,ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, లైటింగ్, రహదారులు, బారికేడింగ్, పార్కింగ్, భద్రతా చర్యలు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు.నదీ తీర ప్రాంతాల్లో భక్తుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలు జరగకుండా అవసరమైన రక్షణ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల రాకపోకలు, పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా మున్సిపల్ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు,పోలీస్, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రతి ఏర్పాటును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి, నిమజ్జనానికి ముందే అన్ని పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


# గణేష్ ఉత్సవాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**- డీజేలకు అనుమతి లేదు.. రాత్రి 10 తర్వాత లౌడ్‌స్పీకర్లు బంద్**

**- మండపాల వివరాలు ఆన్‌లైన్‌లో తప్పనిసరి నమోదు**

**- నిమజ్జన శోభాయాత్రలో టపాసులు, డీజేలు నిషేధం**

**- సమస్యాత్మక వ్యక్తులపై పోలీసుల నిఘా: ఎస్పీ రోహిత్ రాజు**




కొత్తగూడెం బ్యూరో , సెప్టెంబర్ 09(విజన్ ఆంధ్ర) గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ సూచించారు. ఉత్సవాల సందర్భంగా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా మండపాల నిర్వాహకులు, ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.గణేష్ మండపాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు ముందుగానే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు పోలీసుశాఖ రూపొందించిన ఆన్‌లైన్ పోర్టల్ https://police-portal.tspolice.gov.in/indeI.htm మండపానికి సంబంధించిన వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని ఎస్పీ తెలిపారు. ఆన్‌లైన్ నమోదు అనంతరం దరఖాస్తు వివరాలను సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో అందజేయాలని సూచించారు.

***రహదారులకు ఆటంకం కలిగించొద్దు***

మండపాలను ప్రధాన రహదారులు, ప్రజా రవాణా మార్గాలు, అత్యవసర వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగించే విధంగా ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు. విద్యుత్ శాఖ అనుమతులతోనే విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, 24 గంటలు వాలంటీర్లు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. అగ్ని ప్రమాదాల నివారణకు తగిన భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు మండపాలకు జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు.

***డీజేలకు నో!***

గణేష్ ఉత్సవాల్లో డీజేలకు ఎలాంటి అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. పోలీసుల అనుమతితో నిబంధనలకు లోబడి పరిమిత శబ్దంతో స్పీకర్లను మాత్రమే వినియోగించాలని తెలిపారు. రాత్రి 10 గంటల తర్వాత లౌడ్‌స్పీకర్ల వినియోగం పూర్తిగా నిలిపివేయాలని ఆదేశించారు. చిన్నారులు, వృద్ధులు, ఇతర ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా అధిక శబ్దాలు వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

***నిమజ్జన శోభాయాత్రలో నిబంధనలు తప్పనిసరి***

నిమజ్జన సమయంలో పోలీసుల సూచనలు, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ కోరారు. నిర్ణీత సమయాల్లోనే శోభాయాత్ర నిర్వహిస్తూ ప్రజలు, ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. శోభాయాత్రలో టపాసులు పేల్చడం, డీజేలు ఏర్పాటు చేయడం నిషేధమని స్పష్టం చేశారు.శోభాయాత్రలో పాల్గొనే వారు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, రహదారులపై వాహనాలను నిలిపి ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించరాదని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో పోలీసుల సూచనలను పాటిస్తూ సహకరించాలని కోరారు.

***సమస్యాత్మక వ్యక్తులపై నిఘా***

గణేష్ ఉత్సవాల నేపథ్యంలో రౌడీషీటర్లు, సస్పెక్ట్‌లు, సమస్యాత్మక వ్యక్తులపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతారని ఎస్పీ తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తూ పోలీసుశాఖకు ప్రజలు, గణేష్ మండపాల నిర్వాహకులు సంపూర్ణ సహకారం అందించాలని ఎస్పీ రోహిత్ రాజు విజ్ఞప్తి చేశారు.

# డా.బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించిన గండ్ర జ్యోతి

- 1000 రోజుల పాలనలో 6 గ్యారెంటీలు, 420 హామీలు, 3 డిక్లరేషన్లు ఏమయ్యాయి..?
- ప్రజా వేదిక అసెంబ్లీ సాక్షిగా అడ్డుకోవడం దుర్మార్గం..
- హామీలు అడిగితే పోలీసులతో దాడులా..
- మహిళా ప్రజాప్రతినిధుల పట్ల ప్రభుత్వ తీరు దారుణం.
- మహిళా ఎమ్మెల్యేల పట్ల జరిగిన ఘటనలకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్..
- ప్రజాతీర్పును అవమానిస్తే.. ఆ ప్రజలే బుద్ధి చెప్పుతారు గండ్ర జ్యోతి



భూపాలపల్లి టౌన్:8 సెప్టెంబర్ ( విజన్ ఆంధ్ర) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలు,డిక్లరేషన్లలో ఇప్పటి వరకు ఏదీ అమలు కాలేదని,హామీల అమలుపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి సెప్టెంబర్ 2 నుంచి బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఈ చాతగాని ప్రభుత్వం స్పందించకపోవడంతో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించిన వరంగల్ జిల్లా జడ్పీ మాజీ ఛైర్పర్సన్ , భూపాలపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు. అనంతరం అంబేద్కర్ సెంటర్ నుండి జయశంకర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా ప్రజా సమస్యలను లేవనెత్తేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను అడ్డుకున్న తీరు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ముఖ్యంగా మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు హేయమైనచర్య, మహిళా ప్రజాప్రతినిధులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వమే వారిపై పోలీసులతో దాడులు చేయించడం ఏమిటని ప్రశ్నించారు. 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని, ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరుగుతోందని అన్నారు. ఈ వ్యతిరేకతను చూసి ప్రభుత్వం ఫ్రస్ట్రేషన్‌కు గురవుతోందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులను కాంగ్రెస్‌లోకి రావాలని ఒత్తిడి చేయడం, రాకపోతే



కక్షపూరితంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రజా ప్రతినిధులను గౌరవిస్తూ, అభివృద్ధి కోసం కలిసి పనిచేయాల్సిన ప్రభుత్వం రాజకీయ కక్షలకు పాల్పడటం సరికాదన్నారు. కక్షపూరిత రాజకీయాలు చేసిన వారు ఎక్కువకాలం నిలిచిన చరిత్ర లేదు ప్రజా నాయకులు ప్రజల కోసం పనిచేయాలి అందరినీ ప్రేమ, ఆప్యాయత, గౌరవంతో చూడాలి అని అన్నారు. మహిళా ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి గార్లపై తదితర ప్రజా ప్రతినిధుల పట్ల వ్యవహరించిన తీరుపై ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రజల సమస్యల కోసం ప్రశ్నించిన ప్రజా ప్రతినిధులపై జరిగిన ఘటనలకు ప్రభుత్వం బాధ్యత వహించాలి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి క్షమాపణ చెప్పాలి, లేకపోతే ప్రజాస్వామ్య పద్ధతిలో మా నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తాం అని హెచ్చరించారు. పోలీసులు రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా చట్టం, న్యాయం వైపు నిలబడాలని కోరారు. ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు మారుతుంటాయని, కానీ పోలీసులు తమ ఉద్యోగ బాధ్యతలను కొనసాగించాల్సి ఉంటుందని గుర్తుచేశారు. రాజకీయ పార్టీలు మారుతాయి, ప్రభుత్వాలు మారుతాయి కానీ పోలీసులు తమ ఉద్యోగాల్లోనే ఉంటారు. కాబట్టి న్యాయం ఎటువైపు ఉంటే అటువైపు నిలబడి విధులు నిర్వర్తించాలి, అతి ఉత్సాహంతో వ్యవహరించడం మంచిది కాదు అని అన్నారు. అధికారం ప్రజలకు సేవ చేయడానికి ఇచ్చిందే తప్ప ప్రతిపక్షాల గొంతు నొక్కడానికి కాదని మండిపడ్డారు. ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే ప్రభుత్వం సమాధానం చెప్పాలని, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలకు కూడా సమాన గౌరవం ఇవ్వాలని సూచించారు. మేము చెప్పిందే వేదం, మేము చెప్పిందే జరగాలి అనే ధోరణి ప్రజాస్వామ్యం లో చెల్లదు, అధికారం శాశ్వతం కాదు, రాబోయే రోజుల్లో ప్రజలే తగిన తీర్పు ఇస్తారు అని అన్నారు.

## కలెక్టర్ కార్యాలయంలోని ఎస్టీఓ సిబ్బంది ఎక్కడ?

- సమయం ఉదయం 10:40 గంటలు.. ఖాళీగా కనిపించిన కుర్చీలు!
- కార్యాలయానికి వచ్చి అల్లాడుతున్న ప్రజలు
- అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు



సిద్దిపేట, 08 సెప్టెంబర్ 2026 (విజన్ ఆంధ్ర ప్రతినిధి) : ప్రభుత్వ కార్యాలయాల పనివేళలు ప్రారంభమై గంటలుదుస్తున్నా సిబ్బంది జాడ లేకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సిద్దిపేట కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని సబ్ ట్రెజరీ ఆఫీస్ (ఎస్టీఓ)లో మంగళవారం ఉదయం 10:40 గంటల సమయానికి పలు సీట్లు, కుర్చీలు ఖాళీగా దర్శనమివ్వడం స్థానికంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. వివిధ వ్యక్తిగత, అధికారిక పనుల నిమిత్తం సుదూర ప్రాంతాల నుండి కార్యాలయానికి వచ్చిన ప్రజలకు, పింఛనుదారులు, ఉద్యోగులకు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రజా సమస్యలు పరిష్కరించి, నేరుగా సేవలందించాల్సిన కీలకమైన కార్యాలయంలో పనివేళల్లోనే ఉద్యోగులు గైర్హాజరు కావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమయపాలన పాటించాల్సిన ఉద్యోగుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా, కార్యాలయ నిర్వహణపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఏమేరకు ఉందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, ఎస్టీఓ కార్యాలయ సిబ్బంది హాజరు, విధుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## భూములుకోల్పోయినరైతులకు వెంటనే డబ్బులు ఇవ్వాలి.



ఊట్కూర్, సెప్టెంబర్ 8 ( విజన్ ఆంధ్ర)నారాయణ పేట జిల్లా రైతులకు సాగునీరు త్రాగునీరు అందించే మక్తల్ – నారాయణ పేట – కొడంగల్ ఎత్తిపోతల పథకం కు అన్ని విధాలుగా సహకరించి భూములు కోల్పోయిన రైతుల ఖాతాలలో వెంటనే డబ్బులు జమ చేయాలని జల సాధన సమితి జిల్లా కో కన్వీనర్ హెచ్. నర్సింహా మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సీఎం మంత్రి ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి రైతులు ఈ ఎత్తిపోత పథకం కోసం వారి భూములు ఇచ్చి డబ్బులు వస్తాయనే నమ్మకంతో అప్పులు చేసి మరొక చోట భూములు కొనుగోలు చేశారు .కొంత మంది రైతులు కొన్ని డబ్బులు అడ్వాన్స్ ఇచ్చి భూములు కొనుగోలు చేశారని డబ్బులు ఇవ్వమని భూములు అమ్మిన వారు వత్తిడి చేస్తున్నట్లు రైతులు తమ దృష్టికి తెచ్చినట్లు పేర్కొన్నారు.డబ్బులు ఇవ్వడం కుదరక పోతే మా భూములు మేము సాగుచేసుకుంటాం వదిలి వెళ్ళమని అంటున్నారని రైతులు తెలిపారని అన్నారు.అప్పులు చేసి భూములు కొన్న రైతులకు వడ్డీ పెరిగి లక్ష రూపాయలు అప్పు తెస్తే రెండు లక్షలు అయ్యాయి అని ఆవేదన వ్యక్తం చేశారు. పేట జిల్లా అభివృద్ధి కోసం వారి సర్వస్వం అయిన సాగు భూమిని కోల్పోయిన రైతులను ఇబ్బంది పెట్టకుండా నష్ట పరిహారం ఇచ్చే విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే ప్రత్యేక అధికారులను నియమించి ఈ ఎత్తిపోతల పథకం లో భూములు కోల్పోయిన రైతుల ఖాతాలలో డబ్బులు వెంటనే జమ చేయాలని కోరారు.

## దళిత బహుజనుల ఆరాధ్య దైవం డా. బి ఆర్ అంబేద్కర్

- హమారా ప్రసాద్ పై దేశద్రోహం కేసు బుక్ చేయాలి



సిద్దిపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర) : బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల చంద్రందళిత బహుజనుల ఆరాధ్య దైవమైన అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్ పై దేశద్రోహం కేసు బుక్ చేయాలని బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల చంద్రం డిమాండ్ చేశారు. అంబేద్కర్ పై కల్పిత నాయకుడు అనే పుస్తకం రాసి అంబేద్కర్ను అవమానించినందుకుగాను బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీజేఏసీఆధ్వర్యంలో సిద్దిపేటలో హమారా ప్రసాద్ దిష్టిబొమ్మ దహనంకార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూఅంబేద్కర్నుకించపరిచేలా ఎవరు మాట్లాడిన సహించేది లేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే హమారా ప్రసాద్ పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దళిత బహుజన మైనారిటీ లందరూ ఏకమై పోరాటం చేస్తామనిహెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ ఐక్యవేదికజిల్లాఅధ్యక్షుడు తెల్జీరు శ్రీనివాస్ యాదవ్, ఎస్టిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లం, రమేష్, నిమ్మ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాలలో యూజీసీ నెట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి జిల్లా కలెక్టర్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి08 సెప్టెంబర్ (విజన్ ఆంధ్ర) : యుజిసి నెట్ సెప్టెంబర్, 2026 09.09.2026 మరియు 10.09.2026 తేదీలలో జాతీయ అర్హత పరీక్షను సజావుగానిర్వహించేందుకుబిఎన్ఎస్ఎస్2023లోని సెక్షన్ 163 కింద ఉత్తర్వుల జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ కే. హైమావతి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని హిందూ ఇంజనీరింగ్ కాలేజీలో 09.09.2026 మరియు 10.09.2026 తేదీలలో నిర్వహించనున్న యుజిసి నెటపరీక్షకు భద్రతా ఏర్పాట్లు మరియు ఇతర అవసరమైన ఏర్పాట్లను చేయడం జరిగిందని, పరీక్ష సజావుగా, ప్రశాంతంగా మరియు క్రమబద్ధంగా నిర్వహించేందుకు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండానిరోధించేందుకు, ప్రజలు పరీక్ష నిర్వహణలో ఉద్దేశపూర్వకంగా జోక్యం చేసుకోకుండాఉండేందుకు బి ఎన్ ఎన్ ఎస్ ఎస్ 2023లోని సెక్షన్ 163 నిబంధనలను అమలు చేయడం జరిగిందని అన్నారు. ఆ ఉత్తర్వుల ప్రకారం ఇందూర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, పొన్నాల గ్రామం, సిద్దిపేట (అర్బన్) మండలంపరీక్షా కేంద్రం చుట్టూ 200 మీటర్ల పరిధిలో:ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు ఒకచోట గుమికూడడం నిషేధం. కర్రలు, కత్తులు, ఆయుధాలు, లాఠీలు లేదా ఇతర హానికరమైన ఆయుధాలు/పరికరాలు తీసుకురావడం నిషేధం. అదేవిధంగా, పరీక్షా కేంద్రం చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు, సైబర్ కేఫ్‌లు మొదలైనవి పరీక్ష జరిగే సమయంలో అంటే 09.09.2026 మరియు 10.09.2026 తేదీలలోమూసివేయాలనీ తెలిపారు..ఈ ఆంక్షలు 09.09.2026 మరియు 10.09.2026 తేదీలలో ఉదయం 6:00 గంటల నుంచి సాయంత్రం 7:30 గంటల వరకు లేదా పరీక్ష పూర్తయ్యే వరకు అమల్లో ఉంటాయని ప్రజల ప్రజలు ఈ ఆంక్షల ప్రకారం సహకరించాలని ఆ ప్రకటనలో తెలిపారు.

## అక్షరాస్యతతోనే సాధికారత.. ప్రతి ఒక్కరూ అక్షరాస్యు లు కావాలి..

- జిల్లా కలెక్టర్ ప్రియాంక.



నారాయణపేట సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర) : అక్షరాస్యత అనేది కేవ లం చదవడం, రాయడం మాత్రమే కాదని, అది వ్యక్తి జీవితాన్ని మార్చే శక్తి అని జిల్లా కలెక్టర్ ప్రియాంక అన్నారు.అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన అక్షరాస్యత ర్యాలీని జిల్లా కలెక్టర్ ప్రియాంక ప్రారంభించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ సత్య నారాయణ చౌరస్తా వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చదువు మనిషికి జ్ఞానం, ఆత్మవిశ్వా సం, స్వావలంబనను అందిస్తుందని తెలిపారు. నారాయణపేట జిల్లాలో అక్షరాస్యత శాతం 49.93 శాతం మాత్రమే ఉందని, పురుషుల అక్షరాస్యత 60.32 శాతం కాగా, మహి ళల అక్షరాస్యత 39.72 శాతంగా ఉందని కలెక్టర్ తెలిపారు. మహిళల అక్ష రాస్యతలో ఉన్న అంతరా న్ని తగ్గించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నా రు.మహిళా సంఘాలు, స్వయం సహాయక సంఘాల సహకారంతో మహిళలనుఅక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతు న్నామని తెలిపారు. ప్రస్తు తం అమలులో ఉన్న ఉల్లా స్ కార్యక్రమం ద్వారా నిరక్ష రాస్యులను గుర్తించి, వారికి చదవడం, రాయడం, ప్రాథ మిక గణిత నైపుణ్యాలను అందించేందుకు కృషి చేస్తు న్నామని చెప్పారు. గుర్తించి నఅభ్యాసకులందరినీ సెప్టెంబర్‌లో నిర్వహించనున్న ఎఫ్ ఎల్ ఎన్ ఏ టి / ఎన్ ఐ వో ఎస్ పరీక్షకు సిద్ధం చేయాలని అధికారు లను ఆదేశించారు. జిల్లా అధికారులు, విద్యాశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, స్వయం సహాయక సంఘా లు, వాలంటీర్లు, ప్రజలు సమన్వయంతో పనిచేసి అక్షరాస్యత లక్ష్యాలను సాధించాలని సూచించారు.

**“ప్రతి ఒక్కరు చదువుకోవాలి...ప్రతి మహిళ అక్షరాస్యురాలు కావాలి...**

ప్రతి గ్రామం సంపూర్ణ అక్షరాస్యత వైపు అడు గులు వేయాలి. చదువు ఉంటేనే అభివృద్ధి అక్షరా స్యత ఉంటేనే సాధికారత” అని కలెక్టర్ పేర్కొన్నారు. నారాయణపేట జిల్లాను అక్షరాస్యతలో ముందంజ లో నిలబెట్టేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములై సమిష్టిగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి గోవిం దరాజు, డీఆర్డీవో వెంకట్రా ములు, డీపీ ఆర్ వో రషీద్, మున్సిపల్ కమిషనర్ శంకర్, ఎం ఈ వో బాలాజీ, ఉల్లాస్ ప్రోగ్రాం జిల్లా కోఆర్డి నేటర్ రఘునాథ్, శివకు మార్, ఏ పీ ఎం నారాయ ణ, వివిధ పాఠశాలల ప్రధా నోపాధ్యాయులు, ఉపాధ్యా యులు, విద్యార్థులు, కళాకారులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంపై యువతకు అవగాహన అవసరం

**వాగమున్ , తెలంగాణ స్టేట్ మాక్ అసెంబ్లీలో విష్ణు రెడ్డి**



వరంగల్: బొల్లికుంటలోని వాగ్దేవి కళాశాలలో నిర్వహించిన వాగమున్ (వాగ్దేవి మోడల్ యునైటెడ్ నేషన్స్ ), తెలంగాణ స్టేట్ మాక్ అసెంబ్లీ కార్యక్రమానికి నిర్వాహకుల ఆహ్వానం మేరకు యువ నాయకుడు విష్ణు రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు.ఽమోడల్ యునైటెడ్ నేషన్స్, మాక్ అసెంబ్లీ వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతోపాటు ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కల్పిస్తాయని తెలిపారు. ప్రజా సమస్యలపై అధ్యయనం చేసి, వాటిపై బాధ్యతాయుతంగా చర్చించడం, భిన్నాభిప్రాయాలను గౌరవించడం వంటి అంశాలను విద్యార్థులు అలవర్చుకోవాలని సూచించారు.విద్యార్థి దశ నుంచే సమాజంలోని సమస్యలపై అవగాహన పెంచుకుని, వాటి పరిష్కారానికి ఆలోచించే దృక్పథాన్ని అలవర్చుకోవాలని చెప్పారు. విద్య, వైద్యం, ఉపాధి, పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత, యువతకు అవకాశాలు వంటి అంశాలపై యువత చైతన్యంతో ఉండాలని అన్నారు. భవిష్యత్తులో దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హత ఉన్న ఏ ఒక్క ఓటు జాబితాలో మిస్ కావొద్దు

- నోటీసుల జారీ, ధృవీకర ణ, డాక్యుమెంట్ల అప్‌లో డ్ ప్రక్రియను వేగవంతం చేయాలి.
- జిల్లా కలెక్టర్ ప్రియాంక.



నారాయణపేట సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర) : ఓటరు జాబితా పరిశీలన ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించి అర్హత కలిగిన ఏ ఒక్క ఓట రు కూడా జాబితాలో మిస్ కాకుండా చర్యలు తీసుకో వాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు.మంగళవారం ధన్వాడ మండల కేంద్రంలో ని గ్రామ పంచాయతీ కార్యాల యాన్ని సందర్శించి ఓటరు జాబితా పరిశీలన ప్రక్రియపై సంబంధిత ఎన్ని కల అధికారులు, ఏ ఈ ఆర్ వో లు, బీ ఎల్ వో లతో జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసు కున్నారు.ప్రతిరోజూ ఎన్ని నోటీసులు జారీ చేస్తున్నా రు, ఎంతమంది నుంచి అవసరమైన డాక్యుమెంట్లు స్వీకరిస్తున్నారు, ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నా యి అనే వివరాలను నిరం తరం పర్యవేక్షించాలని సూచించారు. నోటీసు జారీ చేసిన వెంటనే సంబంధిత ప్రక్రియను పూర్తి చేసి, వివ రాలను యాప్‌లో ఎలాంటి జాప్యం లేకుండా అప్‌లోడ్ చేయాలని ఆదేశిం చారు. అభ్యర్థి తప్పనిసరిగా కార్యాలయానికి రావాల్సిన అవసరం లేని సందర్భాల్లో నిబంధనల మేరకు క్షేత్ర స్థాయిలోనే ధృవీకరణ ప్రక్రి య చేపట్టాలని తెలిపారు. అవసరమైన ఫోటోలు, ధృవీకరణ వివరాలను సక్రమంగా నమోదు చేయా లని సూచించారు.ప్రతి ఏ ఈ ఆర్ వో కు కేటాయిం చిన పోలింగ్ స్టేషన్ల సంఖ్య, వాటి పరిధిలో ఉన్న పెండిం గ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి ఫాలోఅప్‌ను వేగవంతం చేయాలని ఆదేశించారు.బీ ఎల్ వో డిక్లరేషన్, ధృవీకరణ ప్రక్రి య సక్రమంగా జరుగుతు న్నదా లేదా పరిశీలించా లని, నిబంధనల ప్రకారం అవసరమైన చోట అభ్యర్థి/ఓటరుతో పాటు సంబంధి త ఇన్‌చార్జి, బీ ఎల్ వో కలిసి గ్రూప్ ఫోటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తు న్నారా అని తనిఖీ చేయాల ని సూచించారు. అవస రమైన 11 రకాల డాక్యు మెంట్లలో నిబంధనలకు అనుగుణంగా ఏదైనా ఒక చెల్లుబాటు అయ్యే డాక్యు మెంట్ సమర్పించినా, దాని ని పరిశీలించి తదుపరి ప్రక్రి య చేపట్టాలని తెలిపారు. అదేవిధంగా అన్ మ్యాప్డ్ ఓటర్ల వివరాలను ప్రత్యేకం గా పరిశీలించాలని, మ్యాపింగ్ ఎందుకు పూర్తి కాలేదో కారణాలను గుర్తిం చి వెంటనే పరిష్కరిం చాలని ఆదేశించారు. అన్ మ్యాప్డ్ కేసులతో పాటు ఇతర రకాల నోటీసులు, పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్యను కూడా స్పష్టంగా గుర్తించి, వాటిపై నిర్దిష్ట కార్యాచరణ చేపట్టాలని సూచించారు.క్షేత్రస్థాయి పరిశీలన లో భాగంగా కొంత మంది ఓటర్లను నేరుగా అడిగి వారి ఓటరు వివ రాలు సంబంధిత పోలింగ్ స్టేషన్‌కు సక్రమంగా మ్యాపింగ్ అయ్యాయా లేదా జిల్లా కలెక్టర్ తెలుసు కున్నారు.ఓటరు జాబితా పరిశీలనలో వేగం, ఖచ్చిత త్వం, పారదర్శకతకు ప్రాధా న్యత ఇస్తూ, అర్హత కలిగిన ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయా లని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు.

## కేజీబీవీలో కలెక్టర్ తనిఖీ



మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి , సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర): హన్వాడ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మంగళవారం సందర్శించి విద్యాబోధన, భోజనం, వసతులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వంటశాలను పరిశీలించిన కలెక్టర్ పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ నాణ్యమైన ఆహారం, తాగునీరు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు, తాగునీటి వసతులను పరిశీలించి మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని సూచించారు. నాబార్డు నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్.. 1415 ఏళ్ల బాలికలు హెచ్‌పీవీ టీకా తీసుకోవాలని సూచించారు. అర్హులైన విద్యార్థినులందరికీ వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

## పీర్ గ్రూప్ పిల్లలకు అవగాహన కార్యక్రమాలు

- పోస్టర్లను విడుదల చేసిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 08,(విజన్ ఆంధ్ర ) : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ రాష్ట్రీయ కిషోర్ స్వాస్థ కార్యక్రమంలో భాగంగా 10 నుండి 19 ఏళ్ల బాల, బాలికలు (కౌమార దశ ) పిల్లలకు వైద్య ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, అందులో భాగంగా పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ 10 నుండి 19 ఏళ్ల పిల్లలను పీర్ గ్రూప్ అని అంటరన్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంల తో పాటు పాఠశాలల్లో బాల,బాలికలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా కౌమార ఆరోగ్య సమాచారం కోసం భరోసా కల్పించడం ముఖ్యమైనవని, అదేవిధంగా ఈ గ్రూపులోని పిల్లలకు సలహా, తగిన సహాయము, గోప్యత ఉండటం వలన ఆరోగ్య కార్యక్రమాలు అందించడంలో సులభం అవుతుందన్నారు. లైంగిక మరియు పునరుత్పత్తి, ఆరోగ్య సలహా, రుతుస్రావము, గర్భనిరోధకము, ముఖ్యంగా రక్తహీనత, మధుమేహము, రక్తపోటు, మానసిక ఆరోగ్య సలహాలు, కోపము, చికాకు, చిరాకు కౌమార సమస్యలపై సలహాలు సూచనలపై ఈ పీర్ గ్రూపు పిల్లలకు అవగాహన కలిగించాలన్నారు. అదేవిధంగా కౌమార బాల బాలికలకు మంచి స్పర్శ,చెడు స్పర్శ పైన అవగాహన కలిగించాలని, ఎవరైన వీటిపై చెడుగా ప్రవర్తిస్తే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. 2006 ప్రకారం 18 ఏళ్ల లోపు ఆడపిల్లలకు ఇరవై ఒక్క సంవత్సరం లోపు మగ పిల్లలకు పెళ్లి చేయడం చట్టరీత్యా నేరమని, రెండు సంవత్సరాల పాటు జైలు శిక్ష మరియు లక్ష రూపాయల జరిమానా విధించబడునని తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అనిల్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, సిహెచ్ ఓలు కాకిరాల వెంకటేశ్వర్లు, పుట్టా సత్తయ్య, శ్రీనివాస్, ఆర్ఎస్ పద్మ, సుమన్, లక్ష్మణస్వామి పాల్గొన్నారు.

## కరాటేలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు తీసుకురావాలి

**- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మంతెన జగన్ మోహన్ రావు**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 08,(విజన్ ఆంధ్ర ) : విద్యార్థులు చిన్నతనం నుండే చదువుతో పాటు క్రీడారంగంలో రానించలని, మనకు నచ్చిన ఆటను ఎంచుకొని అందులో గుర్తింపు తెచ్చుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మంతెన జగన్మోహన్ రావు అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మంచిర్యాల ఆధ్వర్యంలో కరాటే ఎంపిక కార్యక్రమానికి అయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా జగన్మోహన్ రావు మాట్లాడుతూ పిల్లలు కరాటే రంగంలో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలో గెలుపు పొందాలని ఆకాంక్షించారు. చిన్నతనం నుండే అటలపోటిలపై ఆసక్తి కలిగేలా కృషి చేయాలన్నారు. అమ్మాయిలు ఆత్మస్థైర్యం కోసం కరాటే నేర్చుకుంటే ఎప్పటికైన దోహద పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం క్రీడాకారులకు మంచి ప్రోత్సహం అందిస్తుందన్నారు. అనంతరం డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సభ్యులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మంతెన జగన్ మోహన్ రావుని శాలువాతో సత్కరించి, మెమెంటో బహుకరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ మాజీ చైర్మన్ రావుల, ఉప్పలయ్య, నస్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ సూరిమిళ్ల వేణు, 9వ డివిజన్ కార్పొరేటర్ సురిమల్ల సౌమ్య, స్థానిక కార్పొరేటర్లు వనపర్తి రాజేష్, కాల్వల వెంకటసాయి కృష్ణ, యూత్ నాయకులు సుదుమల్ల అశోక్ తేజ, అజహర్, పెంట రవి, రేగుంట వెంకటేష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత లక్ష్యాలతో భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలి

**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 8 ( విజన్ ఆంధ్ర ) : ఉన్నత లక్ష్యాలతో మంచి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ విద్యార్థినిలకు సూచించారు. మంగళవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని శివారెడ్డిపేట మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల, రామయ్య గూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో పదవ తరగతి సాంఘిక శాస్త్రం బోధిస్తున్న తరగతిని సందర్శించిన జిల్లా కలెక్టర్ ప్రాథమిక హక్కులు, విధులపై విద్యార్థినీలను అడిగి సమాధానము రాబట్టారు. విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దుకోవచ్చని ఆదిశగా విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యనభ్యసించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఒక్కరికి లక్ష్యం అనేది గొప్పగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. విద్యతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంచుకునే విధంగా వ్యాయామం చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ఆరోగ్యకరమైన శరీరంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా చాలా అవసరమని ఆయన అన్నారు. విద్యార్థులకు గత సిలబస్ పై కూడా అప్పుడప్పుడు సమీక్షిస్తూ ఉండాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. ముందుగా భోజనశాల, స్టోర్, వంటగదులను సందర్శించి మధ్యాహ్న భోజనానికి సిద్ధం చేసిన వంటకాలను పరిశీలించారు. అనంతరం రామయ్య గూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన క్రమంలో ఆసుపత్రిలో ప్రజలకు నాణ్యమైన వైద్యంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ వైద్యాధికారులకు సూచించారు. ఆసుపత్రి మరమత్తు పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆయన సూచించారు. ఆసుపత్రిలో త్రాగునీటి కోసం ఆర్.ఓ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. ఆసుపత్రి స్థలంలో కబ్జాలకు గురికాకుండా ఆవరణ చుట్టు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ పర్యటనలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, జెడ్పి సీఈఓ సుధీర్, డిఎంహెచ్ఓ సుధాకర్ లాల్, తహసిల్దార్ లక్ష్మీనారాయణ, డాక్టర్ సౌమ్యలు ఉన్నారు.

## ప్రత్యేక సమగ్ర సవరణ విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలి


**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 8 ( విజన్ ఆంధ్ర ) : ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ విచారణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. మంగళవారం వికారాబాద్ మునిసిపల్ పరిధిలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ విచారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆలంపల్లి ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్ఐఆర్ విచారణకు వచ్చిన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి డాక్యుమెంట్లు అప్లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. అనామలీస్, మ్యాపింగ్ కానీ, ఓటర్ జాబితాలో పుట్టిన తేదీల మార్పుల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఇప్పటివరకు కూడా నోటీసులు జారీ చేయని వారిని గుర్తించి విచారణకు హాజరు అయ్యేవిధంగా బిఎల్ఓ లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ తో పాటు అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, వీఆర్వో స్వర్ణలత, తహసిల్దార్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి లు ఉన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానం ప రైతులకు అవగాహన కల్పించాలి

**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 8 ( విజన్ ఆంధ్ర ) : సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు. మంగళవారం వికారాబాద్ మండలం నారాయణపూర్ గ్రామంలో మొక్క జొన్న, కంది పంటలను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని రైతులకు పంటల సాగుపై నూతన సాంకేతికతపై అవగాహన కల్పించాలన్నారు. వర్షాభావ ప్రభావం వల్ల పంటల నష్టాన్ని నివారించేందుకు రైతులకు పలు సలహాలు ఇవ్వాలని ఆయన అధికారులకు సూచించారు. నానో యూరియా వాడకం పట్ల రైతుల్లో అవగాహన కల్పించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. కలెక్టర్ తో పాటు అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, జిల్లా వ్యవసాయ అధికారి బి.కవిత, తహసిల్దార్ లక్ష్మీనారాయణ , మండల వ్యవసాయ అధికారి ప్రసన్న లు ఉన్నారు.

# ఉమ్రి గ్రామంలో 'పోలీసులు మీకోసం' కార్యక్రమం

**- తలమడుగు, దేవాపూర్ గ్రామాలలో 26 సీసీటీవీ కెమెరాల ప్రారంభం.**

**- గంజాయిపై యుద్ధం చేయాలి.. మార్పు ద్వారానే గంజాయిని దూరం చేయవచ్చు.....**

**- 15 మంది వాహనదారులకు హెల్మెట్ల పంపిణీ.. గ్రామస్తులకు వాలీబాల్ కిట్స్ అందజేసిన**

**- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**



ఆదిలాబాద్ జిల్లా (విజన్ ఆంధ్ర బ్యూరో)ప్రజలకు మరింత చేరువై వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడం, గ్రామాల్లో పోలీసు–ప్రజల సత్సంబంధాలను బలోపేతం చేయడం, నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఆదిలాబాద్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'పోలీసులు మీకోసం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం తలమడుగు మండలం ఉమ్రి గ్రామంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉమ్రి గ్రామ ప్రజలు సాంప్రదాయ ఆదివాసి దేంశ నృత్యంతో జిల్లా ఎస్పీని ఘనంగా ఆహ్వానించారు, గ్రామ మహిళలు జిల్లా ఎస్పీకి రాఖిని కట్టి రాఖీ శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామంలో ఉన్న కుమురం భీం విగ్రహానికి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉమ్మడి గ్రామంలో ఏర్పాటు చేసిన "పోలీసులు మీకోసం" కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా ఎస్పీతో పాటు పోలీసు అధికారులకు గ్రామ మహిళలు సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దేవాపూర్ మరియు తలమడుగు గ్రామాలలో ఏర్పాటు చేసిన 26 సీసీటీవీ కెమెరాలను గ్రామస్తులతో కలిసి జిల్లా ఎస్పీ ప్రారంభించారు. ప్రతి గ్రామం సీసీటీవీ నిఘాలో ఉంటే నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా జరుగుతుందని అన్నారు. గ్రామ భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, సీసీటీవీలు ప్రజల రక్షణకు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొంటూ సీసీటీవీల ఏర్పాటుకు సహకరించిన గ్రామ పెద్దలు, గ్రామ కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై గ్రామ ప్రజలు, యువతకు అవగాహన కల్పించారు. "గంజాయిపై యుద్ధం చేయాలి.. మార్పు వల్లే గంజాయిని సమాజం నుంచి దూరం చేయవచ్చు" అని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి సాగు చేస్తున్నా లేదా మాదకద్రవ్యాల వ్యాపారం నిర్వహిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల సహకారం అత్యంత అవసరమని, గంజాయి రహిత సమాజ నిర్మాణమే జిల్లా పోలీసుల లక్ష్యమని తెలిపారు. చదువు పట్ల ఉన్న ఆవశ్యకతను తెలియజేశారు విద్యార్థులు ఉన్నత చదువులు చదివేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి అని తెలిపారు. చదువు వల్ల భవిష్యత్తు మారుతుందని తెలిపారు. నకిలీ బాబాలను, మంత్రాలను తంత్రాలను ఎలాంటి వైద్య అవసరం ఉన్న, ప్రభుత్వం గుర్తించిన ప్రభుత్వ ప్రైవేటు వైద్యులను సంప్రదించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణనష్టానికి దారితీస్తుందని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్ వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా 15 మంది వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. కోసాయి విజయ హనుమాన్ టెంపుల్ లో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

గ్రామంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును ప్రారంభించారు. దాదాపు ఆరు రంగాలలో నిష్ణాతులైన ఆదిలాబాద్ లోని ప్రైవేటు వైద్యుల బృందం చే గ్రామస్తులందరికీ ఉచితంగా మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయడం జరిగిందని ఈ క్యాంపులో 250 మంది గ్రామస్తులు పాల్గొని జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్, గైనకాలజీ, ఆప్తమాలజీ, డెంటల్, పీడియాట్రిషన్ విభాగాలలో వైద్య పరీక్షలను ఉచితంగా మందులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోసాయి, జరీ, ఉమ్రి గ్రామాలకు చెందిన 250 మంది గ్రామస్తులు మహిళలు వృద్దులు చిన్నారులు పాల్గొని వైద్య పరీక్షలను చేయించుకున్నారు.

మండల స్థాయి కబడ్డీ పోటీల విజేతలకు బహుమతులు. అందజేశారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలని, క్రీడలు క్రమశిక్షణ, ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ టోర్నమెంట్ విజేతలకు జిల్లా ఎస్పీ నగదు బహుమతులు, ట్రోఫీలు, మెడల్స్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కబడ్డీ క్రీడాకారులతో కాసేపు కబడ్డీ ఆడి వారిని ఉత్సాహపరిచారు.

విజేతలు :

ప్రథమ బహుమతి : కోసాయి గ్రామ జట్టు 5 వేల నగదు బహుమతి, ట్రోఫీ.

ద్వితీయ బహుమతి : ఝరి గ్రామ జట్టు 3 వేల నగదు బహుమతి, ట్రోఫీ.

తృతీయ బహుమతి :

పాల్సి కె గ్రామ జట్టు, 2 వేల నగదు బహుమతి, ట్రోఫీ. లను అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, రూరల్ సీఐ రహీం పాషా, తలమడుగు ఎస్ఐ డి రాధిక, పట్టణ డాక్టర్లు చంద్రశేఖర్ రెడ్డి, సందీప్ రెడ్డి, శిల్పా సందీప్, అనిషా, భార్గవ్ కృష్ణ, శ్రీనివాసచారి, ఉమ్రి సర్పంచ్ మెస్రం సావిత్రిబాయి, కోసాయి గ్రామ సర్పంచ్ శైలజ, గ్రామ పెద్దలు పెందూరు వనమాల, కుమ్ర రామారావు, పెందూరు మాధవరావు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, మహిళలు, యువతతో పాటు సుమారు 250 మంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నాణ్యతా ప్రమాణాలతో వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తి చేయాలి

**- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 8 ( విజన్ ఆంధ్ర,) : హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం పెంబర్తి పరిధి దత్తాత్రేయ కాలనీలో నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ ను పరిశీలించిన కలెక్టర్ నాణ్యత ప్రమాణాలతో వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం పెంబర్తి గ్రామ పరిధిలోని దత్తాత్రేయ కాలనీలో నిర్మిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని ఎన్ని రోజుల్లోగా పూర్తి చేయగలరనే విషయంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిస్ట్రిబ్యూషన్ లైన్ల పనుల పురోగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూలి వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలన్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించిన ఈ నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా పనుల వేగవంతానికి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. వాటర్ ట్యాంక్‌తో పాటు డిస్ట్రిబ్యూషన్ లైన్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పనుల్లో ఉపయోగిస్తున్న నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తాళ్లపెల్లి కుమారస్వామి, మిషన్ భగీరథ ఇంట్రా డివిజన్ ఈఈ బి. గాయత్రీ, గ్రిడ్ ఈఈ రామాంజనేయులు, డీఈలు శ్రీనివాస్, జట్టి శ్రీనివాస్, తహసీల్దార్ కిరణ్ కుమార్, ఎంపీడీవో సుమనవాణి, ఏఈలు అనిల్, నీరజ, పంచాయతీ కార్యదర్శి హేమలత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలను అందించాలి

**- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 8 ( విజన్ ఆంధ్ర ) : హనుమకొండ జిల్లా హసన్ పర్తి లోని ఉన్నత శ్రేణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల పాటు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తిలోని ఉన్నతశ్రేణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వ్యాక్సిన్ గది, ఆపరేషన్ థియేటర్, ఇన్‌పేషెంట్ గది, సిబ్బంది గది, నర్సుల గది, ఇంజక్షన్ రూమ్, ల్యాబొరేటరీ, ఫార్మసీ, టాయిలెట్స్, తదితర విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులను కలిసి వారు ఏ సమస్యతో వైద్య సేవల కోసం వచ్చారో కలెక్టర్ ఆరా తీశారు. అక్కడ అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, సిబ్బంది స్పందన, తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది వివరాలను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భార్గవ్ ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూలి ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలతో పాటు నిర్వహణ పటిష్టంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. ఆరోగ్య కేంద్రంలో పనిచేసే సిబ్బంది అందుబాటులో ఉండేలా షిఫ్ట్‌ల వారీగా విధులు కేటాయించాలని, ప్రతి షిఫ్ట్‌లో అవసరమైన సిబ్బంది తప్పనిసరిగా విధుల్లో ఉండేలా పర్యవేక్షించాలని వైద్యాధికారిని ఆదేశించారు. హాస్పిటల్ నిర్వహణ పక్కాగా ఉండాలని... రోగులకు మెరుగైన వైద్యం, పరిశుభ్రమైన వాతావరణం, అవసరమైన మౌలిక సదుపాయాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ కిరణ్ కుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి ఉపాధ్యాయుడికి గుర్తింపే నిజమైన గురుదక్షిణ

**- ట్రస్మా జిల్లా అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి**



నారాయణపేట, సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర) : ప్రతి ఉపాధ్యాయుడికి సరైన గుర్తింపు నిజమైన గురుదక్షిణ అని ట్రస్మా జిల్లా అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నారాయణపేట డిఈఓ డాక్టర్ గోవిందరాజు కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందించడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ ఆయనను అభినందించారు. మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ట్రస్మా సభ్యులు డిఈఓ ను శాలువాతో సన్మానించి మిఠాయిలు తినిపిస్తూ మొక్కను బహుకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. మహబూబ్ నగర్ బీఈడీ కళాశాలలో ఎంతోమంది ఉపాధ్యాయులను తయారుచేసిన గొప్ప గురువుగా గోవిందరాజును అభినందించారు. ఉమ్మడి జిల్లాలో డిప్యూటీఈవో, డీఈవోగా పనిచేసి విధుల్లో ఉన్న ఉపాధ్యాయులకు చక్కటి మార్గనిర్దేశం చేశారని కొనియాడారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు అనే తేడా లేకుండా విద్యార్థులందరికీ అత్యుత్తమ విద్యను అందించే విధంగా చర్యలు చేపట్టారన్నారు. పదవ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించేందుకు చక్కటి ప్రణాళిక రూపొందించి అమలు చేయడం అభినందనీయమన్నారు. చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ విద్యార్థులు భాగస్వాములు అయ్యేవిధంగా ఉపాధ్యాయుల ద్వారా ప్రోత్సాహం అందించి వారిని అన్ని రంగాల్లో రాణించే విధంగా సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేశారన్నారు. జిల్లాలో వివాదరహితుడిగా చక్కటి సేవలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్మా పట్టణ అధ్యక్షులు ఎండి ఖదీర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేష్ కుమార్, ఎంఈఓ బాలాజీ, సెక్టోరియల్ అధికారులు రాజేంద్రకుమార్, సంగీత, యాదయ్యశెట్టి, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపల్స్ బాలప్ప, ఆంజనేయులు, వరలక్ష్మీ, చిన్న, ఇమ్రాన్ భాషా, ఆనంద్, సాయిలు, పాల్గొన్నారు.

## ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సత్తెనపల్లి రామకృష్ణ 26 వ వర్ధంతి



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 08,(విజన్ ఆంధ్ర ) : విద్యుత్తు పోరాటాల కారణంగానే ప్రైవేటీకరణ ప్రమాదం నుండి విద్యుత్తు రంగం రక్షించబడిందని వివిధ సంఘాల నాయకులు పేర్కొన్నారు. ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్వర్యంలో మంగళవారం మంచిర్యాలలో బషీర్ బాగ్ కాల్పుల్లో మరణించిన అమరుడు సత్తెనపల్లి రామకృష్ణ 26వ వర్ధంతి సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు రంగు రాజేశం మాట్లాడుతూ నాడు ప్రపంచ బ్యాంకు తాబేదారుగా వ్యవహరించిన చంద్రబాబు నాయుడు విద్యుత్తు చార్జీలను ఏకపక్షంగా పెంచడంతోపాటు విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించి కార్పొరేట్లకు అప్పగించాలని కుట్రలు పన్నారని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 26 యేళ్ల క్రితం వామపక్షాల నేతృత్వంలో ప్రజల కోసం ఉద్యమించిన వామపక్షాలు నాడు ముగ్గురు యువ కార్యకర్తలను కోల్పోవడం బాధాకరమన్నారు. పోలీసుల దమనకాండను ఉపయోగించి ఉద్యమాన్ని అణిచివేయాలని నాడు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రయత్నించిన కారణంగా హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రాంతంలో 2000 సంవత్సరం ఆగస్టు 28 న పోలీసుల కాల్పులు జరిగాయని, అకాల్పుల్లో రామకృష్ణ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సెప్టెంబర్ 08 న తుది శ్వాస విడిచారాని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమం లో రజక వృత్తిదారుల సంఘం నాయకులు పాయిరాల రాములు, ప్రజా సంఘాల నాయకులు ప్రకాష్, రామ్ దాస్, మోహన్ పాల్గొన్నారు.

## కాటారం సబ్ కలెక్టర్ గా సౌరబ్ శర్మ



కాటారం డివిజన్ ప్రతినిధి, సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం డివిజన్ సబ్ కలెక్టర్ గా సౌరబ్ శర్మ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. లాంచన పూర్వకంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం కాటారం కార్యాలయంలో కాటారం తహసిల్దార్ నాగరాజు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు అధికారులు సబ్ కలెక్టర్ సౌరబ్ శర్మకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ సౌరబ్ శర్మ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం దిశగా అధికారులు కృషి చేయాలని కోరారు.

## మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలి.

**- పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ప్రజలందరు మట్టి, సహజ రంగులతో చేసిన వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కోరారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మంగళవారం నుంచి మట్టి వినాయక విగ్రహాల పంపిణి కార్యక్రమంను పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ క్యాంప్ కార్యాలయం వద్ద సంబంధిత అధికారులతో కలిసి గోడ పత్రికలను, మట్టి వినాయక విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టర్ అఫ్ పారిస్, రసాయన రంగులతో చేసిన వినాయక విగ్రహాలను చెరువులలో, నదులలో నిమజ్జనం చేసినప్పుడు నీరు కలుషితం అయి, నీటి కాలుష్యం తద్వారా పర్యావరణ కాలుష్యం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణకు అన్ని వర్గాల ప్రజలు ముఖ్యంగా యువత సహకరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పర్యావరణ శాస్త్రవేత్త విద్యుల్లత, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి హృదయరాజ్, తదితరులున్నారు.

# పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించాలి.....

**- పసిడి బాల్యం.. ఆటపాటలతో అభ్యసన చేయించాలి..... జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



ఆదిలాబాద్ జిల్లా (విజన్ ఆంధ్ర బ్యూరో)పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందిస్తూ, అభ్యసనాన్ని ఆనందభరితంగా మార్చేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. జిల్లాలో నూతనంగా ప్రారంభించిన 74 ప్రీ-ప్రైమరీ పాఠశాలల్లో ఆటపాటల ద్వారా విద్యాబోధన అందించేలా వినూత్న అభ్యసన సామగ్రిని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా మావల ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రీ-ప్రైమరీ పాఠశాలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇండోర్, అవుట్‌డోర్ ఆట వస్తువులు, డ్యాన్స్, పాటల కోసం మైక్ సెట్లు, ఊయలలతో పాటు చిన్నారులను ఆకట్టుకునేలా రూపొందించిన అభ్యసన సామగ్రిని పరిశీలించారు. వీటిని సమర్థవంతంగా వినియోగిస్తూ బోధనను మరింత మెరుగుపరచాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం చిన్నారులకు స్కూల్ బ్యాగులు, వాటర్ బాటిళ్లను కలెక్టర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, సర్పంచ్ లక్ష్మణ్, జిల్లా విద్యాశాఖాధికారి మాధవి, పీఎంఓ మానిటరింగ్ అధికారి లక్ష్మణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గౌరవ స్పీకర్ ను దూషించిన ఎమ్మెల్సీ తాతా మధును వెంటనే శాసనమండలి నుండి తొలగించాలి..

**- స్పీకర్ గారికి వెంటనే క్షమాపణలు చెప్పాలి..**

**- బిఆర్ఎస్ పార్టీ వారి అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది..**

**పెద్దపల్లి నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో మరియు పట్టణ కేంద్రాల్లో గౌరవ ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు గారి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ప్రధాన రోడ్లపై బైఠాయించి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన కార్యక్రమాలు......**



తెలంగాణ న్యూస్ బ్యూరో చీఫ్ పెద్దపల్లి: బోనాల నాగరాజు వర్షాకాలం తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు సోమవారం రోజున నుండి ప్రారంభం కాగా గౌరవ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారిపై బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అతడిని వెంటనే శాసనమండలి నుండి తొలగించాలని అన్నారు. అసెంబ్లీ వద్ద బిఆర్ఎస్ పార్టీ శాసనసభ్యులు చేసిన హంగామా అంతాఇంతా కాదని వారికి కాంగ్రెస్ ప్రభుత్వంను విమర్శించడం అలవాటైపోయింది అని కేసీఆర్ నిన్న ఆదివారం రోజున బిఆర్ఎస్ ఎల్పీ సమావేశం నిర్వహించి తమ పార్టీ శాసనసభ్యులకు గౌరవ స్పీకర్ గారిని దూషించమని దిశానిర్దేశం చేశారని అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ చేస్తున్న అనైతిక చర్యలను ప్రజలందరూ గమనిస్తున్నారని వారికి మళ్ళీ తిరిగి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెబుతారని తెలిపారు. గౌరవ స్పీకర్ గారిపై చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల చిత్తశుద్ధితో బాధ్యత వహించి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన వ్యాఖ్యల పట్ల నిండు అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారు కంటతడి పెట్టడం బాధాకరమని వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యక్తులు సభలో కొనసాగితే చట్ట సభలకు చెడ్డ పేరు వస్తుంది అని అన్నారు. గౌరవ స్పీకర్ గారికి కాంగ్రెస్ పార్టీ అండగా నిలబడుతుందని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మరియు అభివృద్ధి కార్యక్రమాలను చూసి బిఆర్ఎస్ పార్టీ వారు ఓర్చుకోలేకపోతున్నామని వారి ఉనికిని చాటుకునేందుకు రోడ్ల మీదకు వచ్చి ఏవో ఆందోళన కార్యక్రమాలను చేస్తామంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత స్పీకర్‌పై అసభ్య పదజాలం బీఆర్ఎస్ నేతల దురహంకారానికి పరాకాష్ట అని అన్నారు. ఎమ్మెల్సీ తాతా మధు ఒక దళిత స్పీకర్‌ను ఉద్దేశించి తీవ్రమైన పదజాలం ఉపయోగించడం అత్యంత అభ్యంతరకరం. ఇది కేవలం ఒక వ్యక్తిని అవమానించడం కాదు. దళిత స్పీకర్ మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిన తీరుగా తెలంగాణ సమాజం చూస్తోందని తెలిపారు. సభలో మాట్లాడటానికి దమ్ము లేక ప్రజల సమస్యలపై మాట్లాడే ధైర్యం లేక తమ నాయకుడు అసెంబ్లీకి రాకపోవడంపై సమాధానం చెప్పలేక విషయాన్ని పక్కదారి పట్టించేందుకు బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న అడ్డమైన పిచ్చివేషాలు తెలంగాణ ప్రజలకు స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు. రాజకీయ భేదాలు ఉండొచ్చు, విమర్శలు చేసుకోవచ్చు కానీ స్పీకర్ పదవికి, వ్యక్తిగత గౌరవానికి, దళితుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే స్థాయిలో అసభ్య పదజాలం ఉపయోగించడం ఏమాత్రం సమర్థనీయం కాదు అని ఈ దురహంకారాన్ని తెలంగాణ సమాజం ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, పట్టణ కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# దళిత స్పీకర్‌పై అసభ్య పదజాలం

**- బీఆర్ఎస్ నేతల దురహంకారానికి పరాకాష్ట**

**- తాతా మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి**

**- మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర వైస్‌చైర్మన్ మందుల సూర్యకిరణ్**



విజన్ ఆంధ్ర(08) హైదరాబాద్ తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు తీవ్ర అసభ్య పదజాలం ఉపయోగించడాన్ని టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర వైస్‌చైర్మన్ మందుల సూర్యకిరణ్ తీవ్రంగా ఖండించారు, దళిత స్పీకర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యగా అభివర్ణించారు, సభలో ప్రజా సమస్యలపై మాట్లాడే దమ్ము లేకే బీఆర్ఎస్ నేతలు విషయాన్ని పక్కదారి పట్టించేందుకు స్పీకర్‌ను, దళిత ఎమ్మెల్యేలను లక్ష్యంగా చేసుకుని అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని సూర్యకిరణ్ ఆరోపించారు, రాజకీయ భేదాలు ఉండొచ్చని, విమర్శలు చేసుకోవచ్చని, అయితే రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవికి, వ్యక్తిగత గౌరవానికి, దళితుల ఆత్మ గౌరవానికి భంగం కలిగించేలా అసభ్య పదజాలం ఉపయోగించడం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు, ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుపై, అలాగే ఆయన వ్యాఖ్యలకు ప్రేరేపించారని ఆరోపిస్తున్న కేటీఆర్, హరీశ్‌రావు, కౌశిక్‌రెడ్డి తదితరులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరుతూ మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు, దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే చర్యలను తెలంగాణ సమాజం ముక్త కంఠంతో ఖండిస్తుందని మందుల సూర్యకిరణ్ అన్నారు, బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆసర్ల బీరప్ప, రవి పాల్గొన్నారు

# విద్యార్థులను ఆదర్శ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే.....

**- జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



ఆదిలాబాద్ జిల్లా (విజన్ ఆంధ్ర బ్యూరో)నేషన్ విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దడంతో పాటు సమాజానికి ఉపయోగపడే ఆదర్శ పౌరులుగా మలచడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన గురుపూజోత్సవంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆదిలాబాద్ వంటి మారుమూల, ఏజెన్సీ ప్రాంతాల్లోనూ ప్రైవేట్ పాఠశాలలు విద్యాభివృద్ధికి విశేష సేవలందిస్తున్నాయని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 59 వేల మంది, ప్రైవేట్ పాఠశాలల్లో దాదాపు 49 వేల మంది విద్యార్థులు చదువుతున్నారని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులకు సమాజంలో వస్తున్న మార్పులపై పూర్తి అవగాహన లేకపోవచ్చని, ఆ లోటును ఉపాధ్యాయులు పూడ్చి విద్యార్థులకు విలువలతో కూడిన విద్య, జీవన నైపుణ్యాలను అందించాలని సూచించారు.జిల్లా విద్యా పనితీరు సూచీలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రైవేట్ పాఠశాలలు మౌలిక వసతులు, ఉపాధ్యాయుల శిక్షణ, ల్యాబ్‌లు, విద్యార్థుల వివరాలను యూడైస్ ప్లస్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు పరస్పరం ఉత్తమ విధానాలను పంచుకోవాలని, సైన్స్ పార్కులు, సైన్స్ ఫెయిర్లు తదితర వనరులను పరస్పరం వినియోగించుకోవాలని సూచించారు. డిజిటల్ ప్యానెల్స్, కంప్యూటర్ విద్యతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత టూల్స్‌ను వినియోగించి విద్యార్థుల్లో ప్రాథమిక అక్షరాస్యత, ఉచ్చారణ నైపుణ్యాలను పెంపొందించాలని అన్నారు. థియరీతో పాటు ప్రాక్టికల్ లెర్నింగ్‌కు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న 'ఆరోగ్య పాఠశాల' కార్యక్రమాలను ప్రైవేట్ పాఠశాలల్లోనూ అమలు చేయాలని, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, డ్రగ్స్ నివారణ, మానసిక ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. విద్యార్థుల ఆసక్తులను గుర్తించి సరైన కెరీర్ మార్గదర్శనం అందించాలని, వారి ప్రవర్తనలో ప్రతికూల మార్పులు లేదా చెడు అలవాట్లు కనిపిస్తే వెంటనే తల్లిదండ్రులకు సమాచారం అందించి కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం, విద్యాశాఖ సహకరిస్తాయని తెలిపారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులు విద్యను బోధించడమే కాకుండా విద్యార్థులను భవిష్యత్ 'నేషన్ బిల్డర్స్'గా తీర్చిదిద్దే బాధ్యతను నిర్వర్తించాలని అన్నారు. జీవితంలో తాము ఏ స్థాయికి చేరుకున్నా, తమ ఎదుగుదలలో ఉపాధ్యాయుల మార్గదర్శకత్వాన్ని విద్యార్థులు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు. డ్రగ్స్ సమస్యపై విద్యార్థులకు అవగాహన కల్పించి, వారు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. పెరుగుతున్న సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి, సైబర్ నేరాల సమాచారాన్ని వారి ద్వారా తల్లిదండ్రులకు చేరవేయాలని సూచించారు. నేరం జరిగిన తర్వాత స్పందించే పోలీసుల కంటే ముందుగానే విద్యార్థుల్లో సత్ప్రవర్తన, విలువలను పెంపొందించడం ద్వారా నేరాల నివారణకు ఉపాధ్యాయులు కీలకంగా దోహదపడగలరన్నారు. అనంతరం ప్రైవేట్ పాఠశాలల్లో ఉత్తమ సేవలందిస్తున్న ఉపాధ్యాయులను కలెక్టర్, ఎస్పీ ప్రశంసాపత్రాలు, మెమెంటోలతో సత్కరించి శాలువాలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషా, జిల్లా విద్యాశాఖ అధికారిణి మాధవి, ట్రాస్మా ప్రతినిధులు పవన్‌రావు, ఆదినాథ్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శంకరయ్య కాలనీ నూతన కమిటీ అధ్యక్షుడిగా చిల్లా రమేష్ ఎన్నిక



బోడుప్పల్,సెప్టెంబర్ 08(విజన్ ఆంధ్ర) : బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని శంకరయ్య కాలనీ నూతన కమిటీని ఎన్నుకున్నారు.కమిటీ ముఖ్య సలహదారులుగా పి. వెంకట్‌రెడ్డి, అధ్యక్షుడిగా చిల్లా రమేష్,ఉపాధ్యక్షులుగా ఎస్.రాజేష్,బాబు రావు,రంగారెడ్డి,ప్రధాన కార్యదర్శిగా బి. రామ్‌గోపాల్,కోశాధికారిగా శశిధర్,సంయుక్త కార్యదర్శులుగా మహేందర్‌రెడ్డి, రామ్‌చందర్, సాంస్కృతిక కార్యదర్శులుగా జె.నరేందర్,బి. కిరణ్, కార్యవర్గ సభ్యులుగా భరత్,నరేందర్,పి. శ్రీనివాస్,సలహాదారులుగా బిక్షపతి, బిక్షాచారి, బాలరాములు, వెంకటయ్య, వీరాచారి, డీజీపీ శర్మ, ఫణి శర్మలను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా చిల్లా రమేష్ మాట్లాడుతూ అధ్యక్షుడి నన్ను ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమష్టిగా పనిచేస్తుందని సభ్యులు తెలిపారు.

# స్పీకర్‌పై తాతా మధు వ్యాఖ్యలు.. భగ్గుమన్న కాంగ్రెస్ శ్రేణులు

**- స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలని వజ్రేష్ యాదవ్ డిమాండ్**

**- బోడుప్పల్‌లో బొమ్మక్ కళ్యాణ్ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం..**

**- బీఆర్ఎస్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత**

**- కార్యాలయం వైపు వెళ్లేందుకు యత్నించిన కాంగ్రెస్ శ్రేణులను అడ్డుకున్న పోలీసులు**



బోడుప్పల్,సెప్టెంబర్ 8(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. వ్యాఖ్యలను నిరసిస్తూ బోడుప్పల్‌లో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. దీంతో బోడుప్పల్ అంబేద్కర్ చౌరస్తా, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం పరిసరాల్లో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బోడుప్పల్ 11,12వ డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మక్ కళ్యాణ్ కుమార్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, బోడుప్పల్ నగర మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తాతా మధు దిష్టిబొమ్మను అంబేద్కర్ చౌరస్తాలో దహనం చేసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. శాసనసభ స్పీకర్‌పై బాధ్యతాయుత పదవిలో ఉన్న ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు.రాజ్యాంగ పదవులను గౌరవించాలని, రాజకీయంగా భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వ్యక్తుల గౌరవానికి భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య సంప్రదాయాలకు విరుద్ధమని పేర్కొన్నారు.శాసనసభకు అధ్యక్షత వహించే స్పీకర్ పదవికి ప్రత్యేకమైన గౌరవం ఉందని, ఆ పదవిని కించపరిచేలా మాట్లాడటం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించినట్లేనని అన్నారు. రాజకీయ విమర్శలు విధానపరంగా ఉండాలే తప్ప వ్యక్తిగతంగా, అనుచితంగా ఉండకూడదని సూచించారు.తాతా మధు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు తమ మాటల విషయంలో సంయమనం పాటించాలని, రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య సంప్రదాయాలను కాపాడే విధంగా వ్యవహరించాలని హితవు పలికారు. ఇలాంటి వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే ప్రజాస్వామ్య పద్ధతుల్లో మరింత పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. రాజ్యాంగ వ్యవస్థలను, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు కాంగ్రెస్ శ్రేణులు నిరంతరం పోరాడుతాయని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ కార్యాలయం వైపు వెళ్లేందుకు యత్నం


దిష్టిబొమ్మ దహనం అనంతరం కాంగ్రెస్ శ్రేణులు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కార్యాలయం వైపు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ తాతామధు దిష్టిబొమ్మ దగ్ధం చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారకుండా పోలీసులు కాంగ్రెస్ శ్రేణులను వెనక్కి పంపించారు. బీఆర్ఎస్ కార్యాలయం వద్ద అదనపు పోలీసు బలగాలను మోహరించి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యాలయం పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పరిస్థితిని పర్యవేక్షించారు. దీంతో కొద్దిసేపటి అనంతరం పరిస్థితి అదుపులోకి వచ్చింది.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్,బోడుప్పల్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరసింహారెడ్డి,మాజీ కార్పొరేటర్లు రాసాల వెంకటేశ్ యాదవ్, చీరాల నర్సింహ్మ,బింగి జంగయ్య యాదవ్, భూక్య సుమన్ నాయక్,కుంభం కిరణ్ కుమార్ రెడ్డి,మాజీ ప్రధాన కార్యదర్శి విశ్వం గుప్త,యూత్ కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బొమ్మక్ అజయ్,మేడ్చల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూర రాహుల్ యాదవ్,యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుగల ప్రశాంత్,కాంగ్రెస్ నాయకులు హరినాథ్ రెడ్డి,గుర్రాల వెంకటేష్ యాదవ్,నత్తి మైసయ్య,జ్ఞానేశ్వర్,రాపోలు ఉపేందర్,రాసాల కుమార్ యాదవ్, ఉటుకూరి కిషన్ చారి,చింతల శ్రీనివాస్ రెడ్డి,కుర్రి మహేష్,గోపు రాములు,గడ్డం యాదగిరి,ఎలగందుల రాములు,మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సమతా యాదవ్, యూత్ కాంగ్రెస్ నాయకులు రాపోలు రాము,అంబాల అరవింద్ గౌడ్, రాహుల్, సురేష్,తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ క్రాప్ సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలి

**- క్రాప్ సర్వేలో తప్పులు, పెండింగ్‌లకు తావులేకుండా చూడాలి**

**- సేంద్రియ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి**

**- క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండాలి -కలెక్టర్ కోయ శ్రీహర్ష**




పెద్దపల్లి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్-08(విజన్ ఆంధ్ర) : డిజిటల్ క్రాప్ సర్వేను ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి తమ పరిధిలో పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా డిజిటల్ క్రాప్ సర్వే, యూరియా సరఫరా, సేంద్రియ వ్యవసాయం, పంటల సాగు విస్తీర్ణం, రైతులకు అందుతున్న సేవలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ప్రతి రైతు సాగు చేస్తున్న పంట, విస్తీర్ణ వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. నిర్ణీత గడువులోగా సర్వేను పూర్తి చేసి ఎలాంటి తప్పులు, పెండింగ్‌లు లేకుండా చూడాలన్నారు. సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించి, ఆసక్తి ఉన్న వారిని ప్రోత్సహించాలని తెలిపారు. నీటి లభ్యత, నేల స్వభావం, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. ఒకే పంటపై ఆధారపడకుండా లాభదాయకమైన పంటల వైపు రైతులను మళ్లించేందుకు అధికారులు అవగాహన కల్పించాలన్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, పంటల యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణపై సాంకేతిక సూచనలు అందించాలని వ్యవసాయ విస్తరణ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, రైతులకు అందుతున్న సేవలను నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత లక్ష్యాలను పూర్తి చేయాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, సంబంధిత మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ జిల్లా జూనియర్ మరియు సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ సెలెక్షన్స్

వరంగల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 8(విజన్ ఆంధ్ర) ; వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో సోమవారం హన్మకొండ లోని జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో మధ్యాహ్నం 2 గంటలకు వరంగల్ జిల్లాకు చెందిన జూనియర్ సబ్ జూనియర్ బాలబాలికలకు కబడ్డీ సెలక్షన్స్ నిర్వహించడం జరిగినది. ఇందులో భాగంగా వరంగల్ జిల్లాలోని వివిధ మండలాల నుండి 500 మంది బాల బాలికలు పాల్గొనడం జరిగినది ఇందులో TGTWURJC Girls (V)జమాల్పూర్ (M) పర్వతగిరి నుండి 7 గురు బాలికలు అర్హత సాధించడం జరిగినది. అదేవిధంగా Khelo India kabaddi trails కి జిల్లా నుండి TGTWURJC నుండి నాగేశ్వరి స్రవంతి అర్హత సాధించడం జరిగినది. వీరు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ ఛాంపియన్షిప్ పోటీలలో పాల్గొంటారూ. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ ఎ.శైలజ రాణి గారు మరియు పీడీ ఎం.అపర్ణ గారు పీఈటి Svp JVP మరియు ఉపాధ్యాయినీలు అభినందించడం జరిగినది.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటం

***సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్ పోస్టర్ విడుదల***




మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 8(విజన్ ఆంధ్ర) ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి పోరాడాలని పిలుపునిస్తూ తెలంగాణ ఎంప్లాయిస్, గెజిటెడ్ ఆఫీసర్స్, టీచర్స్, వర్కర్స్ అండ్ పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమనికి మద్దతు గా భూత్పూర్ మండల తహసీల్దార్ కార్యాలయ పోస్టర్‌ను విడుదల చేశారు. ఉద్యోగుల ప్రధాన డిమాండ్లలో భాగంగా 1.7.2023 నుంచి పెరిగిన ఫిట్‌మెంట్‌తో 2వ పీఆర్సీని అమలు చేయాలని, ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. అలాగే ఉద్యోగులు, పెన్షనర్ల పెండింగ్ బిల్లులను కనీసం నెలకు రూ.2,000 కోట్ల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (జూా)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (OPS)ను పునరుద్ధరించాలని, NEHS (New Employees Health Scheme)ను పూర్తిస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ హామీలను అమలు చేయడంతో పాటు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 10న నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భూత్పూర్ MRO కార్యాలయం తరపున డిప్యూటీ తహసీల్దార్ ఎం. గీత, సీనియర్ అసిస్టెంట్ మరియు TNGOs భూత్పూర్ యూనిట్ అధ్యక్షుడు రవి కుమార్ లింగం, ఇతర కార్యాలయ సిబ్బందితో పాటు భూత్పూర్ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# పుష్కర పనులకు వేగం పెంచాలి...


**-నాలుగు నెలల్లో రోడ్లు,ఘాట్ల పనులు పూర్తి చేయాలి**

**-పార్కింగ్‌కు భూమిని తాత్కాలికంగా లీజుకు తీసుకోవాలి**

**-తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ ఏర్పాట్లపై దృష్టి**

**-కలెక్టర్ కోయ శ్రీహర్ష**

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్-08(విజన్ ఆంధ్ర) : గోదావరి పుష్కరాలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. రోడ్లు, ఘాట్లు, ఆలయాలు, భూసేకరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి భక్తులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షలో పుష్కరాల ఏర్పాట్లపై చర్చించారు. ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో రూ.25 కోట్లతో చేపడుతున్న రహదారి పనుల టెండర్లను త్వరగా పూర్తి చేసి నాలుగు నెలల్లో పనులు పూర్తిచేయాలన్నారు. మంథని ఆలయాల అభివృద్ధికి మంజూరైన రూ.20 కోట్లతో చేపడుతున్న 15 పనుల్లో 10 పనులకు టెండర్లు పూర్తయ్యాయని, వాటిని వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. భూసేకరణను రైతులతో సఖ్యతగా చర్చించి వేగవంతం చేయాలని, పార్కింగ్‌కు భూమిని తాత్కాలికంగా లీజుకు తీసుకోవాలని సూచించారు. భక్తులకు తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, పార్కింగ్, కేశఖండనం, అన్నదానం వంటి సౌకర్యాలను ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు. ఘాట్ల నిర్మాణంతో పాటు డీ-సిల్టింగ్ పనులు చేపట్టాలని, క్షేత్రస్థాయిలో సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో మంథని ఆర్‌డీఓ సురేష్, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్, మంథని మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ ఏ.డి.సుప్రియ, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# చెమట చుక్కకు చేదోడు!!

- మున్సిపల్ కాంట్రాక్ట్ సిబ్బందికి 'భరోసా' కవచం
- ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ప్రమాద బీమా కల్పించాలి
- ఎస్‌బీఐ శాలరీ ప్యాకేజీ తరహాలో బీమా కల్పించాలి
- సిబ్బంది సంక్షేమంపై ఎస్ ఎస్సీ కమిషన్ సభ్యులు కొంకటి చొరవ



పెద్దపల్లి బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర): పట్టణం నిద్రలేవక ముందే చీపురు పట్టి రోడ్లను ఊడ్చే చేతులు అవి.. మురుగు కాలువల్లో దిగి సమాజం ముఖంపై పేరుకుపోయిన మురికిని కడిగేసి, ప్రాణాలను పణంగా పెట్టే నిస్వార్థ అభాగ్యులు వారు. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, ఇంజినీరింగ్ అంటూ నిత్యం మృత్యువు అంచున నడుస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల జీవితాలు ఎప్పుడూ రక్షణ లేని అగాధంలోనే కొట్టుమిట్టాడుతున్నాయి. పొద్దున పనికి వెళ్లిన మనిషి సాయంత్రానికి క్షేమంగా తిరిగి వస్తాడన్న నమ్మకం లేని ఈ బతుకుల్లో, ఏదైనా ప్రమాదం జరిగితే ఆ కుటుంబాలు రోడ్డున పడాల్సిందేనా? సమాజానికి స్వచ్ఛమైన పరిసరాలను అందించే ఈ శ్రామికులకు కనీస సామాజిక భద్రత కల్పించాల్సిన బాధ్యత మన వ్యవస్థపై లేదా? సరిగ్గా ఇదే మానవీయ కోణాన్ని స్పృశిస్తూ, వారి కన్నీళ్లకు సాంత్వన చేకూర్చేలా తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ప్రభుత్వం ముందు ఒక బలమైన గళాన్ని వినిపించింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శికి మంగళవారం కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పంపిన అధికారిక లేఖ, దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురవుతున్న ఈ అట్టడుగు వర్గాల సంక్షేమానికి సరికొత్త ఆశాకిరణంగా నిలుస్తోంది. గ్రౌండ్ లెవల్ సమస్యలపై సమగ్ర అవగాహన ఉన్న కమిషన్ సభ్యుడు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ ఈ కార్మికుల కడుపుకోతను కమిషన్ దృష్టికి తీసుకొచ్చి, లేఖ రూపకల్పనలో కీలక భూమిక పోషించారు. "వీధులను ఊడ్చి, కాలువలను శుభ్రం చేసే ఈ సిబ్బందిలో అత్యధికులు సామాజికంగా, ఆర్థికంగా అణగారిన ఎస్సీ, ఎస్టీ మరియు నిరుపేద బలహీన వర్గాల వారేనన్నది పచ్చి నిజం; రోజూ చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదీసే ఈ శ్రామికుడికి ఏదైనా ముప్పు వాటిల్లితే ఆ కుటుంబం ఆకలి కేకలతో వీధిన పడాల్సిందేనా?" అని లక్ష్మీనారాయణ అత్యంత ఆవేదనతో తన గళాన్ని వినిపించారు. క్షేత్రస్థాయిలో మేయర్‌గా పనిచేసిన నాటి అనుభవాలను రంగరించి, "ఇది కేవలం కాగితాలపై రాసే సంక్షేమ పథకం కాదు.. బతుకుదెరువు కోల్పోయే ప్రమాదంలో ఉన్న నిరుపేదల ఆత్మగౌరవ పోరాటం" అని ఆయన స్పష్టం చేశారు. విధుల్లో ఉన్నప్పుడే కాకుండా, ప్రమాదవశాత్తు మరణం సంభవించినా లేదా శాశ్వత, పాక్షిక వైకల్యం బారిన పడినా సదరు కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా ప్రభుత్వం, స్థానిక సంస్థలు, ఏజెన్సీలు సమన్వయంతో తక్షణ భరోసా కల్పించాలని ఆ లేఖలో ఆయన బలంగా నొక్కిచెప్పారు. ఈ సంక్షోభానికి ఆధునిక పరిష్కారంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) కార్పొరేట్ శాలరీ ప్యాకేజీని ప్రభుత్వం ఒక ప్రామాణిక నమూనాగా పరిశీలించాలని కమిషన్ ఆ లేఖలో ప్రతిపాదించింది. సాధారణ కార్పొరేట్ ఉద్యోగులకు వేతన శ్రేణుల ఆధారంగా రూ.40 లక్షల నుంచి ఏకంగా రూ.1.10 కోట్ల వరకు ప్రమాద బీమా రక్షణ కల్పిస్తున్న ఎస్బీఐ నెట్‌వర్క్ తరహా వ్యవస్థను, ఈ అసంఘటిత కాంట్రాక్ట్ సిబ్బందికి కూడా అనుసంధానిస్తే వారి జీవితాలకు కొండంత అండ లభిస్తుందని వివరించింది. కార్పొరేట్ వర్గాలకు మాత్రమే పరిమితమయ్యే ఇలాంటి ఆధునిక ఆర్థిక భద్రతా రక్షణలు, రోడ్లపై చెమటోడ్చే మున్సిపల్ కార్మికుడికి దక్కినప్పుడే నిజమైన ప్రజాపాలనకు పరిపూర్ణ అర్థం చేకూరుతుందని తేల్చిచెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది మంది కార్మికుల కుటుంబాల్లో ధైర్యాన్ని నింపేందుకు, ప్రభుత్వం ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఎస్బీఐతో సంప్రదింపులు జరిపి ప్రత్యేక పాలసీని అమలు చేయాలని కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యుడు కొంకటి లక్ష్మీనారాయణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మన వీధులను శుభ్రపరిచే ఆ అభాగ్యుల రేపటి భవిష్యత్తుకు భరోసా దక్కేలా పాలకులు సానుభూతితో, తక్షణమే చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవాల్సిన తరుణమిది.

## జనసేన నాయకుల అరెస్టు కాంగ్రెస్ పిరికిచర్య

- జనసేన పార్టీ వనపర్తి జిల్లా కోఆర్డినేటర్ ముకుంద నాయుడు
- 22-ఏ భూ సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్ నాటకాలు





వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 8(విజన్ ఆంధ్ర) (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న జనసేన శ్రేణులను అక్రమంగా అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ పిరికిపంద చర్యకు నిదర్శనమని జనసేన పార్టీ వనపర్తి జిల్లా కోఆర్డినేటర్ ముకుంద నాయుడు తీవ్రంగా విమర్శించారు. 22-ఏ భూ సమస్యలపై అసెంబ్లీలో సరైన చర్చ జరగకుండా పక్కదారి పట్టించేందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలసి ఈ రాజకీయ డ్రామాకు తెరలేపాయని ఆరోపించారు. శాసనసభ వేదికగా ప్రజాప్రతినిధులు వ్యక్తిగత దూషణలు మాని, ప్రజ ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడాలని డిమాండ్ చేసిన జనసేన తెలంగాణ ఇన్‌చార్జి శంకర్ గౌడ్‌తో పాటు ఇతర నాయకులను పోలీసులు అకారణంగా అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. 22-ఏ నిబంధనల రద్దు, బకాయి పడ్డ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల నెరవేర్పు కోసం జనసేన న్యాయమైన పోరాటం చేస్తోందన్నారు. అరెస్టులతో తమ గొంతును నొక్కాలని చూస్తే సాధ్యం కాదని, జనసేన పార్టీ పెరుగుతున్న ప్రజాదరణను, పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలను చూసి రేవంత్ రెడ్డి ప్రభుత్వం భయపడుతోందని ఎద్దేవా చేశారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల పక్షాన జనసేన పోరాటం ఆగదని ముకుంద నాయుడు స్పష్టం చేశారు.

## పాఠశాలకు జాతీయ నాయకుల చిత్రపటాల అందజేత

చిట్యాల సెప్టెంబర్ 08(విజన్ ఆంధ్ర); వనిపాకల ప్రాథమిక పాఠశాలలో కస్తూరి ఫౌండేషన్ అందించిన జాతీయ నాయకుల చిత్రాలను గ్రామ సర్పంచ్ కొన్రెడ్డి మహిపాల్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ కస్తూరి ఫౌండేషన్ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను అభినందించారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగి తమ గ్రామానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కౌసల్య మాట్లాడుతూ పాఠశాలలో విద్యాబోధన సక్రమంగా కొనసాగుతోందని, విద్యార్థుల్లో సామర్థ్యాల సాధన కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. పాఠశాలకు జాతీయ నాయకుల చిత్రాలను అందించిన కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి చరణ్ కు కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ నాయకుల చిత్రపటాలను పాఠశాలకు అందించడంలో కస్తూరి ఫౌండేషన్ సభ్యులు పంతంగి కరుణాకర్ గౌడ్ ప్రత్యేకంగా సహకరించారు. వారి సహకారానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ చిత్రపటాలు విద్యార్థుల్లో జాతీయ నాయకుల పట్ల గౌరవం, దేశభక్తి భావనలను పెంపొందించడంతో పాటు, వారి జీవితాల నుంచి స్ఫూర్తి పొందేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శంకర్ రెడ్డి, భాగ్యలక్ష్మి, సబిత, విద్యార్థులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# సిస్టంలో తప్పులు.. ఓటర్లకు తప్పని తిప్పలు!

- నోటీసుల పేరుతో ఫోన్లు.. ఓటర్లలో గుబులు..!
- బోడుప్పల్ సర్కిల్‌లో ఓటరు జాబితా సవరణపై అయోమయం..
- బీఎల్‌ఓల తప్పిదమే కొంపముంచిందా?
- డెటా నమోదు,మ్యాపింగ్ చేయకపోవడంమే మళ్లీ నోటీసులా....!




*ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని చెంగిచెర్ల, బోడుప్పల్, పీర్జాదిగూడ, మేడిపల్లి ప్రాంతాల్లో నోటీసుల వ్యవహారం ఓటర్లలో అయోమయానికి దారితీస్తోంది. 2002 నాటి ఓటరు జాబితాలో ఇప్పటికే సరైన వివరాలు బీఎల్‌ఓలకు సమర్పించినప్పటికీ అవి డేటా నమోదు,మ్యాపింగ్ చేయకపోవడంతో నాట్ మ్యాచింగ్‌గా నమోదై మళ్లీ నోటీసులు వస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల స్థాయిలో జరిగిన పొరపాట్లకు సామాన్య ఓటర్లు మూల్యం చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుత ఓటరు జాబితాలో పేర్లు ఉన్నప్పటికీ మళ్లీ నోటీసులు అందడంతో అసలు మా వివరాల్లో లోపం ఎక్కడుంది? గతంలో ఇచ్చిన వివరాలు సిస్టంలో నమోదు కాలేదా అంటూ ఓటర్లు బీఎల్‌ఓలను ఆశ్రయిస్తున్నారు. ఒకే కుటుంబంలోని పలువురికి నోటీసులు రావడం, వృద్ధులకు పాత ఆధారాలు సమర్పించాల్సిన పరిస్థితి ఎదురవుతుండటంతో సమస్య మరింత జటిలంగా మారుతోంది.*

బోడుప్పల్,సెప్టెంబర్ 08(విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి) : మొత్తంగా.. ఓటరు జాబితా సవరణలో పారదర్శకత, ఖచ్చితత్వం అత్యంత కీలకం. ఓటరు చేసిన తప్పిదం లేకుండా అధికారుల డేటా నమోదు లోపం వల్ల నోటీసులు వస్తే.. దాని భారం మళ్లీ ఓటరిపైనే పడకూడదు. మరోవైపు నోటీసు అందిందని ఓటు హక్కు పోయిందనే అపోహలకు కూడా తావులేదు. కచ్చితమైన పరిశీలన అనంతరం తుది జాబితా వచ్చినప్పుడే తుది నిర్ణయం ఉంటుందని అధికారులు చెబుతున్న నేపథ్యంలో, ఓటర్ల హక్కును కాపాడుతూ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల యంత్రాంగంపై ఉంది.

### సరైన వివరాలిచ్చినా.. మ్యాచింగ్ కావడం లేదు !

2002 నాటి ఓటరు జాబితాతో వివరాలను సరిపోల్చే ప్రక్రియలో భాగంగా బీఎల్‌ఓలు ఓటర్ల నుంచి వివరాలు సేకరించారు. పలువురు ఓటర్లు తమకు తెలిసిన మేరకు అవసరమైన సమాచారాన్ని అందించారని చెబుతున్నారు. అయితే ఆ వివరాలను సంబంధిత సిస్టంలో సకాలంలో నమోదు చేయకపోవడంతో నాట్ మ్యాచింగ్ గా చూపించబడి, అదే కారణంతో మళ్లీ నోటీసులు జారీ అవుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇది నిజమైతే ఓటరు చేసిన తప్పిదం లేకపోయినా.. అధికారుల డేటా నమోదు లోపం కారణంగా మళ్లీ ఓటరే వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు అంటున్నారు.

### పాత పత్రాలు లేని వృద్ధుల పరిస్థితి?

నోటీసుల వ్యవహారంలో మరో ప్రధాన సమస్య వృద్ధులకు సంబంధించినదే. దశాబ్దాల క్రితం నాటి పత్రాలు చాలామంది వద్ద అందుబాటులో ఉండకపోవచ్చు. 70, 80 ఏళ్ల వృద్ధులు పాత పుట్టిన ధ్రువీకరణ పత్రాలు, విద్యా పత్రాలు, పాత చిరునామా ఆధారాలు సమకూర్చుకోవడం ఎంత కష్టమో అధికారులు గుర్తించాలని స్థానికులు కోరుతున్నారు.ఓటరు వివరాలు గతంలోనే ఇచ్చి ఉంటే మళ్లీ అదే వివరాల కోసం వృద్ధులను ఎందుకు పరుగులు పెట్టించాలని ప్రశ్నిస్తున్నారు.

### ఒకే ఇంట్లో పలువురికి నోటీసులు

చెంగిచెర్ల, బోడుప్పల్, పీర్జాదిగూడ, మేడిపల్లి ప్రాంతాల్లో కొన్ని కుటుంబాల్లో ఒకరికే కాకుండా పలువురు సభ్యులకు నోటీసులు రావడంతో గందరగోళం నెలకొంది. ప్రస్తుత ఓటరు జాబితాలో పేర్లు ఉన్నప్పటికీ నోటీసులు రావడంతో తమ ఓటు హక్కు ప్రమాదంలో పడిందేమోనని కొందరు ఆందోళన చెందుతున్నారు. అయితే నోటీసు అందినంత మాత్రాన ఓటు హక్కు తొలగించినట్లు కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

### బీఎల్‌ఓల తప్పిదమైతే బాధ్యత ఎవరిది?

ఓటర్లు ఇచ్చిన వివరాలు డేటా నమోదు కాకపోవడం వల్లే 'నాట్ మ్యాచింగ్' వస్తున్నట్లయితే, దానిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యతను నిర్ధారించాలని స్థానికులు కోరుతున్నారు. డేటా ఎంట్రీలో జరిగిన పొరపాటుకు ఓటరును బాధ్యుడిని చేయడం సరికాదని అంటున్నారు. నోటీసులు జారీ చేసే ముందు ఇప్పటికే అందుబాటులో ఉన్న రికార్డులను మరోసారి పరిశీలించి, నిజంగా వివరాల్లో తేడా ఉందా? లేక డేటా అప్‌లోడ్‌లోనే లోపం జరిగిందా? అనే అంశాన్ని అధికారులు నిర్ధారించాలని డిమాండ్ చేస్తున్నారు.

### సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

నోటీసులు అందుకున్న వృద్ధులు, మహిళలు, పాత రికార్డులు లేని కుటుంబాలకు ప్రత్యేక సహాయం అందించేందుకు ప్రతి వార్డు, బూత్ పరిధిలో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. బీఎల్‌ఓలు గతంలో సేకరించిన వివరాలను పరిశీలించి, అవసరమైతే వాటిని సిస్టంలో సరిచేసి ఓటర్లకు ఇబ్బంది లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### అర్హులైన ఒక్క ఓటు కూడా తొలగకూడదు

ఓటరు జాబితా సవరణలో అనర్హుల పేర్లను తొలగించడం ఎంత ముఖ్యమో, అర్హులైన ఓటర్ల పేర్లు పొరపాటున తొలగిపోకుండా చూడటం అంతకంటే ముఖ్యమని స్థానికులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా అధికారుల డేటా నమోదు లోపాల కారణంగా నిజమైన ఓటర్లు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

### అధికారుల తప్పిదం.. ఓటర్లకు శాపం :

- బోడుప్పల్ నగర మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆసర్ల బీరప్ప



ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించారు. 2002 ఓటరు జాబితాకు సంబంధించిన వివరాలను ఓటర్లు ఇప్పటికే బీఎల్‌ఓలకు అందించి నప్పటికీ, వాటిని సిస్టంలో సరిగా నమోదు చేయకపోవడం వల్ల నాట్ మ్యాచింగ్‌గా చూపించి మళ్లీ నోటీసులు ఇవ్వడం సరికాదని ఆయన ఆరోపించారు. ఓటర్లు తమకు సంబంధించిన వివరాలను సక్రమంగా ఇచ్చారు. వాటిని సిస్టంలో అప్‌లోడ్ చేయాల్సిన బాధ్యత అధికారులదే. అధికారులు చేసిన తప్పిదం వల్ల వివరాలు సరిపోలలేదని చూపించి మళ్లీ ఓటర్లకు నోటీసులు ఇవ్వడం ఎంతవరకు సమంజసం? అధికారుల తప్పిదం ఓటర్లకు శాపంగా మారిందని ఆరోపించారు.ప్రత్యేకించి వృద్ధులు, మహిళలు, పాత రికార్డులు లేని కుటుంబాలను మళ్లీ కార్యాలయాల చుట్టూ తిప్పకుండా అధికారులు ముందుగా తమ వద్ద ఉన్న సమాచారాన్ని పరిశీలించి తప్పిదం ఎక్కడ జరిగిందో గుర్తించాలని డిమాండ్ చేశారు.

### అపోహలు వద్దు.. తుది జాబితా వచ్చేవరకు వేచి చూడాలి

- డిప్యూటీ కమిషనర్ ఏ. శైలజ



ఈ అంశంపై డిప్యూటీ కమిషనర్ ఏ. శైలజ ఓటర్లు ఎలాంటి అపోహలకు గురికావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం జరుగుతున్నది వివరాల పరిశీలన, సవరణ ప్రక్రియ మాత్రమేనని, నోటీసు అందినంత మాత్రాన ఓటరు పేరు తొలగించినట్లు కాదని అధికారులు చెబుతున్నారు.ప్రతి ఓటరు వివరాన్ని కచ్చితంగా పరిశీలించిన తర్వాతే తుది జాబితా రూపొందిస్తామని, తుది జాబితా వచ్చిన సమయంలోనే అవసరమైన నిర్ధారణ అనంతరం ఎవరైనా ఓటరు పేరును తొలగించాల్సిన పరిస్థితి ఉంటే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.అందువల్ల నోటీసులు అందుకున్న ఓటర్లు ఆందోళన చెందకుండా సంబంధిత బీఎల్‌ఓలను సంప్రదించి తమ వివరాలను పరిశీలించుకోవాలని సూచిస్తున్నారు.

# విద్యుత్ సరఫరాకు కొత్త బలం!

- అంతాయిపల్లి సబ్‌స్టేషన్ ప్రారంభానికి రంగం సిద్ధం
- గాజులరామారంలో రూ.18 కోట్లతో మరో సబ్‌స్టేషన్
- లో-వోల్టేజ్, సరఫరా అంతరాయాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం
- హెచ్‌ఎంటీ భూ వివాదం ఆర్బిట్రేటర్ పరిధిలోకి
- జగద్గిరిగుట్ట విద్యుత్ సమస్యకు తెర




కుత్బుల్లాపూర్, సెప్టెంబరు 08 (విజన్ ఆంధ్ర): పెరుగుతున్న జనాభా.. విస్తరిస్తున్న నివాస ప్రాంతాలు.. వేగంగా అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక ప్రాంతాలు.. రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ డిమాండ్.. వీటన్నింటికీ అనుగుణంగా మేడ్చల్ డివిజన్‌లో విద్యుత్ మౌలిక వసతులను మరింత బలోపేతం చేసేందుకు టీజీఎస్పీడీసీఎల్ చర్యలు వేగవంతం చేస్తోంది. భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటుతోపాటు ప్రస్తుత విద్యుత్ వ్యవస్థపై ఉన్న భారాన్ని తగ్గించేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇందులో భాగంగా సుమారు రూ.15 కోట్లతో నిర్మించిన అంతాయిపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్ ప్రారంభానికి సిద్ధమవుతుండగా..గాజులరామారంలో రూ.18 కోట్ల అంచనా వ్యయంతో మరో 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు. ఈ రెండు సబ్‌స్టేషన్లు అందుబాటులోకి వస్తే ఆయా ప్రాంతాల్లో లో-వోల్టేజ్, విద్యుత్ సరఫరా అంతరాయాలు గణనీయంగా తగ్గడంతోపాటు అత్యవసర సమయాల్లో ప్రత్యామ్నాయ సరఫరాకు అవకాశం ఏర్పడనుంది. ఈ వివరాలను టీజీఎస్పీడీసీఎల్ డిప్యూటీ ఇంజనీర్ (ఆపరేషన్స్‌మేడ్చల్) పోతు రాజు జాన్ 'విజన్ ఆంధ్ర'కు వెల్లడించారు.

### వినాయక చవితి నాటికి అంతాయిపల్లి సబ్ స్టేషన్

సుమారు రూ.15 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న అంతాయిపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్ పనులు దాదాపు పూర్తయ్యాయని డీఈ తెలిపారు. మిగిలిన స్వల్ప పనులను త్వరితగతిన పూర్తి చేసి వినాయక చవితి నాటికి సబ్‌స్టేషన్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మల్కారం, లాల్‌గడి మలక్‌పేట్ తదితర సబ్‌స్టేషన్లతో అనుసంధానం చేయడం ద్వారా వ్యవసాయ, పారిశ్రామిక, గృహ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందించడంతోపాటు సరఫరా అంతరాయాలను తగ్గించడంలో అంతాయిపల్లి సబ్‌స్టేషన్ కీలకంగా మారుతుందని వివరించారు.

### గాజులరామారంలో రూ.18 కోట్లతో.. కొత్త సబ్ స్టేషన్

కుత్బుల్లాపూర్ ఉపవిభాగం పరిధిలో వేగంగా అభివృద్ధి చెందుతున్న గాజులరామారం ప్రాంతంలో విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రూ.18 కోట్ల అంచనా వ్యయంతో 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్లు డీఈ తెలిపారు. గాజులరామారం సర్వే నంబర్ 12 పరిధిలోని ఆక్సిజన్ పార్కు సమీపంలో సుమారు 30 గుంటల ప్రభుత్వ భూమిని సబ్‌స్టేషన్ కోసం కేటాయించినట్లు చెప్పారు. 1×16 ఎంవీఏ సామర్థ్యంతో నిర్మించనున్న ఈ సబ్‌స్టేషన్‌కు సంబంధించిన టెండర్ ప్రక్రియ తుది దశలో ఉందని, ప్రక్రియ పూర్తికాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

### 50 వేలకుపైగా ఎల్‌టీ సర్వీసుల భారం

ప్రస్తుతం ఉషా ముళ్లపూడి సబ్‌స్టేషన్‌పై 50 వేలకు పైగా ఎల్‌టీ సర్వీసుల భారం ఉందని డీఈ తెలిపారు. గాజులరామారం సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే ఉషా ముళ్లపూడి, కుత్బుల్లాపూర్, జగద్గిరిగుట్ట సబ్‌స్టేషన్లపై ఉన్న లోడ్ ఒత్తిడి తగ్గుతుందని పేర్కొన్నారు. కొత్త సబ్‌స్టేషన్ ద్వారా పరిసర ప్రాంతాలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించడంతోపాటు అత్యవసర సమయాల్లో ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. భవిష్యత్‌లో పెరిగే విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా వ్యవస్థను సిద్ధం చేసేందుకు ఈ చర్యలు దోహదపడతాయని తెలిపారు.

### హెచ్‌ఎంటీ భూ వివాదం.. ఆర్బిట్రేటర్ వద్దకు

కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయం రోడ్డు, వై-జంక్షన్ వద్ద అంబేద్కర్ విగ్రహం సమీపంలోని సర్వే నంబర్లు 238, 239 పరిధిలో విద్యుత్ కార్యాలయ నిర్మాణం, ప్రహరీ గోడ పనులకు సంబంధించి హెచ్‌ఎంటీ సంస్థ హైకోర్టును ఆశ్రయించిన అంశంపైనా డీఈ స్పందించారు. ఈ అంశంపై ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం వివాదాన్ని ఆర్బిట్రేటర్ పరిధిలో పరిష్కరించుకోవాలని సూచించినట్లు తెలిపారు. ఈ వ్యవహారానికి సంబంధించిన గత రికార్డులు, ఉన్నతాధికారుల వద్ద ఉన్న సమాచారాన్ని సేకరిస్తున్నామని చెప్పారు. న్యాయపరమైన విధానాలను అనుసరిస్తూ తదుపరి చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

### జగద్గిరిగుట్ట విద్యుత్ సమస్య పరిష్కారం

జగద్గిరిగుట్ట ఏఈ రాధాకృష్ణ, లైన్‌మెన్ రాకేశ్‌లకు కోర్టు సమన్లు, ఆర్టీఐ కమిషన్ నోటీసులు జారీ అయ్యాయన్న అంశంపై కూడా డీఈ వివరణ ఇచ్చారు. సంబంధిత వినియోగదారు సంస్థకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించిన అనంతరం విద్యుత్ కనెక్షన్‌ను పునరుద్ధరించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ సమస్య పరిష్కారమైందని, సంబంధిత ఏఈతో మాట్లాడి వివరాలను ధ్రువీకరించినట్లు డీఈ పేర్కొన్నారు.

### లో-వోల్టేజ్‌పై ప్రత్యేక దృష్టి

మేడ్చల్ డివిజన్ పరిధిలో నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ఇప్పటికే పలు ప్రాంతాల్లో అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు డీఈ తెలిపారు. ఎక్కడైనా లో-వోల్టేజ్, తరచూ విద్యుత్ సరఫరా అంతరాయాలు ఉంటే స్థానిక విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని వినియోగదారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి అవసరమైన ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తూ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే తమ ప్రధాన లక్ష్యమని టీజీఎస్పీడీసీఎల్ డీఈ పోతు రాజు జాన్ తెలిపారు.

## రాహుల్ గాంధీని ప్రధాన మంత్రి ని చేయడమే మన ఏకైక లక్ష్యం

-డిసిసి అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి

సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్:08(విజన్ ఆంధ్ర ) రాహుల్ గాంధీ ని ప్రధాన మంత్రి గా చేయడమే ఏకైక లక్ష్యం గా ప్రతీ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని సంగారెడ్డి డిసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సంగారెడ్డి పట్టణం లో జరిగిన ఆదివాసి కాంగ్రెస్ జిల్లా కమిటీ ఎన్నికకోసం ఏర్పాటుచేసిన సంఘటన్ సృజన్ కార్యక్రమం లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకముందునుండి దేశ ప్రజలకు సేవ చేస్తున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. స్వర్గీయ ఇందిరాగాంధీ ఆదివాసీలకు ప్రత్యేక గుర్తింపు నిచ్చారని గుర్తు చేశారు.కార్యక్రమానికి హాజరైన ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర వైస్ చైర్మన్ లింగం నాయక్ మాట్లాడుతూ ఆదివాసీలు, యానాదిలు, చెంచులు మొదటినుండి కాంగ్రెస్ పార్టీ కి అండగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్న ప్రతీ గిరిజనుడి కి గుర్తింపు ఇచ్చేందుకు సంఘటన్ సృజన్ అభియాన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు జిల్లా కమిటీ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమం లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్,జిల్లా అధ్యక్షుడు రామ్ చందర్ నాయక్, ఇంచార్జ్ కిషన్ నాయక్,బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ జార్జ్, టౌన్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.